PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 75 | విజయవాడ, ఆదివారం 15 అక్టోబర్ 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 15 October 2023 | Rs

నాలుగు రోజుల్లో 11 కేసులు

- మధ్యప్రదేశ్‌లో పాత్రికేయునిపై మంత్రి అనుచరుల వేధింపులు

5

ప్రజల హక్కుగా ఆరోగ్యం

- చట్టం చేయాలని సిఎంకు ప్రజారోగ్య వేదిక లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరోగ్యం ప్రజల హక్కుగా చట్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజారోగ్య వేదిక కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆ వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి రమణయ్య, టి కామేశ్వరరావు శనివారం లేఖ రాశారు. ఆరోగ్యం అన్నది ప్రజల హక్కుగా ఉండాలని శుక్రవారం నిర్వహించిన వైద్యారోగ్యశాఖ సమీక్షలో సిఎం ప్రకటించడాన్ని అభినందిస్తున్నామని, ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యతగా ఉండాలని చెప్పడం పట్ల హర్షిస్తున్నామని పేర్కొన్నారు. 'ఆరోగ్య హక్కు'కు ప్రభుత్వం వెంటనే చట్టం చేయాలని కోరారు. దీనిని మేనిఫెస్టోలో కూడా పొందుపరచాలని కోరారు. ఏప్రిల్‌లో రాజస్థాన్ ప్రభుత్వం ఆరోగ్య హక్కును చట్టం చేసిందని గుర్తు చేశారు. ప్రజల ఆరోగ్య సమస్యలపై చాలా ఏళ్ల నుంచి క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య వేదికగా పనిచేస్తున్నామని తెలిపారు. తమ అనుభవాలను ప్రభుత్వం ఉపయోగించుకోవాలని కోరారు.

ఏకపక్షమే..

కదం తొక్కిన టీమిండియా బౌలర్లు
పాకిస్తాన్‌పై అలవోక విజయం

అహ్మదాబాద్: మొతేరాలో పరుగుల వరద పారలేదు.. హోరాహోరీ పోరు అస్సలు లేదు.. ఈ మ్యాచ్‌ను కనులారా వీక్షించడానికి వెళ్లిన అభిమానులకు ఓ రకంగా క్రికెట్ మజా దక్కలేదనే చెప్పాలి. ఎందుకంటే అంతా ఏకపక్షమే.. 155 పరుగులకు 2వికెట్లు కోల్పోయి పటిష్టస్థితిలో నిలిచిన పాకిస్తాన్.. 191పరుగులకే ఆలౌట్ కావడం.. ఆ లక్ష్యాన్ని టీమిండియా 30.3ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి ఛేదించడం చక చకా జరిగిపోయాయి. దీంతో వన్డే ప్రపంచకప్‌లో భారత్ 8-0తో పాకిస్తాన్‌పై పైచేయి సాధించింది. టాస్ గెలిచిన కెప్టెన్ రోహిత్ శర్మ తొలుత బౌలింగ్‌కే మొగ్గుచూపాడు. బౌలర్లు కెప్టెన్ నమ్మకాన్ని వమ్ము చేయక.. తొలి రెండు వికెట్లను 73పరుగుల్లోపే కూల్చారు. ఆ తర్వాత కెప్టెన్ బాబర్(50), వికెట్ కీపర్ రిజ్వాన్(49) కలిసి 3వ వికెట్‌కు 82పరుగుల జతచేశారు. దీంతో పాకిస్తాన్ జట్టు 2వికెట్ల నష్టానికి 155పరుగులు చేసి భారీ స్కోర్ దిశగా పయనించసాగింది. డ్రింక్ విరామం తర్వాత భారత బౌలర్లు ఒక్కసారిగా చెలరేగారు. సిరాజ్ పాకిస్తాన్ కెప్టెన్ బాబర్‌ను, బుమ్రా వికెట్ కీపర్ రిజ్వాన్ వికెట్లను టపటపా పడగొట్టారు. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు అదే రీతిలో పెవీలియన్ ముఖం పట్టారు. దీంతో పాక్‌జట్టు 36పరుగుల వ్యవధిలోనే మిగిలిన ఎనిమిది వికెట్లనుకోల్పోయింది. లక్ష్య ఛేదనలో టీమిండియా ఓపెనర్ శుభ్‌మన్(16), కోహ్లి(16) నిరాశపరిచినా.. కెప్టెన్ రోహిత్ శర్మ(86; 63బంతుల్లో 6ఫోర్లు, 6సిక్సర్లు), శ్రేయస్(52నాటౌట్; 3ఫోర్లు, 2సిక్సర్లు) విజృంభించారు. దీంతో టీమిండియా 30.3ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 192పరుగులు చేసి అవలీలగా విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బుమ్రాకు లభించింది.

వివరాలు 6లో

స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లకు అవస్థలు

- కొత్త వెర్షన్‌తో సమస్యలు
- ప్రైమ్ 2.0 లోపభూయిష్టం
- హక్కు విడుదలకు రెట్టింపు రుసుం

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో పైలట్ ప్రాజెక్టుగా తీసుకొచ్చిన ప్రైమ్ 2.0 వెర్షన్ సాఫ్ట్‌వేర్ లోపభూయిష్టంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ ఒకటో తేదీన కృష్ణా జిల్లాలో 13, ఎన్‌టిఆర్ జిల్లాలో 13, కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఈ వెర్షన్‌ను పైలట్ ప్రాజెక్టుగా తీసుకొచ్చింది. ఇప్పటికి 45 రోజులైనా సాఫ్ట్‌వేర్‌లో సమస్యల కారణంగా వివిధ డీడ్‌లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సమస్యగా మారడం, తీవ్ర జాప్యం జరుగుతోంది. జాయింట్ ఆస్తిలోని ఒకరు హక్కు విడుదల చేసుకోవడానికి సంబంధిత వ్యక్తి వాటా ఆస్తి విలువపై మూడు శాతం స్టాంప్ డ్యూటీ, 0.5 శాతం రిజిస్ట్రేషన్ ఫీజుగా చెల్లించాలి. హక్కు విడుదల చేసుకునే వ్యక్తితోపాటు జాయింట్‌దారుని మిగిలిన ఆస్తికీ స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని సాఫ్ట్‌వేర్ చూపుతోంది. ఈ నేపథ్యంలో కృష్ణా జిల్లా మొవ్వ రిజిస్ట్రేషన్ కార్యాలయ పరిధిలోని ఓ గ్రామంలో 1.90 ఎకరాల హక్కు విడుదలకుగాను రూ.22.80 లక్షలకు స్టాంప్ డ్యూటీ రూ.68,400, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.11,400 చెల్లించాలి. అయితే, జాయింట్ ఆస్తికి సంబంధించి స్టాంప్ డ్యూటీ రూ.1,59,600, రిజిస్ట్రేషన్ ఫీజు రెట్టింపు చెల్లించాలని సాఫ్ట్‌వేర్ సూచించింది. ఈ మొత్తం భారంగా ఉండడంతో సంబంధిత వ్యక్తులు రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకున్నారు. దస్తావేజుల్లో ఉండే లోపాలను సెల్ఫ్‌గా సవరించుకునేందుకు గత ఏడాది ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. నూతన విధానంలో ఈ సవరణకు అవకాశం లేదు. కుటుంబ సభ్యుల పార్టేషన్ డీడ్ ఎంట్రీ ఫార్మెట్ సక్రమంగా లేదు. ఇతర డాక్యుమెంట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సంబంధిత అధికారి ఫింగర్ ప్రింట్ పెట్టగానే డిజిటల్ సైన్ అవ్వాలి. కానీ, ఒక్కోసారి డిజిటల్ సైన్ అవ్వకుండా నిలిచిపోతోంది. దీంతో, రిజిస్ట్రేషన్లు మరుసటి రోజుకు వాయిదా పడుతున్నాయి. స్థిరాస్తిని కొనుగోలు చేసి నగదు చెల్లించిన వారికి మిగతా 2లో

పాముకాటు మరణాలపై చర్యలేవి ?

- కేంద్రాన్ని ప్రశ్నించిన ఎన్‌హెచ్‌ఆర్‌సి

భువనేశ్వర్ : పాము కాటుతో సంభవిస్తున్న మరణాలపై, వాటిని నివారించేందుకు తీసుకుంటున్న చర్యలపై సవివరమైన నివేదికను అందజేయాల్సిందిగా జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) కేంద్ర, ఒడిషా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలను ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఏటా 58 వేలకు పైగా పాము కాటు మరణాలు నమోదవుతున్నాయని పేర్కొంటూ మానవ హక్కుల లాయర్ రాధాకాంత్ త్రిపాఠి ఎన్‌హెచ్‌ఆర్‌సి దృష్టికి తీసుకొచ్చారు. ఒడిషాలో అన్ని విపత్తుల మరణాల్లో పాము కాటు మరణాలు 40 శాతానికి పైగా వున్నాయని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పాము విషానికి విరుగుడు మందులు వుండకపోవడమే ప్రధాన కారణమన్నారు. డిసెంబరు 16 కల్లా కమిషన్‌కు నివేదిక అందాలని అధికారులను కమిషన్ ఆదేశించింది.

బిజెపికి ఒక్క ఓటు వేసినా చేటే

- మహిళాభివృద్ధికీ ముఖ్యమంత్రి బటన్ నొక్కాలి
- స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- 2024 ఎన్నికల నుంచే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలి
- రాష్ట్ర మహిళా సదస్సులో వక్తలు

రాష్ట్ర మహిళా సదస్సులో ప్రసంగిస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మరియం ధావలే, వేదికపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, సుబ్బరావమ్మ, సామాజికవేత్త వసుంధర తదితరులు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

'సనాతన ధర్మం' పేరిట అణచివేతకు గురిచేస్తూ, అశాస్త్రీయ భావజాలాన్ని రుద్దుతూ మహిళలకు రక్షణ లేకుండా చేస్తోన్న బిజెపికి 2024 ఎన్నికల్లో ఆంధ్ర రాష్ట్రంలోనే కాదు.. దేశవ్యాప్తంగా ఒక్క ఓటు కూడా వేయొద్దు' అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మరియం ధావలే పిలుపునిచ్చారు. 'అసమానతలు లేని అభివృద్ధి' నినాదంతో తిరుపతిలోని టిఎంఆర్ కల్యాణ మండపంలో శనివారం రాష్ట్ర మహిళా సదస్సు జరిగింది. 2024 ఎన్నికల నుంచే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని ఈ సదస్సు డిమాండ్ చేసింది. మహిళలంటే తనకు ఎనలేని గౌరవమని, అక్కచెల్లెమ్మలకు అండగా ఉంటానని నిత్యం చెప్పున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి మహిళాభివృద్ధికీ బటన్ నొక్కాలని, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సదస్సు కోరింది. రాష్ట్రంలో దిశ చట్టానికి దశదిశా లేకుండా పోయిందని ఆక్షేపించింది. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.సాయిలక్ష్మి అధ్యక్షత వహించిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మిగతా 2లో

బాబు బ్యారక్‌లో టవర్ ఏసి

- అధికారులను ఆదేశించిన ఎసిబి కోర్టు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో, రాజమహేంద్రవరం ప్రతినిధి



రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న చంద్రబాబు నాయుడు ఆరోగ్య పరిస్థితుల రీత్యా టవర్ ఎసి ఏర్పాటు చేయాలని ఎసిబి కోర్టు ఆదేశించింది.చంద్రబాబు ఆరోగ్యంపై విజయవాడ ఎసిబి కోర్టులో శనివారం సాయంత్రం హౌస్ మోషన్ పిటిషన్‌ను ఆయన తరపు న్యాయవాదులు దాఖలు చేశారు. సిద్ధార్థలూథ్రా, జి. సుబ్బారావు ఆన్‌లైన్‌లో వాదనలు వినిపించారు. ఆయన ఛాతీ, చేతులు, మెడ, గడ్డం, వీపు తదితర శరీర భాగాల్లో దద్దుర్లు, స్కిన్ అలర్జీ ఉన్నట్లు గుర్తించి. చల్లని వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలంటూ జిజిహెచ్ వైద్యులు ఇచ్చిన నివేదికను వారు న్యాయమూర్తి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన న్యాయ మూర్తి వైద్యుల సూచనకు అనుగుణంగా చంద్రబాబు బ్యారక్‌లో చల్లదనం ఉండేలా టవర్‌ఎసిని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జైలులో చంద్రబాబుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. జైలులో ఎసి పెట్టేందుకు నిబంధనలు ఒప్పుకోవని, కోర్టు ఆదేశిస్తే చూస్తామని జైళ్లశాఖ డిఐజి రవికిరణ్ చెప్పిన విషయం తెలిసిందే.

జైలు వద్ద ఉత్కంఠ

శనివారం ఉదయం నుండి జైలు వద్ద ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. చంద్రబాబు ఆరోగ్యంపై మీడియాలో వార్తలు రావడం, వైద్యులు ఇచ్చిన నివేదిక వెల్లడి కావడం, ఈ విషయాన్ని బాబు తరపు లాయర్లు కోర్టు దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించడం తదితర అంశాల్లో జైలు అధికారుల్లో చర్చనీయాంశంగా మారాయి. మరోవైపు శనివారం ములాఖత్‌కు వచ్చిన బాబు కుటుంబ సభ్యులు జైలు అధికారుల తీరు పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. జైళ్లశాఖ డిఐజి రవికిరణ్‌తో లోకేష్ వాగ్వివాదానికి దిగినట్లు సమాచారం, చంద్రబాబు అస్వస్థత రీత్యా ప్రత్యేక సదుపాయాలు అవసరమని వైద్యులు సూచించినా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. . తన తల్లి నారా భువనేశ్వరి, టిడిపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌తో కలిసి చంద్రబాబుతో లోకేష్ సోమవారం ములాఖత్ అయ్యారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 గంటల వరకూ ములాఖత్ జరిగింది. ములాఖత్ అనంతరం మీడియాతో మాట్లాడకుండా లోకేష్, భువనేశ్వరి వెళ్లిపోయారు. కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ ఎన్నికలపై చంద్రబాబుతో చర్చించినట్టు తెలిపారు.

పరిశీలించిన వైద్యబృందం

ఈ పరిణామాల నేపథ్యంలో జైలు అధికారుల విజ్ఞప్తితో డాక్టర్ శివకుమార్ నేతృత్వంలో ఐదుగురు వైద్యుల బృందం చంద్రబాబుకు శనివారం మరోసారి వైద్య పరీక్షలు నిర్వహించింది. అనంతరం జైలు కాన్ఫరెన్స్ హాలులో జైళ్ల శాఖ డిఐజి రవికిరణ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ శివకుమార్ వివరాలను వెల్లడించారు. చంద్రబాబుకు సుగర్, బిపి, ఊపిరితిత్తులు, టెంపరేచర్ తదితర పరీక్షలన్నీ నార్మల్‌గా ఉన్నట్టు తెలిపారు. కేవలం చర్మ సంబంధిత సమస్య మాత్రమే ఉందని చెప్పారు. ఆయన తీసుకుంటున్న ఆహారం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం 67 కేజీల బరువు ఉన్నారని చెప్పారు. ఎండవేడిమి కారణంగా డీహైడ్రేషన్ సహజమని, చెమట ఎక్కువగా పట్టడడంతో రాషెస్ వస్తుంటాయని తెలిపారు. చల్లని వాతావరణం అవసరమని జైలు అధికారులకు సూచించామని తెలిపారు చంద్రబాబుతో తమ బృందం మాట్లాడిందని, ఆయన యాక్టివ్‌గా సమాధానాలు ఇచ్చారని మిగతా 2లో

నిపుణులైన వైద్య బృందాన్ని నియమించండి

- చంద్రబాబు ఆరోగ్యంపై సిపిఎం రాష్ట్రకమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆరోగ్యంపై నిపుణులైన వైద్య బృందాన్ని నియమించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాజమండ్రి జైలులో ఉన్న చంద్రబాబు ఆరోగ్యంపై మీడియాలో వస్తున్న వార్తలపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలోని గవర్నర్‌పేటలో జరిగిన సిపిఎం విజయవాడ ప్రజా పోరుబాట ముగింపు సభ సందర్భంగా విలేకరులతో చంద్రబాబు ఆరోగ్యంపై ఆయన మాట్లాడారు. అధికారులు ఇచ్చిన వివరణలు సంతృప్తికరంగా లేవని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అవసరమైతే ఆస్పత్రికి తరలించి తక్షణం వైద్య సహాయం అందించాలని కోరారు.

రాజకీయ లబ్ధికోసమే చంద్రబాబు ఆరోగ్యంపై డ్రామాలు

- మంత్రి బొత్స

5

ఇజ్రాయిల్ దాడిలో మరణించిన పాలస్తీనీయులు

ఇజ్రాయిల్ బరితెగింపు

- ముంచుకొస్తున్న ఊచకోత ముప్పు
- నెతన్యాహు ప్రభుత్వ విధ్వంసకర దాడులపై ఐరాస ఆందోళన
- పాలస్తీనాకు సంఘీభావంగా ప్రపంచ వ్యాపితంగా ప్రదర్శనలు

న్యూయార్క్ : ఇజ్రాయిల్ భీకర దాడులతో గాజా పరిసర ప్రాంతాల్లో ఊచకోత (మూకుమ్మడి మారణహోమం)ముప్పు పొంచివుందని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం మిగతా 2లో

అదాని ఎయిర్‌పోర్టులపై కేంద్రం దర్యాప్తు

- కంటితుడుపు చర్య : కాంగ్రెస్

న్యూఢిల్లీ : అదాని గ్రూపునకు చెందిన రెండు ఎయిర్‌పోర్టుల ఆర్థిక లావాదేవీలపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు ప్రారంభించింది. ముంబయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ (ఎంఐఎఎల్), నవీ ముంబయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ (ఎన్‌ఎంఐఎఎల్) యొక్క ఆర్థిక లావాదేవీలను, ఇతర ముఖ్యమైన పత్రాలను అందచేయాలని కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ అదాని గ్రూపు సంస్థలను ఆదేశించింది. ఈ విషయాన్ని ఆ గ్రూపునకు చెందిన అదాని ఎంటర్‌ప్రైజెస్ స్వయంగా ధృవీకరించింది. ఈ మేరకు దేశంలోని పలు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఆ సంస్థ రాసిన లేఖ శనివారం వెలుగులోకి వచ్చింది. 2017-18 నుండి 2021-22 ఆర్థిర సంవత్సరాల వరకు ఉన్న పూర్తిస్థాయి సమాచారాన్ని అందచేయాలని కేంద్ర ప్రభుత్వం కోరినట్లు ఈ లేఖలో అదాని సంస్థ తెలియచేసింది. కార్పొరేట్ మంత్రిత్వశాఖ. హైదరాబాద్ విభాగం నుండి తమకు ఆదేశాలు అందినట్లు తెలిపింది. దేశ వ్యాప్తంగా కలకలం రేపిన హిండెన్‌బర్గ్ నివేదికలో అదాని గ్రూపు అక్రమాలను వివరంగా పేర్కొన్న సంగతి తెలిసిందే. అనంతర పరిణామాల్లో భాగంగానే తాజాగా కేంద్ర ప్రభుత్వం ఈ చర్యను చేపట్టిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే, కాంగ్రెస్ పార్టీ దీనిని కంటి తుడుపు చర్యగా కొట్టిపారేసింది. ఈ మేరకు ఆ పార్టీ నేత జైరామ్ రమేష్ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు చేశారు. తన కార్పొరేట్ ముఖాన్ని కాపాడుకునేందుకే మంత్రిత్వశాఖను రంగంలోకి దించిందని, పి.ఆర్ మాయాజాలాన్ని మోడీ ప్రభుత్వం ప్రారంభించిందని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి అదాని అక్రమాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏం జరిగింది...?

ట్యాక్స్ హెవెన్‌ల ద్వారా భారీ మొత్తంలో పన్నులను ఎగవేశారని, అక్రమ పద్ధతులలో షేర్ విలువను భారీగా పెంచుకున్నారని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. యుపిఎ ప్రభుత్వ హయంలోనే అదాని అక్రమాలపై సెబి దర్యాప్తు ప్రారంభించిందని, కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ దర్యాప్తు ప్రక్రియ ఆగిపోయిందని కూడా హిండెన్‌బర్గ్ పేర్కొనడం అప్పట్లో కలకలం రేపింది. ఈ ఆరోపణలపై విచారణకు మిగతా 2లో

పాలస్తీనాకు ఐప్సో సంఘీభావం

- జంతర్‌మంతర్ వద్ద ఆందోళన

పరస్పర ఆధారిత ప్రపంచంలో ఏ అంశాన్నీ వేరుగా చూడలేం

- జి20 స్పీకర్ల సదస్సు ముగింపులో ఓం బిర్లా

అణచివేతల కాలంలో న్యాయవ్యవస్థే ఆశా కిరణం

- ఒరిస్సా హైకోర్ట్ మాజీ సిజే మురళీధరన్

5

అంతర్జాతీయ వలస పక్షుల దినోత్సవం

దక్షిణ అమెరికా నుంచి ఉప్పలపాడు పక్షుల సంరక్షణా కేంద్రానికి చేరుకున్న ఫ్లెమింగో పక్షులు, వాటి పిల్లలు. ఫ్లెమింగో పక్షులు ఇక్కడే గుడ్లు పెట్టి, పొదిగి, పిల్లలు ఎగరడం నేర్చుకున్నాక వాటిని తీసుకుని స్వస్థలాలకు వెళ్తాయి.
-ఫొటో : టివి రమణ

అంతర్జాతీయ వలస పక్షుల దినోత్సవాన్ని అక్టోబర్, మే నెలల్లో రెండవ శనివారం ప్రతి ఏడాది నిర్వహిస్తారు. స్థానిక ప్రజల్లో వలస పక్షులపై అవగాహన పెంచడం, వాటి సంరక్షణకు అంతర్జాతీయ సహకారం పొందడం ఈ దినోత్సవ లక్ష్యం. దీనిలో భాగంగా శనివారం గుంటూరు జిల్లా ఉప్పలపాడు పక్షుల కేంద్రంపై ప్రత్యేక పోస్టల్ ఎన్వలప్ కవర్‌ను విడుదల చేశారు. అటవీశాఖ ప్రధాన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అటవీశాఖ ముఖ్య సంరక్షణ అధికారి శాంతిప్రియ పాండే, విజయవాడ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ డివిఎస్ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పోస్టల్ ఎన్వలప్ కవర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

పోరాటంతోనే కేంద్రం కళ్లు తెరిపిస్తాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఉక్కు పరిరక్షణ పోరాటాన్ని ఉధృతం చేసి కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 975వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ సిఐ అండ్ సిసిపి విభాగం కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్రం వెనక్కు తగ్గి స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లకు అవస్థలు

(మొదటి పేజీ తరువాయి)

విక్రయించిన వారు ఆ మరుసటి రోజు రిజిస్ట్రేషన్‌కు సహకరించక పోవడంతో వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. కంకిపాడు ప్రాంతంలో ఘర్షణ కూడా చోటుచేసుకుంది. ఇటువంటి గందరగోళాల వల్ల స్థిరాస్తి వ్యాపారం మందగించింది. జిల్లా కేంద్రం మచిలీపట్నంలో రోజుకు 50 వరకు రిజిస్ట్రేషన్లు జరగాల్సి ఉండగా, వాటి సంఖ్య 30కి పడిపోయింది.

సాంకేతిక సమస్యల పరిష్కారానికి చర్యలు

రిజిస్ట్రేషన్ శాఖ పైలట్ ప్రాజెక్టుగా కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో ప్రైమ్ 2.0 వెర్షన్‌ను తీసుకొచ్చింది. రిజిస్ట్రేషన్లు చేసే క్రమంలో కొన్ని సాంకేతిక సమస్యలను గుర్తిస్తున్నాం. వాటిని పరిష్కరించాల్సిందిగా ఉన్నతాధికారులను ఎప్పటికప్పుడు కోరుతున్నాం.

- కాట్రగడ్డ జగన్మోహనరావు, మచిలీపట్నం రిజిస్ట్రార్

సమస్యలు పరిష్కరించాలి

నగదు చేతులు మారిన వెంటనే స్థిరాస్తి లావాదేవీలు, రిజిస్ట్రేషన్లు జరిగిపోవాలి. లేకపోతే క్రయవిక్రయదారుల మధ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రైమ్ 2.0 వెర్షన్లో సమస్యలను వెంటనే సవరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

- టి.హరికృష్ణ, డాక్యుమెంట్ రైటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు

అదాని ఎయిర్‌పోర్టులపై కేంద్రం దర్యాప్తు

(మొదటి పేజీ తరువాయి)

మే నెలలో సుప్రీంకోర్టు ఒక ప్యానెల్‌ను కూడా నియమించింది. ఈ నేపథ్యంలో గత వారంలో ప్రచురించిన ఒక కథనంలో అదాని గ్రూపుపై తమ దర్యాప్తును మధ్యలోనే ఎందుకు ఆపివేయాల్సివచ్చిందో వివరిస్తూ ఒక సమగ్ర నివేదికను సెబి అత్యున్నత న్యాయస్థానానికి సమర్పించనుందని రాయిటర్స్ పేర్కొంది. ఫైనాన్షియల్ టైమ్స్ గురువారం ప్రచురించిన ఒక కథనంలో బొగ్గు దిగుమతుల్లో అదాని గ్రూపు చేసిన అక్రమాలను, భారతీయ విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు అత్యధిక ధరలకు అంటకట్టిన తీరును వివరించింది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఒసిసిఆర్‌పి) ఒక నివేదికలో అదాని కుటుంబ భాగస్వాములు ఆఫ్‌షోర్ ఫండ్లను వినియోగించి స్టాక్ మార్కెట్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారని పేర్కొన్నట్లు సమాచారం. వరసగా చోటుచేసుకుంటున్న ఈ పరిణామలు, త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తాజా విచారణకు కేంద్ర ప్రభుత్వం ఆదేశించి ఉంటుందన్న అభిప్రాయం పరిశీలకుల్లో వ్యక్తమవుతోంది.

ఎన్ని ఎయిర్‌పోర్టులు

అదాని గ్రూపు ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ప్రస్తుతం ఏడు ఎయిర్‌పోర్టులు ఉన్నాయి. వీటిలో ఆరింటిని కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాల్లో భాగంగా 2019వ సంవత్సరంలో అదాని గ్రూపు సొంతం చేసుకుంది. అప్పట్లోనే దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి. లక్నో, మంగళూరు,అహ్మదాబాద్, జైపూర్,గౌహతి, తిరువనంతపురం ఎయిర్‌పోర్టులు ఈ జాబితాలో ఉన్నాయి. నవీ ముంబాయి ఎయిర్‌పోర్టును ఆ సంస్థ నిర్మిస్తోంది. భారతదేశంలోని విమాన ప్రయాణికుల్లో 25 శాతం మంది ఈ ఎయిర్‌పోర్టుల గుండా ప్రయాణం చేస్తారని అంచనా! అదానికున్న నౌకాశ్రయాలనుండి 40 శాతం భారతదేశపు రవాణా సాగుతున్నట్లు మరో అంచనా. ఈ క్రమంలో అదానిగ్రూపుపై పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సంయుక్తపార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేసి విస్తృత దర్యాప్తును చేపట్టాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను మోడీ సర్కారు పట్టించుకోవడం లేదు.

సిపిఎం విశాఖ వెళ్లి ఉద్ధరించేదేమీలేదు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- 'విజయవాడ సెంట్రల్'లో ముగిసిన ప్రజాపోరు పాదయాత్ర

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ముగింపు పాదయాత్రలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ

వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో ఉద్ధరించిందేమీలేదని, ఇప్పుడు విశాఖపట్నం వెళ్లి ఒరగబెట్టేదేమిలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఇప్పటి వరకు విజయవాడను ఏవిధంగానూ అభివృద్ధి చేయలేదని తెలిపారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో చేపట్టిన 'సిపిఎం ప్రజాపోరు పాదయాత్ర' శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా బీసెంట్ రోడ్డులో ప్రదర్శన, ముగింపు సభ నిర్వహించారు. సభకు ముందుగా నగరంలోని 23, 24 డివిజన్లలో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం పార్టీ సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాసంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నుల పేరుతో రూ.లక్షల కోట్లు వసూలు చేస్తూ ప్రజలను పీక్కుతింటున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ, అభివద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కేంద్రంతో జతకట్టి అదానీ తదితర కార్పొరేట్లకు సహజ వనరులను కట్టబెడుతోందని తెలిపారు. రాష్ట్రంలో కేజీ బేసిన్ నుండి గ్యాస్ ఉత్పత్తి అవుతోందని, ఈ నేపథ్యంలో రూ.400లకే గ్యాస్ ఇచ్చే అవకాశం ఉన్నా రూ.950లకు పెంచారన్నారు. సోలార్ విద్యుత్‌ను రూపాయికి ఒక యూనిట్ ఉత్పత్తి చేసే అవకాశమున్నా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం భారీగా విద్యుత్ ఛార్జీలను పెంచారని తెలిపారు. పేదలకు ఇళ్లు, ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి నమ్మకద్రోహం చేశాయన్నారు. పౌర సదుపాయాలను వ్యాపారమయం చేశారని తెలిపారు. ప్రజారోగ్యం దెబ్బతిని, జ్వరాలు విజంభిస్తున్నా పాలకులు మొద్దు నిద్రలో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు బూతు రాజకీయాల్లో మునిగి తేలుతుండగా... ప్రజా సమస్యలే అజెండాగా చేసుకొని సిపిఎం రాజీలేని ప్రజాపోరాటాలు చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. పాదయాత్రకు నేతృత్వం వహించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ విజయవాడలో గృహ నిర్మాణంపై అధికార పార్టీ ప్రజా ప్రతినిధులతో తాము బహిరంగ చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, నగర నాయకులు కాజ సరోజ, ఎం.సీతారాములు, టి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

17 జిల్లాల్లో నూతన శిల్పారామాల నిర్మాణం

- గుంటూరులో ప్రారంభించిన మంత్రి రోజా
- చిన్నారులతో కలిసి నృత్యం

గుంటూరు శిల్పారామంలో చిన్నారులతో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి రోజా

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలోని 17 జిల్లాల్లో నూతనంగా శిల్పారామాలను ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా తెలిపారు. గుంటూరులోని అడవితక్కెళ్లపాడులో రూ.4.56 కోట్లతో నిర్మించిన శిల్పారామాన్ని ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళల ప్రదర్శనను మంత్రి తిలకించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడానికి అన్ని జిల్లాల్లో శిల్పారామాలను నిర్మిస్తున్నామని వివరించారు. ఇప్పటికే తొమ్మిది జిల్లాల్లో వీటిని నిర్మించామని, మిగతా 17 జిల్లాల్లో త్వరలో నిర్మించేందుకు భూ సేకరణ చేసి తమ శాఖకు అప్పగించాలని కలెక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో కళా, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులను, కళాకారులను ఆమె సన్మానించారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. చిన్నారులతో కలిసి కోలాట నృత్యం చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, సాంస్కృతిక డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కల్పలత, ఎమ్మెల్యేలు మద్దాలి గిరిధర్, ముస్తాఫా పాల్గొన్నారు.

ఎంసెట్ మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలి

- ముఖ్యమంత్రికి లోకేష్ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే ఇఎపిసెట్ (ఎంసెట్) కౌన్సెలింగ్ మూడో విడత కూడా జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శనివారం లేఖ రాశారు. ప్రతియేటా నిర్వహించే ఎంసెట్ మూడో విడత కౌన్సెలింగ్‌ను రద్దు చేయడంతో వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. మూడో విడత కౌన్సెలింగ్‌లో కోరుకున్న బ్రాంచిలో దగ్గర్లో వస్తుందని వేలాదిమంది విద్యార్థులు నిరీక్షిస్తున్నారని పేర్కొన్నారు. అలా కాకుండా ఫీజు రీయంబర్స్‌మెంట్ ఎగవేసేందుకు స్పాట్ అడ్మిషన్ల నాటకం ఆడుతున్నారని విమర్శించారు. స్పాట్ అడ్మిషన్లు, కన్వీనర్ కోటాలో సిఎస్‌ఇ సీట్లను అమ్ముకునేందుకు విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటోందని పేర్కొన్నారు. రివర్స్ దెబ్బతో తల్లిదండ్రులకు మొహం చూపించలేక ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారని తెలిపారు. కౌన్సెలింగ్ నిర్వహించాలని 13 వేల మంది విద్యార్థులు ప్రభుత్వానికి, విద్యాశాఖ మంత్రి, ఉన్నత విద్యామండలి అధికారులకు చేసిన వినతులను ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కౌన్సెలింగ్ తేదీలను ఇస్తామని విద్యార్థులకు మంత్రి బొత్స సత్యనారాయణ హామీ ఇచ్చి మరీ మోసగించారని విమర్శించారు. ఏటా నిర్వహించే మూడు విడతల కౌన్సెలింగ్‌ను రెండు విడతలకే పరిమితం చేయడం వెనుక ఆంతర్యం ఏమిటో ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

పెరుగుతున్న ప్రైవేటీకరణ

- సామాన్యులకు దూరమవుతున్న విద్య
- ఖాళీ పోస్టులను భర్తీ చేయని ప్రభుత్వాలు
- సదస్సులో విద్యావేత్తల ఆందోళన

సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కె చిన్నయసూరి, మాజీ ఎమ్మెల్సీ వి బాలసుబ్రమణ్యం, ఎపి విద్యాపరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్ తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యా రంగంలో ప్రైవేటీకరణ పెరుగుతున్న కొద్దీ సామాన్య పౌరులకు విద్య దూరమవుతుందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ విద్య కార్పొరేట్ విద్యగా మారి బడా యాజమాన్యాల చేతిలో బందీ అయిందన్నారు. ఈ శక్తులు రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రభుత్వ విధానాల్ని శాసించే స్థాయికి చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగం ప్రమాణాలపై విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో శనివారం సెమినార్ జరిగింది. సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కె చిన్నయసూరి ఈ కార్యక్రమానికి ప్రారంభోపన్యాసం చేశారు. ప్రభుత్వ రంగంలోని విద్యా వ్యవస్థ సక్రమంగా లేకపోవడంలో ప్రజలు ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ విద్యవైపు వెళ్తున్నారని చెప్పారు. ప్రైవేట్ సంస్థల్లో ప్రమాణాలు పడిపోతున్నాయని అన్నారు.

'పాఠశాలల విద్యారంగం-ప్రస్తుత స్థితిగతులు' అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ వి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విలీనంతో తల్లిదండ్రుల్లో ప్రభుత్వ విద్యపై నమ్మకం సడలిపోయిందన్నారు. ప్రపంచ బ్యాంకు నిధుల కోసం ఏ ప్రణాళికా లేకుండా చేసిన సంస్కరణల ఫలితంగా పాఠశాలల్లో విద్యార్థులు ఉండటం లేదని, దీనిద్వారా స్కూళు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మాతృభాషలో బోధన జరగాలని కోరారు.

'ఉన్నత విద్యారంగం-స్థితిగతులు' అనే అంశంపై ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ యూనివర్సిటీల్లో 15 ఏళ్ల నుంచి నియామకాలు లేవని తెలిపారు. ప్రొఫెసర్, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు ప్రస్తుతం నాలుగు వేలకు పైగా ఖాళీలు ఉన్నాయని చెప్పారు. రాజకీయ కోణంతో వైస్ ఛాన్సలర్స్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్స్ నియామకం జరుగుతుందని తెలిపారు. యూనివర్సిటీలు, డిగ్రీ కళాశాలల ప్రమాణాలు కాపాడాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

'పాఠ్య ప్రణాళిక-పాఠశాల విద్య' అనే అంశంపై ఎపి విద్యాపరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ.. స్వతంత్రంగా, ప్రయోజనకరంగా పాఠ్యప్రణాళికలు, పాఠ్య పుస్తకాలను నిర్వహిస్తున్న రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ మండలిని రాష్ట్ర ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ తన అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వం అడుగుజాడల్లో నడుస్తూ జాతీయ విద్య, పరిశోధన శిక్షణ మండలి రూపొందించిన వాటిని ఆచరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా రాజకీయ లబ్ధికోసం దీనిని చేస్తోందన్నారు.

'పాఠశాల విద్య-బోధన సమస్యలు' అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు తరగతి గది నుంచే మొదలవుతుందని కొఠారి కమిషన్ పేర్కొన్న దానికి భిన్నంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. వేలకోట్లు ఖర్చు చేసి ఆధునీకరించిన పాఠశాలల్లోని విద్యార్థులను సమీప పాఠశాలల్లో విలీనం చేశారని, తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నాలుగు లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చేరారని ఆందోళన వ్యక్తం చేశారు.

'పాఠశాల విద్య, భాషా విధానం'పై విద్యావేత్త గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచాలని కోరారు. ప్రతి తరగతికీ ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, ప్రాథమిక పాఠశాలల్లో ఏడాదికి 800 గంటల విద్యాబోధన జరగాలని సూచించారు. ఎంబి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి మురళీకృష్ణ వందన సమర్పణ చేసిన ఈ కార్యక్రమంలో 'విద్యా-ఫిస్కల్ పాలసి'పై ప్రొఫెసర్ ఎం సురేష్‌బాబు పాల్గొని ప్రసంగించారు.

నేటి నుండి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

దుర్గగుడి ఘాట్ రోడ్డు, వినాయకుని గుడి క్యూ లైన్ల వద్ద ఏర్పాటుచేసిన స్వాగత ద్వారాలు

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనక దుర్గమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 15 నుండి 23వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను నిర్వహిం చనున్నారు. దీనిలో భాగంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వినాయకుని గుడి వద్ద నుండి ప్రారంభమయ్యే మూడు క్యూలైన్ల వద్ద, ఘాట్ రోడ్డులోని గోపురం వద్ద స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాలు జరిగే తొమ్మిది రోజుల్లో దుర్గమ్మను తొమ్మిది అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ అధికారులు తెలిపారు. మొదటిరోజు ఆదివారం బాలాత్రిపుర సుందరీ దేవిగా, 16న గాయత్రీదేవిగా, 17న అన్నపూర్ణాదేవిగా, 18న మహాలక్ష్మీదేవిగా, 19న లలితా త్రిపుర సుందరి దేవిగా, 20న సరస్వతీ దేవిగా, 21న దుర్గాదేవిగా, 22న మహిషాసురమర్ధినిగా, 23న రాజరాజేశ్వరీదేవిగా దుర్గమ్మను అలంకరిస్తారని చెప్పారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 4 గంటల సమయంలో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దుర్గమ్మకు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పి స్తారన్నారు. ప్రతిరోజూ తెల్లవారుజాము 3 నుంచి రాత్రి 11 గంటల వరకూ దుర్గమ్మను దర్శించు కోవచ్చని చెప్పారు. ఇంద్రకీలాద్రి పైకి వివిఐపిలు, విఐపిల కార్లకే అనుమతిస్తారన్నారు. మిగిలిన వారు దేవస్థానం బస్సుల్లోగానీ, నడక మార్గంలో గానీ రావాల్సి ఉంటుందని తెలిపారు. వృద్ధులు, వికలాంగులకు లిఫ్ట్ సౌకర్యం ఉందన్నారు. మీడియా ప్రతినిధులకూ కూడా ప్రత్యేక వాహనం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

'న్యాయానికి సంకెళ్లు'

- నేడు నిరసనలకు టిడిపి పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ఆదివారం సాయంత్రం ఏడు గంటలకు చేతులకు తాళ్లు, రిబ్బన్లతో సంకెళ్లు వేసుకుని నిరసన చేపట్టాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇళ్ల వాకిళ్లు, బాల్కనీలు, వీధుల్లోకి వచ్చి జగన్‌కు చూపించాలన్నారు. న్యాయానికి ఇంకెన్నాళ్లీ సంకెళ్లని నినదించాలని, ఆ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసి చంద్రబాబు ధర్మ పోరాటానికి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

జైల్లో పరిణామాలు సజ్జలకు ఎలా తెలుస్తున్నాయి? : బోండా ఉమా

రాజమండ్రి జైల్లో లోపలి పరిణామాలు అధికారుల కంటే వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డికి ఎలా తెలుస్తున్నాయని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. వ్యవస్థలను జగన్ ఏ స్థాయిలో తనకు అనుకూలంగా వాడుకుంటున్నారో చెప్పడానికి ఇదే నిదర్శనమని విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రిమాండ్‌లో ఉండే వ్యక్తుల్ని సాధారణ ఖైదీల్లా ట్రీట్ చేయడానికి వీల్లేదని జైళ్లశాఖ నిబంధనలు చెబుతున్నాయని అన్నారు. జగన్ అండతో చంద్రబాబును ఇబ్బంది పెడుతున్న జైలు అధికారులు తగిన మూల్యం చెల్లించుకుంటారని చెప్పారు. చంద్రబాబు వ్యక్తిగత వైద్యులను లోపలికి అనుమతించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై గవర్నరు స్పందించాలని కోరారు. దళితుడిని చంపిన ఎమ్మెల్సీ అనంత్ బాబును సిఎం జగన్ భుజాలపై మోస్తున్నారని మాజీ మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, కెఎస్ జవహర్ ఒక ప్రకటనలో విమర్శించారు. సిఎం తీరుకు నిరసనగా ఆదివారం కాకినాడలో టిడిపి ఆధ్వర్యాన అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యుత్ కష్టాలు, ప్రజల అవస్థలకు జగన్ చేతగాని తనమే కారణమని టిడిపి అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ విమర్శించారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు, జైళ్ల శాఖ డిఐజి

బాబు బ్యారక్‌లో టవర్ ఎసి

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. చర్మ సంబంధిత సమస్యపై గత రిపోర్టుల గురించి తమకు తెలియదని, అవసరమైతే చంద్రబాబు పర్సనల్ వైద్యుని సూచనలు తీసుకుంటామని చెప్పారు. చంద్రబాబుకు ఎటువంటి స్టెరాయిడ్స్ ఇవ్వడమూ లేదని ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు. జైళ్ల శాఖ డిఐజి రవికిరణ్ మాట్లాడుతూ చంద్రబాబు ఆరోగ్యం పట్ల తమ వైద్య బృందం ప్రతిరోజూ మూడుసార్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తోందని చెప్పారు. చర్మ సంబంధిత సమస్యలు తలెత్తడంతో తమ వైద్యులు పరీక్షించి వైద్య సహాయం అందజేస్తున్నప్పటికీ సెకండ్ ఒపీనియన్ కోసం రాజమహేంద్రవరం జిజిహెచ్‌ను కోరామని తెలిపారు.

12వ తేదీ నుంచి నేటి వరకూ మూడు దశలుగా వైద్య బృందం పరీక్షలు నిర్వహించిందని చెప్పారు. ఆయన ఆరోగ్యంపై అపోహలొద్దన్నారు. చంద్రబాబు ఆరోగ్యంపై పూర్తి రిపోర్టును ఆయన అనుమతితో అడ్వకేట్లకు అందజేస్తామని, నిబంధనల ప్రకారమే తాము నడుచుకుంటున్నామని చెప్పారు.

బిజెపికి ఒక్క ఓటు వేసినా చేటే

(మొదటి పేజీ తరువాయి)

మరియం ధావలే మాట్లాడుతూ పాలకుల తీరుతో 76 సంవత్సరాల స్వాతంత్ర్య భారతదేశంలో ఆకలి, ఉపాధి కోసం అల్లాడే పరిస్థితి నేటికీ ఉందన్నారు. గతంలో 107వ స్థానంలో ఉన్న మనదేశ ఆకలి సూచి ఇప్పుడు 111వ స్థానానికి దిగజారిందని తెలిపారు. మహిళలను ఉన్నత విద్యవైపు వెళ్లనీయకుండా చేసే కుట్ర నూతన విద్యా విధానంలో దాగి ఉందని విమర్శించారు. సాక్షాత్తు ప్రధాని మంత్రి మోడీ దేశ ప్రజలను మూఢనమ్మకాలు, అశాస్త్రీయ విధానాల వైపు మళ్లించాలని చూస్తున్నారని, కరోనా సందర్భంగా ఆయన వ్యవహరించిన తీరే ఇందుకు నిదర్శనమని ఉదాహరించారు. అంగన్‌వాడీలకు నెలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని కోరితే పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రభుత్వ ఆస్తి అయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకునేందుకు విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చేస్తోన్న పోరాటాన్ని ప్రశంసించారు. బిజెపి పాలిత ప్రాంతాల్లో మహిళలపై దాడులు అధికమయ్యాయని, హాత్రాస్ ఘటనలో నిందితులకు సాక్షాత్తు ఉత్తరప్రదేశ్ సిఎం ఆదిత్య యోగినాథ్ వంతపాడారని, అగ్రకుల పెత్తందార్లకు అండగా నిలబడ్డారని అన్నారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేంద్ర సహాయమంత్రి బ్రిజ్‌భూషణ్‌పై కేంద్ర ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు. మణిపూర్‌లో జరిగిన మారణహోమం, అమానుష ఘటన విషయంలోనూ అక్కడి సిఎంను మోడీ వెనకేసుకురావడాన్ని బట్టి మహిళల పట్ల బిజెపి వైఖరి తేటతెల్లమవుతోందన్నారు. ప్రస్తుతం రాజ్యాంగం, మనుస్మృతి మధ్య యుద్ధం జరుగుతోందని పేర్కొన్నారు. మహిళలను అణచివేసే మనుస్మృతిని వ్యతిరేకిద్దామని, సవాళ్లను ఎదుర్కొని సమానత్వాన్ని సాధిద్దామని, 2024 ఎన్నికల్లో బిజెపిని ఓడిద్దామని పిలుపునిచ్చారు.

సామాజిక కార్యకర్త కె.వసుంధర మాట్లాడుతూ మహిళా సాధికారిత గురించి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ మాట్లాడుతూనే ఉన్నా ఇప్పటికీ సాధించలేదన్నారు. మహిళలను ఓటు బ్యాంకుగా మారుస్తూ విద్య, వైద్యం, అధికారానికి దూరం చేసి, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని అడ్డుకుంటూ కట్టుబాట్లు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. మతం ముసుగులో మహిళలను ఆటవిక నాగరికత కంటే దారుణంగా అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో మహిళల పక్షాన వామపక్ష పార్టీలు పోరాడుతుండడం హర్షణీయమన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ రాష్ట్ర మహిళలు తమ సత్తా చాటాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. రాష్ట్రంలో మహత్తర సారా వ్యతిరేక ఉద్యమంలో సిపిఎం ముఖ్య భూమిక పోషించిందన్నారు. డ్వాక్రా మహిళలకు రుణాల సాధనలో, మైక్రో ఫైనాన్స్ ఆగడాలను ఎదిరించడంలో ముందు పీఠిన నిలిచిందని తెలిపారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని తేవాలని 1996 నుంచి మద్దతిస్తున్నది వామపక్షాలు మాత్రమేనన్నారు. ప్రజలను చైతన్యపరచి మహిళా శక్తి ఏంటో బూర్జువా రాజకీయ నాయకులకు చూపాలని కోరారు. ఈ సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుబ్బరావమ్మ, మూలం రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు ధనలక్ష్మి, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి, సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి.మురళి, రాయపనేని హరికృష్ణ, సిపిఎం చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ బరితెగింపు

(మొదటి పేజీ తరువాయి)

వహించాల్సిందిగా అంతర్జాతీయ సమాజాన్ని కోరారు. 'పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి.. తక్షణమే అంతర్జాతీయ సమాజం మేల్కొవాలి' అని పాలస్తీనా ప్రాంతాల్లో మానవ హక్కుల పరిస్థితులను అధ్యయనం చేసే ఐక్యరాజ్య సమితి ప్రత్యేక రాయబారి ఫ్రాన్సెసా అల్బనీస్ హెచ్చరించారు. 1950వ దశకం నాటి పరిస్థితులను తలపిస్తున్నాయని అంతర్జాతీయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. 1947-49 మధ్య కాలంలో ఏడున్నర లక్షల మందికి పైగా పాలస్తీనియన్లను తమ ఇళ్ళనుండి, భూభాగాల నుండి బలవంతంగా వెళ్లగొట్టిన నక్బా సంఘటన పునరావృతమవుతోందని ఇజ్రాయిల్ అధికారులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఆ సమయంలోనే 1948లో ఇజ్రాయిల్ ఏర్పడింది. నక్బా సమయంలో మూడున్నర లక్షల మందికిపైగా పాలస్తీనియన్లు నిర్వాసితులయ్యారు. 1967లో వెస్ట్ బ్యాంక్, గాజాలను ఇజ్రాయిల్ ఆక్రమించడానికి ఈ సంఘటన దారి తీసింది. ఇజ్రాయిల్ ఇప్పటికే యుద్ధం ముసుగులో పాలస్తీనియన్ల జాతి ప్రక్షాళన చేపట్టిందని ఆమె విమర్శించారు. పూర్తిగా కాల్పుల విరమణ జరగకుండా మానవతా కారిడార్ ఏర్పాటు చేయడం సాధ్యం కాదని దోహా ఇనిస్టిట్యూట్‌కి చెందిన విశ్లేషకుడు తమీర్ కార్‌మంట్ వ్యాఖ్యానించారు.

- గాజాపై శుక్రవారం, శనివారం కూడా దాడులు యథేశ్చగా కొనసాగాయి. గడచిన 24 గంటల వ్యవధిలోనే 320 మంది పాలస్తీనియన్లు ఇజ్రాయిల్ దాడులకు బలైపోయినట్లు గాజా సిటీ ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు.

వీరిలో అత్యధికులు మహిళలు, చిన్నారులే కావడం ఆందోళనకరం. ఈ దాడుల్లో ఇప్పటి వరకు 2500 మంది పైచిలుకు పౌరులు గాజాలో చనిపోగా, లక్షలాది మంది తమ ఇళ్లను వదిలి ఐరాస సహాయక శిబిరాల్లో బిక్కుబిక్కుమంటూ తలదాచుకుంటున్నారు. వేలాది మంది ఆసుపత్రుల్లో మృత్యువుతో పోరాడుతున్నారు. గాజాలో ఏ వైపు చూసినా రక్తమోడుతున్న శరీరాలు, శిథిలమవుతున్న భవనాలే దర్శనమిస్తున్నాయి.

- ఇజ్రాయిల్ తక్షణమే యుద్ధ నేరాలకు స్వస్తి పలకాలని, లేదంటే ఆత్మరక్షణ 'పెను భూకంపాన్ని' చవిచూడాల్సివుంటుందని ఇరాన్ హెచ్చరించింది.

- గాజా వీడి పాలస్తీనా వెళ్లే ప్రసక్తే లేదని హమస్ ఛీఫ్ ఇస్మాయిల్ హనియేహ్ ప్రకటించారు. టెలివిజన్‌లో ఆయన మాట్లాడుతూ 'మన శత్రువు అమెరికా యంత్రాంగం, మరికొన్ని యూరోపియన్ దేశాలతో కలిసి ఈ దాడులకు పాల్పడుతోంది. గాజా ప్రజలు తమ మాతృభూమి ఒడిలోనే ఉంటారు. ఎక్కడికీ వెళ్లబోరు. గాజా వీడే ప్రసక్తే లేదు. ఈజిప్టు కూడా వెళ్లబోం' అని స్పష్టం చేశారు.

మానవత్వం మంట కలుస్తోంది : ఐరాస రిలీఫ్ ఛీఫ్

ఇజ్రాయిల్ దాడులతో గాజాలో మానవత్వం మంట గలుస్తోందని ఐక్యరాజ్యసమితి రిలీఫ్ ఛీఫ్ మార్టిన్ గ్రిఫ్ఫిత్స్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతకంటే భయానక పరిస్థితులు ఎదురౌతాయని ఆయన హెచ్చరించారు. 'నీరు లేదు, విద్యుత్ లేదు. ఇంధనం లేదు. ఆహార సరఫరా చాలా నెమ్మదిగా జరుగుతోంది. ఆసుపత్రుల్లో మందులు అయిపోతున్నాయి.' అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గాజాలో మానవత్వం ఇప్పటికే తీవ్ర సంక్లిష్టంగా మారిందని, ఊహించనిరీతిలో మరింతగా దిగజారిపోతోందని ఆయన హెచ్చరించారు. అటు వెస్ట్‌బ్యాంక్‌లోనూ హింస పెరిగిపోతోందని, ఇజ్రాయిల్, లెబనాన్ మధ్య కూడా ఉద్రిక్తతలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పాలస్తీనాకు సంఘీభావంగా పలు చోట్ల ప్రదర్శనలు

అమెరికా ఇతర పశ్చిమ దేశాల అండతో ఇజ్రాయిల్ చేస్తున్న ఊచకోత బెదిరింపులకు వ్యతిరేకంగా, చారిత్రికంగా అన్యాయానికి గురవుతూ వస్తున్న పాలస్తీనీయులకు సంఘీభావంగా ప్రపంచవ్యాపితంగా ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు చేస్తున్నారు. ప్రభుత్వాలు ఎటువైపు ఉన్నా ప్రజలు మాత్రం పాలస్తీనీయుల వైపే ఉన్నారనడానికి ఈ ప్రదర్శనలు ఒక నిదర్శనం. జోర్డాన్‌లో వేలాది మంది పాలస్తీనా సరిహద్దు వద్ద సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ఇజ్రాయిల్‌తో పూర్తి స్థాయి సాధారణ సంబంధాలను కలిగివున్న అరబ్బు దేశాల్లో జోర్డాన్ ఒకటి. 1949లో శాంతి ఒప్పందంపై ఇజ్రాయిల్‌తో జోర్డాన్ సంతకం చేసింది. ఇరాక్‌లోని తహ్రీర్ స్క్వేర్ వద్ద పాలస్తీనాకు సంఘీభావం పెద్దయెత్తున ప్రదర్శన జరిగింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్, యెమెన్‌లోని సాదా నగరంలో వేలాది మంది వీధుల్లోకి వచ్చి ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నినదించారు. అరబ్బు దేశాల్లోనే కాదు అమెరికా, యూరప్, తదితర దేశాల్లో శాంతికాముకులైన ప్రజలు పాలస్తీనాకు సంఘీభావం ప్రకటించారు. మానవతా సాయం కూడా పాలస్తీనాకు భారీగా తరలివస్తోంది. కానీ ఇజ్రాయిల్ దాడులు కొనసాగిస్తుండటంతో ఆ సాయం బాధితులకు చేరే మార్గం కనిపించడం లేదు. టర్కీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి రెండు సహాయక విమానాలు ప్రస్తుతం ఈజిప్టులోని అల్ అరిష్ విమానాశ్రయంలో ఆగిపోయాయి. ఇది గాజా సరిహద్దుకు సమీపంలోనే ఉంది. ఇలాంటి విమానాలు ఇప్పటికే ఐదు వరకూ వివిధ ప్రాంతాల్లో నిలిచిపోయాయి.

చావనైనా చస్తాం కానీ, తలొగ్గేది లేదు: పాలస్తీనీయుల స్పష్టీకరణ

గాజాలో 10 లక్షల మందిని ఖాళీ చేయాలంటే ఇజ్రాయిల్ ప్రభుత్వం జారి చేస్తున్న హుకుంను పాలస్తీనా ప్రజలు ధిక్కరిస్తూ , చావనైనా చస్తాం, కానీ జాత్యహంకారుల ముందు తలొగ్గే ప్రశ్నే లేదని నినదించారు. గాజాలో శనివారం వేలాది మంది పాలస్తీనీయులు ప్రదర్శన నిర్వహించారు.

దళారుల మాయాజాలం

- రైతు వద్ద కొనే ధరకు, విక్రయ ధరకు భారీ వ్యత్యాసం
- రాష్ట్రంలో భారీగా పెరిగిన ఆహార ధాన్యాలు, పప్పుల ధరలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో రైతులకు మద్దతు ధరలు లభించడం ఒక ప్రహసనంగా మారింది. రైతులు వ్యవసాయం కోసం భారీగా పెట్టుబడులు పెరుగుతున్నా ఏటా అరకొరగానే కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను ప్రకటిస్తోంది. ఏటా క్వింటాలుకు రూ.100 నుంచి రూ.200 మాత్రమే పెంచుతోంది. అయినా, ఆచరణలో ఈ ధర కూడా రైతులకు దక్కడం లేదు. రైతుల వద్ద ఉత్పత్తులు ఉన్నప్పుడు తక్కువ ధరకు కొనుగోలు చేయడం, కొద్ది నెలల్లో ఈ ధరలను రెట్టింపు చేయడం వ్యాపారులు, దళారులకు పరిపాటిగా మారింది. ఉత్పత్తులను ఇళ్లలో నిల్వ చేసుకునే సామర్థ్యం లేక చాలామంది రైతులు తమ పంటలను కళ్లాల్లోనే విక్రయిస్తున్నారు. దీంతో, దళారులు ధరలను గణనీయంగా తగ్గించి కొంటున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా, ఆచరణలో రైతుల వద్ద దళారులు ఉత్పత్తులు కొనుగోలు చేసి ఆర్‌బికెల్లో కొన్నట్టుగా రికార్డులు రూపొందిస్తున్నారు. పంట చేతికి వచ్చిన వెంటనే విక్రయించుకుంటున్న రైతులకు కనీసం పెట్టుబడి కూడా రావడం లేదు.



ఉత్పత్తి	మద్దతు ధర క్వింటాలు	కొనుగోలు ధర క్వింటాలు	ప్రస్తుత మార్కెట్ ధర క్వింటాలు
ధాన్యం	రూ.2,060	రూ.1,733	రూ.3300
పసుపు	రూ.6,850	రూ.5,000	రూ.12,000
కందులు	రూ.5,335	రూ.7,000	రూ.10,300
శనగలు	రూ.5,666	రూ.4,000	రూ.8,000
పెసర	రూ.7,755	రూ.6,000	రూ.9,000
మినుము	రూ.6,600	రూ.5,500	రూ.10,000
పత్తి	రూ.6,380	రూ.6,000	రూ.8,000
మొక్కజొన్న	రూ.1962	రూ. 1,400	రూ.3,000

2022-23లో వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా తక్కువ ధరకే రైతులు తమ పంటలను విక్రయించుకోవాల్సి వచ్చింది. గత మూడు నెలల్లో రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. దీంతో, రైతుల పరిస్థితి అమ్మబోతే అడవి.... కొనబోతే కొరివి అన్న చందంగా తయారైంది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ ఏడాది రైతుల నుంచి ధాన్యం ధరలు కనీస మద్దతు ధర కన్నా తక్కువగానే దళారులు కొనుగోలు చేశారు. ఉత్పత్తులు రైతుల నుంచి వ్యాపారులకు చేరాక అన్ని ఉత్పత్తుల ధరలను గణనీయంగా పెంచేశారు. ధాన్యం ధరలు రెట్టింపయ్యాయి. ప్రస్తుతం కిలో బియ్యం ధర రూ.50 నుంచి రూ.60 మధ్య ఉంది. కందిపప్పును కిలో రూ.170 నుంచి రూ.190 మధ్య విక్రయిస్తున్నారు. కిలో మినుపగుళ్ల ధర రూ.130 నుంచి రూ.140 ఉంది. గత కొన్ని నెలలుగా బియ్యం, పసుపు, పత్తి, పప్పు దినుసుల ధరలు గణనీయంగా పెరుగుతుండటంతో రైతులు బిక్కముఖం వేయాల్సి వస్తోంది. తమ వద్ద ఉత్పత్తులను తక్కువ ధరకు కొనడం, కొన్ని నెలల తర్వాత వాటిని అధిక ధరకు అమ్ముకోవడం పరిపాటిగా మారిందని, దీనివల్ల వినియోగదారులపైనా అధిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వచ్చింది

కందులకు క్వింటాలు ఒక్కంటికీ రూ.7 వేల చొప్పున మాత్రమే ధర లభించింది. పెట్టుబడి కూడా రాకపోవడంతో నష్టపోయాను. రైతుల వద్ద నుంచి దళారులు, వ్యాపారుల వద్దకు పంట వెళ్లగానే ధరలు పెంచారు. ఇప్పుడు ధర దాదాపు రెట్టింపు చేసి అమ్ముతున్నారు.

-గరికపాటి చిన తాతయ్య, కొనకంచివారిపాలెం, రొంపిచర్ల మండలం, పల్నాడు జిల్లా

పెట్టుబడి పెరుగుతోంది

గత ఖరీఫ్‌లో పండిన కందులను దళారులు క్వింటాలును రూ.7,500 చొప్పున కొన్నారు. రబీలో పండిన మినుములను క్వింటాలు రూ.7,800కు కొనుగోలు చేశారు. పెసలను రూ.5,500 నుంచి రూ.6 వేలు, శనగలను రూ.4,500 నుంచి రూ.5 వేలకు కొన్నారు. గత మూడు నెలలుగా అన్ని రకాల అపరాల ధరలూ గణనీయంగా పెరిగాయి. దళారుల వల్ల గిట్టుబాటు ధర రాక నష్టపోయాం. పెట్టుబడికి అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయిస్తే నష్టాల నుంచి కొంతవరకూ బయటపడతాం.

-ఈదర జనార్ధనరావు, అన్నవరం గ్రామం, రొంపిచర్ల మండలం, పల్నాడు జిల్లా.

పెట్టుబడి ఖర్చూ రాలేదు

గత సంవత్సరం పంటపై పెట్టిన పెట్టుబడి రాకపోగా నష్టం వచ్చింది. మూడు ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. ఎకరానికి రూ.35 వేలకుపైగా పెట్టుబడి అయింది. ఎకరానికి ఐదు నుంచి ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. కందులను క్వింటాలు ఒక్కంటికీ రూ.5,500 నుండి రూ.6,500 అమ్ముకోవాల్సి రావడంతో నష్టం వచ్చింది.

-ఎం .పిచ్చయ్య, పిడుగురాళ్ల, పల్నాడు జిల్లా

బిఆర్‌ఎస్‌లోకి రండి

- పొన్నాలను ఆహ్వానించిన కెటిఆర్
- కెసిఆర్‌ను కలిసిన తర్వాత నిర్ణయం ప్రకటిస్తా : పొన్నాల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ పిసిసి మాజీ అధ్యక్షులు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యను బిఆర్‌ఎస్ పార్టీలోకి రావాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కెటిఆర్ ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని పొన్నాల ఇంటికి శనివారం మధ్యాహ్నం మంత్రి కెటిఆర్‌తో పాటు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శానంపూడి సైదిరెడ్డి, సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్ వెళ్లారు. పొన్నాల లక్ష్మయ్యను బిఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం విలేకరులతో కెటిఆర్ మాట్లాడుతూ.. సిఎం కెసిఆర్ సూచన మేరకే పొన్నాల ఇంటికి వచ్చానని పేర్కొన్నారు. పార్టీలో చేరేందుకు పొన్నాల సుముఖత వ్యక్తం చేశారని, ఆయనకు బిఆర్‌ఎస్‌లో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీకి పొన్నాల ఎంతో సేవ చేశారని మంత్రి గుర్తు చేశారు. సీనియర్లకు కాంగ్రెస్ పార్టీలో కనీసం గౌరవం ఇవ్వడం లేదని, పొన్నాలను రేవంత్ తూలనాడిన విధానం హీనసంస్కారానికి నిదర్శనమని చెప్పారు. అనంతరం పొన్నాల మాట్లాడుతూ.. బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ బిఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానించారని, ఆదివారం సిఎంను కలిసి తర్వాత తుది నిర్ణయం ప్రకటిస్తానని చెప్పారు. రేవంత్ రెడ్డి మాటలు సిగ్గు ఉండేవారు మాట్లాడేవేనా? అని ప్రశ్నించారు. తన బ్యాక్‌గ్రౌండ్ ఏంటో రేవంత్ తెలుసుకోవాలని సూచించారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో రేవంత్ తన పార్లమెంట్ పరిధిలో ఎన్ని సీట్లు గెలిచారని ప్రశ్నించారు. ఐకమత్యమే పార్టీ బలమని పేర్కొన్నారు.

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్
మీ కుటుంబ బ్యాంక్, భారతదేశం అంతటా

అసెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచి, 1వ ఫ్లోర్, ప్లాట్ నెం.50, శ్రీనగర్ కాలనీ, రోడ్డు నెం.3, బంజారాహిల్స్, హైదరాబాద్-500073.
ఫోన్ : 040-23755686/23745686
ఇ-మెయిల్ : hyd.arm@ktkbank.com
వెబ్‌సైట్ : www.karnatakabank.com
CIN : L85110KA1924PLC001128

స్థిరాస్తుల యొక్క అమ్మకపు ప్రకటన

స్థిరాస్తులు అమ్మకానికి 2002 నాటి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు లోని నిబంధన 8(6) అంశాలతో చదువుకొనేలా 2002 నాటి సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం క్రింద ఇవ్వబడిన ఇ-వేలం అమ్మకం ప్రకటన, రుణదాతకు మార్టిగేజి చేసిన / చార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక స్వాధీనం చేసుకోబడిందని, సదరు ఆస్తులను రుణదాతచే ''ఎక్కడ ఉన్నది అక్కడే'' ''ఉన్నది ఉన్నట్లే'' మరియు ''యదాతథం'' ప్రాతిపదికపై 16-11-2023 తేదీన విక్రయించబడునని దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలు / హామీదారులు / సహపూచీదారుల నుండి బకాయిపడిన మొత్తాన్ని వసూలు చేయుటకై సదరు ఆస్తులు విక్రయించబడుచున్నవనీ సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రస్తుడు(లు) మరియు గ్యారంటీదారుడు(లు)లకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్, మచిలీపట్నం బ్రాంచి (ఫోన్: 94919 15578)

వ.నెం.1: ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారుల యొక్క పేర్లు & చిరునామా, సింబాలిక్ స్వాధీనత యొక్క తేదీ మరియు సెక్యూర్డ్ ఆస్తుల యొక్క వివరములు: ఋణగ్రహీతలు/హామీదారులు/సహపూచీదారులు: (1) శ్రీమతి బొమ్మిడి ఈశ్వరమ్మ, భర్త: శ్రీ ఈశ్వర్‌రాజు, (2) శ్రీ చెక్కా పాపారావు మరియు (3) శ్రీమతి చెక్కా వనిత జ్యోతి, భర్త: పాపారావు. వ.నెం. (1) మరియు (3) వారి నివాసం: డోర్ నెం. 424-3, SBI బ్రాంచ్ రోడ్డు దగ్గర, పోరంకి గ్రామము, పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521137 మరియు వ.నెం. (2) వారి నివాసం: డోర్ నెం.30-950-2, పెద ఉల్లిగిపాలెం, మచిలీపట్నం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521001. నిర్మాణాత్మక స్వాధీనత తేదీ: 16.11.2022. బకాయి మొత్తం: TL A/c.No. 5787001600006401 క్రింద రూ.5,81,491.53 (అక్షరాల ఐదు లక్షల ఎనభై ఒక్క వేల నాలుగు వందల తొంభై ఒకటి రూపాయలు మరియు యాభై మూడు పైసలు మాత్రమే) + 08-10-2023 నుండి భవిష్య వడ్డీ మరియు ఖర్చులు మొ॥.
ఆస్తి యొక్క వివరము: ఆంధ్రప్రదేశ్-521137, కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, యస్‌బిఐ & ముత్తూట్ ఫైనాన్స్ రోడ్డు ప్రక్కన, పోరంకి గ్రామము, ఆర్.యస్.నెం.424-3 నందు శ్రీ బొమ్మిడి ఈశ్వరమ్మకి చెందిన 271.44 చ॥గ॥ విస్తీర్ణము గల స్థలము మరియు అందులో 705.37 చ॥అ॥ ప్లింత్ ఏరియాలో నిర్మించిన డోర్ నెం.14-53 కలిగిన రెసిడెన్షియల్ ఇంటికి సంబంధించిన యావత్తు. దీనికి హద్దులు: తూర్పు: కోనేరు రంగారావుకు చెందిన స్థలము; పడమర: షెడ్యూలు ఆస్తిని చేరుకోవడానికి 33'వెడల్పుగల పంచాయతీ రోడ్డు; ఉత్తరం: షెడ్యూలు ఆస్తిని చేరుకోవడానికి 40'వెడల్పుగల పంచాయతీ రోడ్డు; మరియు దక్షిణం: కె.రామమోహనరావు మరియు 2 ఇతరులకు అమ్మిన స్థలము. లొకేషన్: అక్షాంశము: 16.4743 & రేఖాంశము: 80.7047.

రిజర్వుధర: రూ.83,83,000/- (అక్షరాల ఎనభై మూడు లక్షల ఎనభై మూడు వేల రూపాయలు) (1% టిడియస్ కలుపుకొని)
చెల్లించవలసిన బయానా: రూ.8,38,300/- (అక్షరాల ఎనిమిది లక్షల ముప్పై ఎనిమిది వేల మూడు వందల రూపాయలు)

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు బ్రాంచి (ఫోన్: 99852 02444)

వ.నెం.2: ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారుల యొక్క పేర్లు & చిరునామా, సింబాలిక్ స్వాధీనత యొక్క తేదీ మరియు సెక్యూర్డ్ ఆస్తుల యొక్క వివరములు: ఋణగ్రహీతలు/హామీదారులు/సహపూచీదారులు: (1) మెస్సర్స్ విజయ చంద్రాస్ సీడ్స్, తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న యజమానురాలు: శ్రీమతి యస్‌బి రాణి ప్రభాకర్, చిరునామా: నెం. 5-87-47/4, 6వ లైను, చంద్రమౌళినగర్, గుంటూరు-522003. (2) శ్రీమతి యస్‌బి రాణి ప్రభాకర్, భర్త: శ్రీ ప్రభాకర్‌రావు యస్‌యల్, (3) శ్రీ ప్రభాకర్ రావు యస్ యల్, తండ్రి: శ్రీ యస్.గోపాలరావు, నెం. 2 మరియు 3 చిరునామా: డి.నెం.1-9-4/A, ఫణీంద్ర గ్రాండ్ అపార్ట్‌మెంట్, యస్‌వియన్ కాలనీ, గుజ్జనగుండ్ల, గుంటూరు-522003. (4) శ్రీమతి పుష్పవతి యస్, భర్త: శ్రీ యస్.గోపాలరావు, చిరునామా: ముత్తూరు గ్రామము, వట్టిచెరుకూరు మండలం, గుంటూరు-522003. (5) శ్రీ దుర్గా భవానీ సూధిరెడ్డి, తండ్రి: శ్రీ ప్రభాకర్‌రావు యస్ యల్, చిరునామా: డి.నెం.50-90-64/2, చంద్రమౌళినగర్, గుంటూరు-522003. లాంఛనముగా స్వాధీనత తేదీ: 05.01.2023 & 09.05.2023.
బకాయి మొత్తం: i) PSOD A/c No.2557000700085301 క్రింద రూ.4,09,31,779.11 పై॥ (అక్షరాల నాలుగు కోట్ల తొమ్మిది లక్షల ముప్పై ఒక్క వేల ఏడు వందల డెబ్బై తొమ్మిది రూపాయలు మరియు పదకొండు పైసలు మాత్రమే) + 01.10.2023 నుండి వడ్డీ మరియు ఖర్చులు మొ॥ వాటితో సహా ii) PDPN A/c.No.2557001400058301 క్రింద రూ.26,51,796/- (అక్షరాల ఇరవై ఆరు లక్షల యాభై ఒక్క వేల ఏడు వందల తొంభై ఆరు రూపాయలు మాత్రమే) + 29.09.2023 నుండి వడ్డీ మరియు ఖర్చులు మొ॥ వాటితో సహా వెరశి మొత్తము రూ.4,35,83,575.11 పై॥ (అక్షరాల నాలుగు కోట్ల ముప్పై ఐదు లక్షల ఎనభై మూడు వేల ఐదు వందల డెబ్బై ఐదు రూపాయలు మరియు పదకొండు పైసలు మాత్రమే).
ఆస్తి యొక్క వివరము: ఐటమ్ నెం.1 : గుంటూరు, రామచంద్రాపుర అగ్రహారం, బ్లాక్ నెం.27, పట్టా నెం.1053, డి.నెం. 51/2ఎ నందు శ్రీమతి యస్‌బి రాణి ప్రభాకర్ పేరునగల 401.3/9 చ॥గ॥ విస్తీర్ణము గల రెసిడెన్షియల్ స్థలము ప్లాట్ నెం. 14 & 15 నకు సంబంధించిన యావత్తు. దీనికి హద్దులు: తూర్పు: కొత్తమాసు వెంకటేశ్వర్లు యొక్క ప్లాట్ నెం.16 – 45అ॥; దక్షిణం: బొద్దులూరి అప్పయ్య యొక్క ప్లాట్ నెం.23 – 80అ॥; పడమర: తిరివీధి వెంకటరత్నం యొక్క ప్లాట్ నెం.13 – 45అ॥; ఉత్తరం: 20 అ॥ వెడల్పుగల రోడ్డు – 80అ॥. లొకేషన్: అక్షాంశము మరియు రేఖాంశము: 16.28134709 N & 80.42931942 E.

రిజర్వుధర: రూ.32,00,000/- (అక్షరాల ముప్పై రెండు లక్షల రూపాయలు)
చెల్లించవలసిన బయానా: రూ.3,20,000/- (అక్షరాల మూడు లక్షల ఇరవై వేల రూపాయలు)

ఐటమ్ నెం.2: గుంటూరు, తురకపాలెం రోడ్డు దగ్గర, నల్లపాడు, డి.నెం.319 నందు శ్రీమతి యస్‌బి రాణి ప్రభాకర్ పేరునగల 200.00 చ॥గ॥ విస్తీర్ణము గల ఖాళీస్థలము ప్లాట్ నెం.364 నకు సంబంధించిన యావత్తు. దీనికి హద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం.363 – 53అ॥; దక్షిణం: ప్లాట్ నెం.365 – 53అ॥; తూర్పు: 40 అ॥ వెడల్పుగల రోడ్డు – 34'; పడమర: ప్లాట్ నెం.353 – 34'.

రిజర్వుధర: రూ.12,00,000/- (అక్షరాల పన్నెండు లక్షల రూపాయలు)
చెల్లించవలసిన బయానా: రూ.1,20,000/- (అక్షరాల ఒక లక్ష ఇరవై వేల రూపాయలు)

ఐటమ్ నెం.3: గుంటూరు, ప్రస్తుతము న్యూ గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ లిమిట్స్, గోరంట్ల, డి.నెం.257/1E, సాయి అర్జున్ II ఫేజ్, జనచైతన్య లేఅవుట్ ప్లాట్స్ నందు శ్రీ దుర్గా భవాని సూదిరెడ్డి పేరునగల 480.00 చ॥గ॥ విస్తీర్ణము గల రెసిడెన్షియల్ ఖాళీస్థలము ప్లాట్ నెం.679 నకు సంబంధించిన యావత్తు. దీనికి హద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం.691 – 54అ॥; దక్షిణం: 40 అ॥ వెడల్పుగల రోడ్డు – 54'; తూర్పు: ప్లాట్ నెం.680 – 80'; పడమర: ప్లాట్ నెం.678 – 80'. లొకేషన్: అక్షాంశము మరియు రేఖాంశము: 16.35526089 N & 80.46180183 E.

రిజర్వుధర: రూ.24,00,000/- (అక్షరాల ఇరవై నాలుగు లక్షల రూపాయలు)
చెల్లించవలసిన బయానా: రూ.2,40,000/- (అక్షరాల రెండు లక్షల నలభై వేల రూపాయలు)

ఐటమ్ నెం.4: గుంటూరు, రామచంద్రాపుర అగ్రహారం, ఆర్.యస్.డి.నెం.51/2ఎ, పాత డి.నెం. 9/2, సమీప డోర్ నెం.25-18-115 నందు శ్రీ దుర్గా భవాని సూదిరెడ్డి పేరునగల 276.22 చ॥గ॥ విస్తీర్ణము గల రెసిడెన్షియల్ ఖాళీస్థలము ప్లాట్ నెం.5 నకు సంబంధించిన యావత్తు. దీనికి హద్దులు: తూర్పు: పొనుగంటి గోపాల స్వామి యొక్క ప్లాట్ నెం.6 – 65'; దక్షిణం: రోడ్డు 38'3''; పడమర: ఉల్లి సాంబ్రాజ్యమ్మ యొక్క ప్లాట్ నెం.4 – 65'; ఉత్తరం: చిమటా వీరభద్రరావు మరియు శనక్కాయల రామానుజమ్మ నుండి ఇతరులకు అమ్మిన ప్లాట్ 38'3''. లొకేషన్: అక్షాంశము మరియు రేఖాంశము: 16.28275627 N & 80.43155436 E.

రిజర్వుధర: రూ.27,50,000/- (అక్షరాల ఇరవై ఏడు లక్షల యాభై వేల రూపాయలు)
చెల్లించవలసిన బయానా: రూ.2,75,000/- (అక్షరాల రెండు లక్షల డెబ్బై ఐదు వేల రూపాయలు)

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు బ్రాంచి (ఫోన్: 99852 02444)

వ.నెం.3: ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారుల యొక్క పేర్లు & చిరునామా, సింబాలిక్ స్వాధీనత యొక్క తేదీ మరియు సెక్యూర్డ్ ఆస్తుల యొక్క వివరములు: ఋణగ్రహీతలు/హామీదారులు/సహపూచీదారులు: మెస్సర్స్ శ్రీ సాయి ఫణీంద్ర వాణిజ్య తరఫున యజమాని: శ్రీ ఫణికుమార్ దివ్వెల, చిరునామా: నెం. 68/5, ఏటుకూరు బైపాస్ రోడ్డు, గుంటూరు-522003. 2) శ్రీ ఫణికుమార్ దివ్వెల, తండ్రి: కోటేశ్వరరావు దివ్వెల, చిరునామా: నెం.68/5, ఏటుకూరు బైపాస్ రోడ్డు, గుంటూరు-522003. 3) శ్రీ వెంకటేశ్వరరావు కుప్పం, తండ్రి: శ్రీ కుప్పం వీరరాజు, ఫ్లాట్ నెం.201, హ్యాపీ హోమ్స్ అపార్ట్‌మెంట్స్, మోతినగర్, హైదరాబాద్. 4) శ్రీమతి మోహిణిదేవి దివ్వెల, తండ్రి: శ్రీ కోటేశ్వరరావు దివ్వెల, 5) శ్రీ కోటేశ్వరరావు దివ్వెల, తండ్రి: శ్రీ డి.వెంకటేశ్వర్లు, ఇరువురు వ.నెం.(4)&(5) చిరునామా: డి.నెం. 19-15-59, ఐపిడి కాలనీ, 2వ లైను, సంగడిగుంట, గుంటూరు-522003. 6) శ్రీ వెంకటనాగ చందు దివ్వెల, తండ్రి: శ్రీ ఫణికుమార్ దివ్వెల, డి.నెం. 19-15-59/ఎ, ఐపిడి కాలనీ, 2వ లైను, సంగడిగుంట, గుంటూరు-522003. 7) శ్రీమతి కుప్పం ధాన్యవతి, భర్త: శ్రీ కె.వెంకటేశ్వరరావు, ఫ్లాట్ నెం.201, హ్యాపీహోమ్స్ అపార్ట్‌మెంట్స్, మోతీనగర్, హైదరాబాద్. లాంఛనముగా స్వాధీనత తేదీ: 21.06.2023. బకాయి మొత్తం: i) PSOD A/c No. 2557000700086701 క్రింద రూ.99,30,074/- (అక్షరాల తొంభై తొమ్మిది లక్షల ముప్పై వేల డెబ్బై నాలుగు రూపాయలు మాత్రమే) + 01.10.2023 నుండి వడ్డీ మరియు ఖర్చులు మొ॥ వాటితో సహా ii) PSTL A/c.No.2557001801151401 క్రింద రూ.31,27,510.65/- (అక్షరాల ముప్పై ఒక్క లక్షల ఇరవై ఏడు వేల ఐదు వందల పది రూపాయలు మరియు అరవై ఐదు పైసలు మాత్రమే) + 01.10.2023 నుండి వడ్డీ మరియు ఖర్చులు మొ॥ వాటితో సహా వెరశి మొత్తము రూ.1,30,57,584.65 పై॥ (అక్షరాల ఒక కోటి ముప్పై లక్షల యాభై ఏడు వేల ఐదు వందల ఎనభై నాలుగు రూపాయలు మరియు అరవై ఐదు పైసలు మాత్రమే).
ఆస్తి యొక్క వివరము: ఐటమ్ నెం.1 : గుంటూరు, గుంటూరు గ్రామము, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, సంగడిగుంట, 2వ లైను, డోర్ నెం. 19-15-59, డి.నెం.1151 టు 1153 నందు శ్రీమతి మోహిణిదేవి దివ్వెలకు చెందిన 88 చ॥గ॥ విస్తీర్ణముగల ప్లాట్ నెం.112కు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: దానా చెన్నకేశవరావుకు చెందిన ప్లాట్ నెం.113 – 40'; దక్షిణం: ఆర్.శకుంతలకు చెందిన ప్లాట్ నెం.123 – 20'; పడమర: యమ్.లలిత కుమారి కి చెందిన ప్లాట్ నెం.111 – 40'; ఉత్తరం: మునిసిపల్ కార్పొరేషన్ రోడ్డు– 20'.

రిజర్వుధర: రూ.44,00,000/- (అక్షరాల నలభై నాలుగు లక్షల రూపాయలు)
చెల్లించవలసిన బయానా: రూ.4,40,000/- (అక్షరాల నాలుగు లక్షల నలభై వేల రూపాయలు)

ఐటమ్ నెం.2 : ఆస్తి యజమాని: 1) శ్రీమతి కుప్పం ధాన్యవతి మరియు 2) శ్రీమతి డి.వెంకటనాగ చందుకు చెందిన ఆస్తి. గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్, శ్యామలానగర్ ఎక్స్‌టెన్షన్ దగ్గర, బ్లాక్ నెం.14, వార్డు నెం.14, నల్లపాడు డోర్ నెం.2-14-159, డి.నెం.264/ఎ నందు 288.88 చ॥గ॥ (192.54 చ॥గ॥ & 96.34 చ॥గ॥) విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీస్థలము ప్లాట్ నెం.36 నకు సంబంధించిన యావత్తు. ఎ) 192.54 చ॥గ॥ విస్తీర్ణమునకు హద్దులు: తూర్పు: ప్లాట్ నెం.43 – 26.8 అ॥; దక్షిణం: విప్పడపు నాగార్జున యొక్క ప్లాట్ నెం.37 – 65 అ॥; పడమర: 30 అ॥ వెడల్పుగల రోడ్డు–26.8 అ॥ మరియు ఉత్తరం: దివ్వెల వెంకట నాగచందు యొక్క స్థలము– 65 అ॥. బి) 96.34 చ॥గ॥ విస్తీర్ణమునకు హద్దులు: తూర్పు: ప్లాట్ నెం.43 – 13.4 అ॥; దక్షిణం: కుప్పం ధాన్యావతి యొక్క స్థలము – 65 అ॥; పడమర: 30 అ॥ వెడల్పుగల రోడ్డు–13.4 అ॥ మరియు ఉత్తరం: ప్లాట్ నెం.35 – 65 అ॥.

రిజర్వుధర: రూ.25,00,000/- (అక్షరాల ఇరవై ఐదు లక్షల రూపాయలు)
చెల్లించవలసిన బయానా: రూ.2,50,000/- (అక్షరాల రెండు లక్షల యాభై వేల రూపాయలు)

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ - భవానీపురం బ్రాంచి (ఫోన్: 0866-2411488(G) / 9581116617 (BM))

వ.నెం.4: ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారుల యొక్క పేర్లు & చిరునామా, సింబాలిక్ స్వాధీనత యొక్క తేదీ మరియు సెక్యూర్డ్ ఆస్తుల యొక్క వివరములు: ఋణగ్రహీతలు/హామీదారులు/సహపూచీదారులు: M/s. నరసింహా కోల్డ్ స్టోరేజ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టనర్స్ ఎ) శ్రీ మూలి నరసింహారెడ్డి, బి) శ్రీమతి దొరసానమ్మ మూలి, చిరునామా: డి.నెం.354, NH-65, మునగచెర్ల, నందిగామ మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521185. (2) శ్రీ మూలి నరసింహారెడ్డి, తండ్రి: శ్రీ పెంచల రెడ్డి, (3) శ్రీమతి దొరసానమ్మ మూలి, భర్త: శ్రీ మూలి నరసింహారెడ్డి, (2) & (3) ఇరువురి చిరునామా: డి.నెం.4-20-14/2, 2వ లైను, సిద్ధార్థనగర్, పట్టాభిపురం, గుంటూరు-522006. లాంఛనముగా స్వాధీనత తేదీ: 21.03.2022. బకాయి మొత్తం: i) PSTL A/c No.8137001800002201 క్రింద రూ.4,74,94,009.30 పై॥ (అక్షరాల నాలుగు కోట్ల డెబ్బై నాలుగు లక్షల తొంభై నాలుగు వేల తొమ్మిది రూపాయలు మరియు ముప్పై పైసలు మాత్రమే) + 30.03.2023 నుండి భవిష్య వడ్డీ మరియు ఖర్చులు మొ॥ వాటితో సహా ii) PSOD A/c No.8137000600001701 క్రింద రూ.50,90,203.95 పై॥ (అక్షరాల యాభై లక్షల తొంభై వేల రెండు వందల మూడు రూపాయలు మరియు తొంభై ఐదు పైసలు మాత్రమే) + 01.10.2023 నుండి వడ్డీ మరియు ఖర్చులు మొ॥ వాటితో సహా iii) PSTL A/c No 8137001800003501 క్రింద రూ.1,10,28,560.18 పై॥ (అక్షరాల ఒక కోటి పది లక్షల ఇరవై ఎనిమిది వేల ఐదు వందల అరవై రూపాయలు మరియు పద్దెనిమిది పైసలు మాత్రమే) + 01.10.2023 నుండి వడ్డీ మరియు ఖర్చులు మొ॥ వాటితో సహా వెరశి మొత్తము రూ.6,36,12,773.43 పై॥ (అక్షరాల ఆరు కోట్ల ముప్పై ఆరు లక్షల పన్నెండు వేల ఏడు వందల డెబ్బైమూడు రూపాయలు మరియు నలభై మూడు పైసలు మాత్రమే).
ఆస్తి యొక్క వివరము: కృష్ణా జిల్లా, నందిగామ మండలం, మునగచర్ల గ్రామము మరియు పంచాయతీ, ఫామ్ 1బి ప్రకారము, ఆర్.యస్.నెం. 171/1బి, అసెస్‌మెంట్ నెం.354 నందు య॥ 1.71 సెం॥ విస్తీర్ణము గల సెమీ మెరక భూమి మరియు అందులో మెస్సర్స్ నరసింహా కోల్డ్ స్టోరేజ్ (గతంలో వాసు కోల్డ్ స్టోరేజ్) పేరుతో నిర్మించిన కోల్డ్‌స్టోరేజ్ స్ట్రక్చర్స్‌తో సహా యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: చిరుమామిళ్ళ పూర్ణచంద్రరావు యొక్క స్థలము; దక్షిణం: చిరుమామిళ్ళ నారాయణ యొక్క స్థలము; పడమర: డొంక; ఉత్తరం: చిరుమామిళ్ళ సావిత్రి యొక్క స్థలము. అక్షాంశము మరియు రేఖాంశము: 16°48'24.5"N మరియు 80°15'14.9"E.

రిజర్వుధర: రూ.4,54,50,000/- (అక్షరాల నాలుగు కోట్ల యాభై నాలుగు లక్షల యాభై వేల రూపాయలు) (1% టిడియస్ కలుపుకొని)
చెల్లించవలసిన బయానా: రూ.45,45,000/- (అక్షరాల నలభై ఐదు లక్షల నలభై ఐదు వేల రూపాయలు)

(సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) చట్టం ప్రకారము ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారులు / సహపూచీదారులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాల వ్యవధిని వినియోగించుకోగలరు.) (సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ (8) సబ్ రూల్ (6) క్రింద దీనిని నోటీసుగా కూడా పరిగణించబడుతుంది) అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కర్ణాటక బ్యాంక్ యొక్క వెబ్‌సైట్ అనగా www.karnatakabank.com లో "mortgaged assets for sale" హెడ్ క్రింద సందర్శించండి.
ఇ-వేలము 16.11.2023 తేదీన ఉ॥ 11.00 గం॥ నుండి ఉ॥ గం॥ 11.20 ని॥ల వరకు https://bankauctions.in/ పోర్టల్ ద్వారా 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో నిర్వహించబడును. ఉద్దేశించిన బిడ్డర్ తమ పేరును https://bankauctions.in/ నందు నమోదు చేసుకొని, యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను ఉచితంగా పొందండి మరియు ఇ-వేలంపై శిక్షణను (తాత్కాలికంగా 15.11.2023న) ఆన్‌లైన్ ద్వారా M/s.4closure, 605ఎ, HMDA మైత్రీవనం, అమీర్‌పేట, హైదరాబాద్, తెలంగాణ- 500038, సంప్రదించవలసిన నెం: 040-23736405, Mobile: 8142000062/63/64/66, Email: prakash@bankauctions.in and info@bankauctions.in నుండి పొందవచ్చును.

తేదీ: 13.10.2023, ప్రదేశం: హైదరాబాద్ — సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
EP No. 43 of 2022
in
A.C.P No. 96 of 2020

Between:-
Kapil Chits (Kosta) Pvt. Ltd Vijayawada Branch, Vijayawada, Rep. by It's Assistant Divisional Manager ... DHR
AND
Killi Nageswara Rao and others ... JDRS

Notice to JDRs 1,3 & 4,
1. Killi Nageswara Rao, S/o. Chinnavadu, R/o. D. No. Q. No. BF+1, C.A.R Police Quarters, Old Building, Near Church, Labbipeta, Vijayawada. (JDR No.1)
3. Kodali Ramu, S/o. Pamulu, R/o. H. No. 36-7-14/1, Wood Peta, Nehru Nagar, Vijayawada. (JDR No. 3)
4. Dasi Sanjeeva Kumar, S/o. Yesudaya, R/o. D. No. 1-3/4-172, Vidhyadharapuram, Vijayawada. (JDR No. 4)

Please take notice that the above Execution Petition had filed for Attachment of your salary for recovery of EP amount and the Hon'ble Court ordered notice to all of you and posted the matter to 06-11-2023 for your appearance. So all of you are here by requested to appear before the Hon'ble Principal Junior Civil Judge Court at Vijayawada to answer the execution Petition on 06-11-2023 at 10-30 A.M. in person or through your Advocate, failing which the matter will be decided in your absence.

(By order of the Hon'ble Principal Junior Civil Judge, Vijayawada)
A.PRASOON KUMAR
Advocate,
D.No.25-104
Yanamalakuduru
Vijayawada-7
Date of Adjournment: 06-11-2023

ఎపి రెవెన్యూ సర్వీస్ రూల్స్ ఆమోదించాలి

- సిఎస్‌కు ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రెవెన్యూశాఖలో పనిచేస్తున్న ఆఫీస్ సబార్డినేట్ స్థాయి నుంచి తహశీల్దారు స్థాయి వరకు ఉన్న నాలుగు రకాల సర్వీస్ రూల్స్ అన్నీ ఏకం చేసి ఉమ్మడి ఎపి రెవెన్యూ సర్వీస్ రూల్స్ ఆమోదించాలని ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయంలో శనివారం నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ ప్రతినిధుల బృందం సిఎస్‌తో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జూన్ 20న రెవెన్యూడేగా ప్రకటించాలని, గ్రేడ్-3 విఆర్‌ఒలను సర్వే ట్రైనింగ్‌తో సంబంధం లేకుండా ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూశాఖ పేరును ల్యాండ్, సాధారణ పరిపాలనాశాఖగా మార్చాలని కోరారు. గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్‌ఎ) వేతనం రూ.10,500 నుంచి రూ.21 వేలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. గ్రేడ్-2 విఆర్‌ఒలను సర్వే ట్రైనింగ్‌తో సంబంధం లేకుండా వారి ప్రొబేషన్ డిక్లేర్ చేయాలన్నారు. సిఎస్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సిహెచ్ నరసింహారావు, ఉపాధ్యక్షులు ఆర్‌వి రాజేష్, పి జాహ్నవి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ ఆర్‌వివి రోహిణీదేవి, రాష్ట్ర కార్యదర్శులు జి శ్రీనివాస్, బి అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎపి జెఎసి అమరావతి అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణ కోసం మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగుల ప్రతినిధులతో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ సమావేశం నిర్వహించింది. హాజరైన సభ్యుల ఆమోదంతో అడ్‌హాక్ కమిటీని నియమించారు. రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ అధ్యక్షులుగా ఈశ్వర్ దొప్పలపూడి, సహాధ్యక్షులుగా ఎ రాంబాబు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరావు, టి నాగరాజు, ఎస్‌కె దేవరాయలు, విశ్వనాథరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, మహిళా ఉపాధ్యక్షులుగా జి హెలెన్, ప్రధాన కార్యదర్శులుగా అప్పలరాజు, కార్యదర్శులుగా ఎం రాంబాబు, వెంకటకృష్ణ, మోహన్‌కృష్ణ, కళ్యాణ చక్రవర్తి, పిచ్చయ్య, మహిళా కార్యదర్శిగా డి మాధురి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గాలి సుధాకర్, జాయింట్ సెక్రటరీగా ఎం అప్పలరాజు, జె నాగరాజు, సాధిక్ హుస్సేన్, ప్రదీప్‌కుమార్, కృష్ణమూర్తి, కోశాధికారిగా మువ్వల రవిని నియమించారు. ఈ సమావేశంలో గ్రేటర్ విశాఖ మున్సిపల్ ఉద్యోగుల జెఎసి గౌరవాధ్యక్షులు వామనరావు, అమరావతి జెఎసి కోశాధికారి మురళీకృష్ణ నాయుడు, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కౌసల్య యోజన' వర్తింపజేయాలి

ఎపి రజక వృత్తిదారుల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా అర్హులుగా ఉన్న రజక వృత్తిదారులకు ప్రధాన మంత్రి విశ్వకర్మ కౌసల్య యోజన పథకం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాల్లో ఆన్‌లైన్ విధానాన్ని కచ్చితంగా అమలయ్యేలా చూడాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విజయవాడ బాలోత్సవ భవనం నందు రాష్ట్ర అధ్యక్షులు గురుశేఖర్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో భాస్కరయ్య మాట్లాడుతూ.. నవంబరు 20 నుంచి 30 వరకు వివిధ రూపాల్లో వృత్తిదారులతో రౌండ్ టేబుల్ సమావేశాలు, మండల స్థాయిలో ధర్నాలు, కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించాలని సమావేశంలో తీర్మానం చేశామన్నారు. 50 ఏళ్లు నిండిన ప్రతి రజక వృత్తిదారునికీ వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలన్నారు. ఈ సమస్యలపై అన్ని జిల్లాల కేంద్రాల్లో సదస్సులు, సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశాల్లో కోనేటి రాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఎం ఈశ్వరరావు, మడక రాజు, సుబ్బారావు, పాల్గొన్నారు.

ఆ 2,019 కోట్లు ఏమైనాయి?

- రాష్ట్రానికి కేంద్రం లేఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాల కోసం విడుదల చేసిన 2,019 కోట్ల రూపాయలు ఏమైనాయని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రశ్నించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ నుండి రాష్ట్రానికి అందిన లేఖ అధికారవర్గాల్లో చర్చనీయాంశమైంది. సింగిల్ నోడల్ ఏజెన్సీ ఖాతాల్లో ఈ మొత్తం జమ కాని విషయాన్ని కేంద్రం ప్రస్తావించినట్లు సమాచారం. కేంద్రం విడుదుల చేసిన మొత్తంతో పాటు, రాష్ట్రావాటాగా విడుదుల చేయాల్సిన మొత్తాన్ని కూడా ఇంత వరకు విడుదల చేయని విషయాన్ని కూడా కేంద్రం ప్రశ్నించినట్లు తెలిసిందే. కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి గతంలో కూడా ఈ తరహా పరిస్థితి నెలకొన్నట్లు తెలిసింది. అత్యవసరమైనప్పుడు నిధులను ఇతర పథకాలకు వాడు కోవడం కొత్తేమి కాదని, అన్ని రాష్ట్రాలూ ఈ తరహాలోనే వ్యవహరిస్తుంటాయని అధికారులు అంటున్నారు.ఆ మొత్తాన్ని సాధ్యమైనంత త్వరగా సర్దుబాటు చేస్తామ, అందువల్ల సథకం అమలుపై ప్రభావం పడకుండాచూసుకుంటామని చెబుతున్నా రు. సింగిల్ నోడల్ ఏజెన్సీ, ఎస్‌ఎల్‌ఎస్ (స్టేట్ లింక్ స్కీమ్స్), ఇ-కుబేర్ వంటి విధానాలను కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు తెరమీదకు తెస్తున్న సంగతి తెలిసిందే. దీంతో పాటు తామె ఇస్తున్న నిధులకు రాష్ట్ర వాటాగా జమ చేస్తున్న మొత్తానికి తప్పనిసరిగా రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు చూపాలని కేంద్రం కోరుతోంది. ప్రతియేటా కేంద్రం నుంచి కేంద్ర ప్రాయోజిత పథకాల కింద భారీగా నిధులు వస్తుంటాయి. ఈ నిధులకు రాష్ట్రం తన వాటా భరిస్తూ పథకాలకు అమలు చేయాల్సి ఉంటుంది. ఇందుకుగాను సింగిల్ నోడల్ ఏజెన్సీ ఖాతాలను ఏర్పాటుచేసి, వాటి ద్వారానే పథకాలు అమలు చేయాలని కేంద్రం నిర్దేశించింది. ఒక్కో పథకానికి ఒక్కో ఎస్‌ఎన్‌ఏ ఏర్పాటుచేయాలని, వాటిని కేంద్ర ఆధీనంలోని పిఎఫ్‌ఎంఎస్‌కు అనుసంధానం చేయాలని స్పష్టం చేసింది. ఆర్థిక ఇబ్బందులు ఇంకా పూర్తి స్థాయిలో కొలిక్కి రాని నేపథ్యంలో రాష్ట్ర, కేంద్ర నిధులను ఒతర అవసరాలకు వాడుకోవాల్సి వస్తోందని ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు. అందుకే కేంద్రం నుంచి వచ్చిన నిధులను పూర్తి స్థాయిలో ఎస్‌ఎన్‌ఏ ఖాతాల్లోకి మళ్లించలేపోతున్నామని వారంటున్నారు. అయినప్పటికీ 80 శాతానికి పైగా నిధులను ఎస్‌ఎన్‌ఏలోకి బదలాయిస్తున్నామని చెబుతున్నారు. ఇదే సమయంలో టాప్ అప్ విధానం పేరుతో కూడా కేంద్రం నుంచి మరో వత్తిడి పెరుగుతోంది.

మరో లేఖతో వత్తిడితో

అయినప్పటికీ కేంద్రం నుంచి నిధులపై వత్తిడి రోజురోజుకూ పెరిగిపోతున్న ట్లు సమాచారం. తాజాగా కేంద్రం నుంచి మరో లేఖ రాష్ట్ర ఆర్థికశాఖకు చేరినట్లు తెలిసింది. ఇందులో ఏకంగా 2019 కోట్లు ఇంకా ఎస్‌ఎన్‌ఏ ఖాతాల్లోకి చేరలేదని చెబుతూ ఆ నిధులపై ఆరా చేసింది. ఈ నిధులు ఎందుకు జమ చేయలేదని కూడా ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే నిధుల్లో కొంత భాగాన్ని ఇతర అవసరాలకు వాడుకోవడం వల్లనే ఆ నిధులను ఎస్‌ఎన్‌ఏ ఖాతాలోకి జమ చేయడం సాధ్యం కాలేదని ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు.

SMFG Grihashakti
Nayi Asha. Naya Vishwas.

ఎస్ఎంఎఫ్‌జి ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
(గతంలో ఫుల్లెర్టన్ ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)
కార్పొరేట్ ఆఫీసు: 503 & 504, 5వ అంతస్తు, జి-బ్లాక్, ఇన్‌స్పైర్ బికెసి, బికెసి మెయిన్ రోడ్, బంద్ర కుర్ల కాంప్లెక్స్, బంద్ర (ఈస్ట్), ముంబయి-400 051, మహారాష్ట్ర.
రిజిస్టర్డు ఆఫీసు: మేఘ్ టవర్స్, 3వ అంతస్తు, పాత నం.307, కొత్త నం.165, పూనంపల్లీ హై రోడ్, మధురవోయల్, చెన్నై-600 095, తమిళనాడు.

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు 30 రోజుల ఇ-వేలం అమ్మకం ప్రకటన.
ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు& హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ జాబితాలోని స్థిరాస్తులు "సెక్యూర్డ్ అసెట్స్") సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టు/చార్జ్‌చేయబడినవి. వాటిని ఎస్ఎంఎఫ్‌జి ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (గతంలో ఫుల్లెర్టన్ ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్) ("సెక్యూర్డ్ క్రెడిటర్") ఇందు దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు& హామీదారుల నుండి ఎస్ఎంఎఫ్‌జి ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (గతంలో ఫుల్లెర్టన్ ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)/ సెక్యూర్డ్ క్రెడిటర్‌కు బకాయి, రియలైజేషన్ తేదీ వరకు దానిపై తదుపరి వడ్డీ& ఇతర వ్యయాలుతో ఇందు దిగువ పేర్కొన్న బకాయిలను రికవరీచేయుట కొరకు, ఇందు దిగువ పేర్కొనబడిన తేదీ& సమయం పై "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది" ప్రాతిపదికన విక్రయించబడుతుంది.
రిజర్వు ధర, ధరావత్తు (ఇఎండి) మరియు ధరావత్తు డిపాజిట్‌చేయుటకు చివరి తేది ఇందు దిగువ కూడా ఇవ్వబడినవి:

1) ఇ-వేలం తేదీ& సమయం: 20.11.2023ఉ ఉ॥ 11.00గం.ల నుండి మ॥ 01.00గం.లు (ప్రతిసారి 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో)
2) పాల్గొనుటకు అభ్యర్థన లేఖ/ కెవైసి పత్రాలు/ ధరావత్తు రుజువు, మొ॥వాటిని దాఖలుచేయుటకు చివరి తేదీ& సమయం: 18.11.2023.

క్ర. సం.	రుణ ఖాతా నం., రుణగ్రహీతలు/హామీదారుల పేరు	డిమాండ్ నోటీసు తేదీ& మొత్తాలు	ఆస్తుల వివరణ
1	LAN : 605707510319906 1. లోయ మహా లక్ష్మయ్య (మరణించారు)(దరఖాస్తుదారు) తండ్రి శ్రీ పాండు రంగారావు 2. లోయ శ్రీదేవి (సహ-అభ్యర్థి) భర్త లోయ మహా లక్ష్మయ్య 3. మహాలక్ష్మయ్య రైస్ ట్రేడర్స్ (సహ-అభ్యర్థి) దాని యజాని ద్వారా: లోయ మహా లక్ష్మయ్య చిరునామా 1: డోర్ నం.8-70, ఆర్.ఎస్.నం.95/4, బ్లాక్ నం.8, అసెస్మెంట్ నం.2585, ఇందిరా నగర్-2, యనమలకుదూరు, విజయవాడ, ఆం.ప్ర.-520 007.	తేదీ: 30.07.2021, బకాయి 30.07.2021 నాటికి రూ.11,69,803/- (రూపాయలు పదకొండు లక్షల అరవై తొమ్మిది వేల ఎనిమిది వందల మూడు మాత్రమే)	ఎస్ఆర్ఓ పటమట, విజయవాడ రీజియన్ జిల్లా, కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, యనమల్‌కూరు గ్రామం& పంచాయతీ, లలితయ్య కాలనీ వద్దగల ఆర్.ఎస్.నం.95/4, డోర్ నం.8-70 లో 84.39చ.గ.లు లేదా 70.55చ.మీ.ల విస్తీర్ణపు ఆస్తి. సరిహద్దులు: తూర్పు: ముప్పవరపు సీతారామయ్య & ఇతరుల ఆస్తి 24.6అ.లు., పడమర: జోగి పద్మా; ఉత్తరం: 21అ.ల వెడల్పు పంచాయతి రోడ్ 24.6అ.లు; దక్షిణం: దోనెపుడి సూరిబాబు ల్యాండ్ 31అ.లు.

రిజర్వు ధర:	ధరావత్తు డిపాజిట్:	బిడ్ పెంపుదల విలువ:
రూ. 31,00,000/- (రూ. ముప్పై ఒక లక్షలు మాత్రమే)	రూ.3,10,000/- (రూ. మూడు లక్షల పది వేలు మాత్రమే)	రూ.31,000/- (రూ. ముప్పై ఒక వేలు మాత్రమే)

అమ్మకం యొక్క వివరణాత్మక నియమాలు& నిబంధనలు దిగువ విధంగా ఉన్నవి మరియు మా/సెక్యూర్డ్ క్రెడిటర్స్ వెబ్‌సైట్ లో దిగువ లింకు వద్ద/ వెబ్‌సైట్ అడ్రస్ (https://disposalhub.com&https://www.grihashakti.com/pdf/E-Auction.pdf) వద్ద కూడా ఇవ్వబడినవి. ఆసక్తిగల బిడ్డరుదారులు వీరిని కూడా సంప్రదించవచ్చును: కానూరి ఉమా శంకర్, మొబైల్ నం. 9848102052, ఇ-మెయిల్:Kaanoori.Shankar@grihashakti.com, శ్రీ మహేశ్ బంగేర, మొబైల్ నం. 8655605063, ఇ-మెయిల్:mahesh.bangera@grihashakti.com.

సం/-
అధీకృత అధికారి,
ఎస్ఎంఎఫ్‌జి ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (గతంలో ఫుల్లెర్టన్ ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)

ప్రదేశం: విజయవాడ, ఆం.ప్ర.
తేదీ: 15.10.2023

సర్వేయర్లపై పని ఒత్తిడి తగ్గించాలి

సర్వే కమిషనరుకు వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూముల రీ సర్వే చేస్తున్న గ్రామ సర్వేయర్లు తీవ్ర పని ఒత్తిడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఒత్తిడి తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఎపి సర్వే ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మధుబాబు ఆందోళన వ్యక్తం చేశారు. సర్వే సెటిల్‌మెంట్ కమిషనరు సిద్ధార్థ జైన్‌ను శనివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. రీసర్వేలో చేయాల్సిన ప్రతి పనినీ కేవలం గ్రామ సర్వేయరుతో మాత్రమే చేయిస్తుండటంతో పని ఒత్తిడికి గురవుతున్నట్లు కమిషనరు దృష్టికి తీసుకెళ్లారు. పనిఒత్తిడి తగ్గించాలని కోరారు.

సిఎం నిజాయతీ నిరూపించుకోవాలి : పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మద్యం తయారీ, నాణ్యత, అమ్మకాలు, ఇసుక, మైనింగ్ అక్రమ తవ్వకాలు, సరఫరాకు సంబంధించి ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో తమ నిజాయతీని నిరూపించుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిబిఐని ఆహ్వానించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి డిమాండ్ చేశారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

సంపాదకీయం

శాంతి కపోతం!

'యుద్ధం అంటే ఏమిటో నాకు తెలుసు. మనుషులు చనిపోవడం చూశాను. పిచ్చెత్తిపోవడం, ఆసుపత్రిలో నరకం అనుభవించడం చూశాను. కానీ వీటన్నిటి కన్నా ఘోరాతిఘోరమైన విషయం మరొకటి ఉంది. యుద్ధం అంటే వికృతమైన సామూహిక, మానసిక వైకల్యం' అంటాడు కవి, విప్లవ రచయిత, జర్నలిస్టు జాన్ రీడ్. యుద్ధం... అనాగరికం, అమానుషం. యుద్ధం ఒక విధ్వంసం. అది వినాశనానికి ప్రతిరూపం. మానవ ప్రపంచానికి ఒక మాయని గాయం. యుద్ధాల వల్ల సామ్రాజ్య స్థాపన కంటే... అవి చేసిన నష్టాలే ఎక్కువ. సామ్రాజ్యాల్ని నిర్మించిన వారిని చరిత్ర మర్చిపోయి ఉండొచ్చు. కానీ విధ్వంసం సృష్టించిన వాళ్లను, ఆ విధ్వంసం ఆనవాళ్లను మాత్రం ఎప్పటికీ మర్చిపోదు. ఎందుకంటే- యుద్ధాలకు ముగింపు పలికేదీ లేదు. చితులను పేర్చడం ఆపిందీ లేదు. గడచిన యుద్ధాలు చేసిన గాయాల మచ్చలింకా పచ్చిగానే వున్నాయి. సామ్రాజ్యవాద నీడ అలముకున్న ప్రతిచోట... ఏదోక రూపంలో యుద్ధక్రీడ తచ్చాడుతునే వుంటుంది. 'యుద్ధం ఎప్పుడు వచ్చినా, తొలుత మరణించేది సత్యమే' అంటాడు అమెరికన్ రాజనీతిజ్ఞుడు హైరమ్ వారెన్ జాన్సన్. యుద్ధోన్మాదం తలకెక్కిన నియంతలకు, సామ్రాజ్యవాదులకు సత్యంతో పనిలేదు. హితోక్తులు రుచించవు. వారికి కావాల్సింది ఆధిపత్యం... పెద్దన్న పెత్తనం. యుద్ధ నష్టం దేశాల మధ్యనే కాదు- నడిరోడ్డున పడే కుటుంబాల ఛిద్ర రూపం. ఈ నష్టం ఒకరోజుదో, ఒక సంవత్సరానిదో కాదు... కోల్పోయిన ఒక జీవిత కాలానిది.

యుద్ధం రావడానికి కారణాలు అనేకం వుండొచ్చు. కానీ యుద్ధం కారణంగా నలిగిపోయేది... మరణించేది సామాన్యులే. 'మనిషి పుట్టుకతో స్వేచ్ఛాజీవి... కానీ, ప్రతిచోటా సంకెళ్లలో చిక్కుకున్నాడు' అంటాడు రూసో. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అధిపత్యం అతి ప్రమాదకరమైన ఆయుధంగా మారినచోట మనిషి స్వేచ్ఛ, హక్కుల కాదు... దేశాల స్వేచ్ఛ, హక్కులు కూడా హననం కావించబడుతున్నాయి. బలమైన దేశం బలహీన దేశాన్ని కబళించడానికి అన్నిరకాల ఎత్తులు వేస్తున్నది. ఉక్రెయిన్ - రష్యాల మధ్య ఘర్షణ ఇంకా కొనసాగుతుండగానే, ఇజ్రాయిల్ - పాలస్తీనాల మధ్య ఘర్షణ మొదలైంది. ఇప్పుడు ఆ ప్రాంతాల్లో జీవితాలు నిరాదరణకు గురవుతున్నాయి. తినడానికి తిండిలేక, నిలువ నీడలేక చిన్నా పెద్ద తేడాలేకుండా భయోత్పాతంతో వణికిపోతున్నారు. వేలాదిమంది యువకులు యుద్ధంలో ప్రాణాలు కోల్పోతున్నారు. 'వయసు మళ్లిన వారు యుద్ధాలను ప్రకటిస్తారు. అయితే... ఆ యుద్ధాల్లో ప్రాణాలు పోగొట్టుకునేది యువకులే' అంటాడు హెర్బర్ట్ హూవర్ అనే అమెరికన్ రాజనీతిజ్ఞుడు. యుద్ధాల వల్ల అనర్థాలు తప్ప ఒరిగేదేమీ వుండదని ప్రపంచవ్యాప్తంగా అనేకమంది శాంతిగాముకులు, రాజనీతిజ్ఞులు చెబుతూనే వున్నారు. యుద్ధానికి ఉవ్విళ్లూరే పాలకుల ధోరణిని ఎద్దేవా చేస్తూ... 'రాజులు చరిత్రకు బానిసలు' అంటాడు టాల్‌స్టాయ్ తన 'వార్ అండ్ పీస్' నవలలో. యుద్ధమనేది ఏదైనా... అది మానవ వినాశనానికి దారిస్తుంది.

మహాకవి శ్రీశ్రీ అంటాడు... 'ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం/ నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం' అని. ప్రపంచంలో దుర్బలులను పీడించే బలవంతుల జాతి వున్నంత వరకు, ఒకవైపు శాంతి వచనాలు వల్లిస్తూనే, మరోవైపు అణ్వాయుధ వ్యాపారం సాగిస్తున్నంత వరకూ ప్రపంచంలో ఏదోక మూల ఘర్షణలు, యుద్ధాలు జరుగుతూనే వుంటాయి. 'రణరంగం కానిచోటు భూ/ స్థలమంతా వెదకిన దొరకదు.../ గతమంతా తడిసె రక్తమున,/ కాకుంటే కన్నీళులతో' అంటాడు శ్రీశ్రీ. ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమైనా యుద్ధం సమర్థనీయం కాదు. 'యుద్ధాన్ని వాయిదా వేయడమే మంచిది' అని ఓ కవి అన్నట్టుగా... యుద్ధాన్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాలి. యుద్ధమంటే నాశనమని, యుద్ధమంటే విధ్వంసమనీ, యుద్ధమంటే సర్వ జీవరాశుల మారణహోమమని, యుద్ధం తర్వాత మిగిలేది స్మశాన వైభవమేనని చెప్పే చైతన్యశీలురు ముందుకు రావాలి. యుద్ధోన్మాదం దేశభక్తి కాదని, రణోన్మత్త ఉత్సాహం దేశభక్తి కాదని తెగేసి చెప్పాలి. యుద్ధానికి కాదు... శాంతి స్థాపనకు సాహసం కావాలి. విశ్వమంతా శాంతి కపోతాలై ఎగరాలి.

మహనీయుల మాట



పెట్టుబడిదారీ సమాజం కుటుంబానికి సంబంధించిన సెంటిమెంట్లను సైతం దెబ్బ తీసి, మానవ సంబంధాలన్నిటిని మనీ సంబంధాలుగా మార్చేస్తుంది

-కారల్ మార్క్స్

అయిదు రాష్ట్రాల ఎన్నికలు- బిజెపిని వెంటాడుతున్న భయాలు

విశ్లేషణ

తెలకపల్లి రవి

అయిదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల తేదీలు వెలువడ్డాయి. నవంబరు ఏడున మొదలై డిసెంబరు 3న ఫలితాల ప్రకటనతో ముగిసే ఈ ఎన్నికలు ఇచ్చే సంకేతాల కోసం దేశమంతా ఎదురుచూస్తున్నది. తర్వాత కొద్ది వారాల్లోనే పార్లమెంటు ఎన్నికలు కూడా జరగాల్సి వుండటం అందుకు ప్రధాన కారణం. శాసనసభల, లోక్‌సభ ఎన్నికల ఫలితాలు అచ్చం ఒకే విధంగా వుండకపోయినా ఓటర్ల సరళి, పార్టీల పోకడలు అర్థం కావడానికి తప్పక ఉపయోగపడతాయి. అందులోనూ ఈ అయిదు రాష్ట్రాలలో కీలకమైన మూడు హిందీ రాష్ట్రాలు, దక్షిణాదిన తెలంగాణ వున్నందున మిశ్రమ చిత్రాన్ని ఆవిష్కరించే ప్రత్యేక అవకాశం కలుగుతున్నది. కాంగ్రెస్ బిజెపిలే మూడుచోట్ల , బిఆర్ఎస్ కాంగ్రెస్ ఒక చోట తలపడుతున్నాయి గనక ఇండియా వేదిక ప్రభావం కూడా తెలిసే సందర్భం. ఎంపి, రాజస్థాన్ రెండు చోట్ల ముఖ్యమంత్రి స్థాయి నేతలనే బిజెపి పక్కన పెట్టడం, పార్లమెంటు సభ్యులను ఎంఎల్‌ఎలుగా పెద్ద ఎత్తున మోహరించడం, తెలంగాణలో గట్టెక్కడం కోసం ఆంధ్రప్రదేశ్ పరిణామాలు వాడుకోవాలని టిడిపి నాయకుడు లోకేశ్‌ను పిలిపించడం వంటివి కేంద్ర పాలకుల అభద్రతను మొదటే స్పష్టం చేస్తున్నాయి. ఇక కాంగ్రెస్ విషయానికి వస్తే వేదికలోని వామపక్షాలకు ఇతర భాగస్వాములకు తాము ప్రధానంగా వున్నచోట సీట్ల సర్దుబాటు చేయడం, అంతర్గత సమస్యలను పరిష్కరించుకోవడం సవాళ్లుగా వున్నాయి. బిజెపి మతతత్వ రాజకీయాలను మోడీ సర్కారు ఏకపక్ష పోకడలను రాష్ట్రాలపై దాడిని నిరోధించడం తక్షణ కర్తవ్యమన్న మెళకువ పెరుగుతున్నది. అయితే ఈ ఎన్నికల నేపథ్యంలోనే న్యూస్‌క్లిక్‌పై దాడి, అరుంధతారాయ్ వంటి ప్రముఖ రచయితపై కొత్తగా కేసులు అంతర్జాతీయంగా ఇజ్రాయిల్ దురాక్రమణలను ఖండించకపోగా వంతపాడటం, సనాతన వివాదానికి ఆజ్యం పోయడం, అయోధ్య రామాలయానికి రాజకీయ పదును పెంచడం కనిపిస్తూనే వున్నాయి. తెలుగురాష్ట్రాల్లోనే నాలుగు పాంతీయ పార్టీలతోనూ బిజెపి డబుల్ గేమ్ ట్రిబుల్‌గేమ్ దక్షిణాది క్రీడగా మారింది.

ఎపిలో తమ అవసరాలను బట్టి తెలంగాణ లోబిజెపి కి మద్దతు ఆఫర్ చేయడం జనసేన టీడీపీ ల వ్యూహంగా వుంది. ఎపి తెలంగాణల విభజన సమస్యలను పరిష్కరించక పోగా జటిలం చేసి ప్రయోజనం పొందాలనుకోడరీ బిజెపి రాజకీయ కుటిలత్వం. బిజెపి మతరాజకీయాలకు బొమ్మ బొరుసు గా మజ్లీస్ కూడా అక్కడ తన ప్రభావం చూపిస్తుంది గనక మరింత అప్రమత్తత అవసరం. తన సంక్షేమ పథకాలు ,తెలంగాణ సెంటిమెంట్ గట్టెక్కిస్తుందని బిఆర్ఎస్ భావిస్తుండగా కర్ణాటక తరహాలో ఇక్కడా గెలుస్తామని కాంగ్రెసు నమ్మకంగా వుంది. సర్వే లు ఏం చెప్పినా తెలంగాణ ఎన్నికల పోరాటం తీవ్రంగా నే వుంటుంది. దక్షిణ భారతంలో బిజెపి, దాని అనుకూల శక్తులు కాలూనకుండా అడ్డుకోవడం కీలకమవుతుంది.

మూడు హిందీ రాష్ట్రాలు

బిజెపి కాంగ్రెస్‌లే తలపడే రాష్ట్రాలు రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్. గతంలో ఇవి మూడూ కాంగ్రెసే గెలిచింది. ఒక్క మధ్య ప్రదేశ్‌లో మాత్రం ఫిరాయింపులతో బిజెపి సీనియర్ శివరాజ్‌సింగ్ చౌహాన్ మళ్లీ అధికారం రేపట్టినా రాజస్థాన్‌లో అశోక్ గెహ్లాట్ ఆపగలిగారు. చత్తీస్‌గఢ్‌లో భూపేష్ బాఘెల్ కొనసాగారు .

రాజస్థాన్: బిజెపి నాయకులు తనకు కాస్తా అవకాశముందని భావించిన రాష్ట్రం రాజస్థాన్..అయితే మాజీ ముఖ్యమంత్రి రాజవంశీకురాలు వసుంధరారాజేను ముందుకు తేలేకపోయారంటేనే పరిస్థితి మారిందనే అభిప్రాయం ఏర్పడింది. ఇక్కడ గత ముప్పై ఏళ్లలోనూ అధికారంలో ఉన్న పార్టీని తిరిగి ఎన్నుకున్నది లేదు. సచిన్‌పైలెట్ తిరుగుబాటును ఆఖరి నిముషంలో ఆపగలిగినా అసమ్మతి అలాగేవుంది. పేపర్‌లీక్‌లు, అవినీతి ఆరోపణలు, శాంతిభద్రతల సమస్యలు రాజకీయ చర్చకు దారితీస్తున్నాయి. అన్నిటినీ మించి మతపరమైన ఉద్రిక్తతలు వాటిలో ఆరెస్సెస్ బిజెపి పాత్ర ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. 2002 జూన్‌లో ఒక టైలర్ తలనరకడం, 2008 పేలుళ్ల కేసులో నిందితులు విడుదల కావడం కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయంగా బిజెపి ఆరోపణలు చేస్తున్నది. పండుగలు ఉత్సవాలు అంటే చాలు మతోద్రిక్తలు పెరుగుతున్నాయి. 1993బాబరీ విధ్వంసం తర్వాత ఎన్నికల్లో బిజెపి (భైరాన్‌సింగ్ షెకావత్) తిరిగిఎన్నికైన రాష్ట్రం ఇది. మోడీనే ప్రధానంగా ముందుపెట్టి అధికారంలోకి రావాలని బిజెపి పథకాలు రచిస్తున్నది. లోతట్టు ప్రాంతాల్లో చొచ్చుకు పోతున్నట్టు ఆరెస్సెస్ చెప్పుకుంటున్నది. రాజ్యవర్ధన్‌సింగ్ రాథోర్, దివ్యకుమారి ,బాబాబాలక్‌నాథ్ వంటి అనేకమంది ఎంపిలను బిజెపి నిలబెట్టింది. అయితే తమ సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని కాంగ్రెస్ భరోసాగా వుంది. తాను గెలిస్తే కులగణన చేపడతానని గెహ్లాట్ ప్రకటించడం కూడా అనుకూల అంశంగా భావిస్తున్నారు. ఏ కాస్త తేడా వచ్చినా సచిన్ పైలెట్ తప్పక సమస్య సృష్టించడం తథ్యమే.

మధ్య ప్రదేశ్ : ఈ రాష్ట్రం కీలకమే గాక సమస్యాత్మకమైంది కూడా. గతసారి అధికాంలోకి వచ్చిన కాంగ్రెస్ జ్యోతిరాదిత్య సింధియా ఫిరాయింపు కారణంగా 2020లో అధికారంకోల్పోయింది. ఇప్పుడు బాగా అనుకూలంగా వుందని భావిస్తున్నా. సంపూర్ణ మెజార్టీ రాకపోతే కష్టమనే భయాలు వెన్నాడుతూనే వున్నాయి. మూడుసార్లు మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్‌సింగ్, తాజా మాజీ కమల్‌నాథ్ పార్టీ వ్యూహాలకు నాయకత్వం వహిస్తున్నారు. కమల్‌నాథ్ బిజెపి హిందుత్వ ఎత్తులను కూడా వదలిపెట్టకుండా హనుమాన్‌భక్తి వంటి పాచికలు కూడా ప్రయోగిస్తున్నారు.ఇక రాజవంశీకుడైన జ్యోతిరాదిత్య మొదటిసారి శాసనసభకు పోటీ చేస్తుంటే కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ప్రవేశం ఆశ్చర్యకరంగా మారింది. మధ్యలో కొద్ది మాసాలు మినహా 18 ఏళ్లనుంచి చౌహాన్ అధికారంలో వున్నారు గనక ప్రభుత్వ వ్యతిరేకత బాగా వుంది. గతంలో మోడీకి ప్రత్యామ్నాయంగా పరివార్ వర్గాలు మాట్టాడిన చౌహాన్ పేరు ఇప్పుడు ఆఖరి జాబితాలో గాని చూపించుకోలేకపోయారు. ముగ్గురు కేంద్ర మంత్రులు, ఏడుగురు ఎంపిలను కూడా బిజెపి రంగంలోకి దింపింది. చౌహాన్ తమ తదుపరి సిఎం అని బిజెపి చెప్పడం లేదుగాని ఆయన మాత్రం తాను ఫీనిక్స్ పక్షిలా పైకి లేస్తానని ప్రకటిస్తున్నారు. మరోవైపు ఆయన ప్రభుత్వం 50శాతం కమిషన్ సర్కార్ అని కమల్‌నాథ్ దెప్పిపొడుస్తున్నారు .పట్వారీల నియామకం, మహాకాల్ లోక్‌నిర్మాణం,రేషన్ కార్డుల పంపిణీ వంటి కుంభకోణాలు వున్నాయి. గతంలోని వ్యాపం ఆరోపణలు వెంటాడుతూనే వున్నాయి. 70శాతం పైగా ప్రజలు వ్యవసాయం పైన ఆధారపడిన ఈ రాష్ట్రంలో వర్షాభావం,గిట్టుబాటు ధరలు, దిగుబడితగ్గుదల పెద్ద సవాళుగానే వున్నాయి. రాష్ట్రంలో 47 గిరిజన స్థానాలున్నాయి. అంటే 20శాతం.2018లో వీటిలో31 కాంగ్రెస్‌నే గెలిపించాయి. తిరిగి అక్కడ పుంజుకోవాలని బిజెపి తంటాలుపడుతున్నా ఈ మధ్య ఓ ఆదివాసీపై బిజెపి నాయకుడు మూత్ర విసర్జన చేసిన ఘటన తీవ్ర నిరసనకు కారణమైంది. ఎంపి రాజస్థాన్‌లలో కొత్తతరం నాయకులను సృష్టించుకోవడం కోసం ఇదంతా జరుగుతున్నదని ఆ పార్టీ చెబుతోంది. రాష్ట్రాలలో బలమైన నాయకుల పట్టు తగ్గించి మోడీ నేరుగా నడిపించడమనే వ్యూహం కూడా ఇందులో వుంది.

చత్తీస్‌గఢ్: గతసారి ఎన్నికైన భూపేంద్ర సింగ్ బాఘేల్ ప్రభుత్వం అయిదేళ్లు కొనసాగింది. బాఘేల్‌కు రైతుపక్షపాతి అనే పేరున్నా సమస్యలు కూడా చాలా వున్నాయి. మూడుసార్లు ఎన్నికైన రమణ్ సింగ్‌ను ఓడించారనే పేరున్నా కాంగ్రెస్‌లో అంతర్గత సవాళ్లు తక్కువ కాదు. టిఎస్ సింగ్‌దేవ్ పార్టీలో మరో నాయకుడుగా ముందుకొస్తున్నారు. హిందూత్వ తరహాను ఏదో మేరకు భూపేంద్ర వ్యూహాత్మకంగా అమలు చేస్తారనే విమర్శ కూడా వుంది. ఆయన ఒబిసి కావడం, చత్తీస్‌గఢ్ ఆత్మగౌరవ నినాదం కలసి వస్తాయని కాంగ్రెస్ ఆశిస్తున్నది. ఎంఎల్ ఎలపై వ్యతిరేకత కూడా ప్రభావం చూపిస్తుంది. బిజెపికి రమణ్ సింగ్ ఏకైక ఆధారం కాగా హిందుత్వ మాత్రమే ప్రచారాయుధంగా వుంది. డబుల్ ఇంజన్‌సర్కార్ అయితే చత్తీస్‌గఢ్‌లో మౌలిక సదుపాయాల నిర్మాణం సాధ్యమనేది ఆ పార్టీ కీలక నినాదం. సర్వీస్ కమిషన్ అక్రమాలపై ఆరోపణలు హైకోర్టుదాకా వెళ్లడం, లిక్కర్‌స్కాం వంటివాటిని బిజెపి ప్రధానంగా ప్రచారంలో పెట్టింది. వరికి గిట్టుబాటు ధర విషయంలో వాగ్దాన భంగం,దక్షిణ బస్తర్ ఉత్తరాన సుర్గూజా ప్రాంతం బొగ్గుగనుల ప్రాంతంవంటిచోట్ల పర్యావరణం, గిరిజన సంక్షేమం,తీవ్రవాదం రాష్ట్రంలోకీలకాంశాలుగా వున్నాయి.

మిజోరం: జోరాంతంగ మిజో నేషనల్ ఫ్రంట్‌కు చెందిన వారు. పదిహేనేళ్ల విరామం తర్వాత 2018లో మూడోసారి ముఖ్యమంత్రి అయ్యారు.మాజీ ఉగ్రవాద నాయకుడు లాల్‌తంగా సన్నిహితుడైన జోరాం తంగకు మిజో జాతీయత గురించి ప్రత్యేకంగా చెప్పుకుంటారు. మయన్మార్ బంగ్లాదేశ్‌ల నుంచి ఇటీవల మణిపూర్ నుంచి వచ్చిన శరణార్థుల సమస్యలను పరిష్కరించడం ఆయన విజయాలుగా చెప్పుకుంటారు. తనపైన వున్న అవినీతి కేసుల నుంచి స్థానిక కోర్టులలో బయిటపడగలిగారు. ఈ అంశమే ఆయుధంగా దెబ్బతీయాలని ప్రతిపక్ష జోరం పీపుల్స్ మూమెంట్(జెడ్‌పిఎం) నాయకుడు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన మాజీ ఐపిఎస్ లాల్‌దుమోహ భావిస్తున్నారు. లాల్ తన్వాలా నాయకత్వంలో కాంగ్రెస్ 1984 నుంచి 2013 వరకు వరసగా విజయాలు సాధించింది, మాజీ ఆర్థిక మంత్రి లాల్‌సవాలా ప్రస్తుతం కాంగ్రెస్‌కు నాయకత్వం వహిస్తున్నారు.

తెలంగాణ

తెలంగాణ ఎన్నికల్లో తామే వస్తామనిమొదట చాలా హడావుడి చేసిన బిజెపి మునుగోడు దెబ్బ తర్వాత తోకముడిచింది. అప్పుడు దానిపై తీవ్ర విమర్శలు చేసిన బిఆర్ఎస్ అధినేత ముఖ్యమంత్రి కెసిఆర్ తర్వాత కాలంలో ఆ తీవ్రత తగ్గించడం, బిజెపి ఇండియా సమదూరమని ప్రకటించడం రాజకీయ సందేహాలకు కారణమైంది. ఆయన కుమార్తె ఎంఎల్‌సి కవితపై ఢిల్లీ లిక్కర్ కేసులో నవంబర్ వరకూ ఊరట లభించింది. ఇప్పటికీ కెటిఆర్, హరీశ్‌రావు వంటివారు బిజెపిపై నిప్పులు కక్కుతున్నా ఆ సందేహాలు తొలగిపోవడం కష్టమే. ఈ మధ్యనే మోడీ సభల్లో కెసిఆర్ ఒక దశలో ఎన్‌డిఎలోకి వస్తానని అనుమతి కోరితే తాను తిరస్కరించానని చెప్పారు. దాన్ని ఖండిస్తూ వారి నాయకుడు ఎంపి లక్ష్మణ్ తమ దగ్గరకు వచ్చినట్టు కెటిఆర్ చెప్పారు. మొత్తానికి తెరవెనక రాజకీయాలు చాలా నడిచినట్టు మాత్రం ప్రజలకు అర్థమైంది. ఏది ఏమైనా కాంగ్రెస్ రాకూడదని కోరుకుంటున్న బిజెపి నేతలు మతపరమైన ప్రసంగాలు చేస్తూ ఉద్రిక్తత పెంచుతున్నారు. కొన్ని సర్వేలలో కాంగ్రెస్‌కు అనుకూలంగా వస్తున్నా పోటీ తీవ్రంగానే వుండబోతున్నది. వామపక్షాలతో సీట్ల సర్దుబాటు చర్చల సంకేతాలు పంపిన కెసిఆర్ ఏకపక్షంగా అభ్యర్థుల జాబితా ప్రకటించి అది ముగిసిపోయిందని చెప్పడం విమర్శలకు గురైంది. ప్రస్తుతం కాంగ్రెస్ వామపక్షాల మధ్య కొన్ని చర్చలు జరిగినట్లు వార్తలొచ్చినా ఏవీ ఖరారు కాలేదు. కాంగ్రెస్‌కు సహజ సిద్ధమైన అంతర్గత కలహాలు, సామాజిక వర్గాల అలకలు కొనసాగుతున్నాయి. తెలుగువారుగా తెలంగాణ పరిస్థితి ఇంకోసారి మరింత వివరంగా మాట్లాడుకోవలసి వుంటుంది. అయితే ఇటీవల ఎపి రాజకీయాల ప్రభావం తెలంగాణపై అధికంగా కనిపిస్తున్నది. ఇక్కడి నాలుగు ప్రాంతీయ పార్టీలనూ గుప్పిట్లో పెట్టుకున్న బిజెపి చంద్రబాబు నాయుడు అరెస్టును అవకాశంగాతీసుకుని టిడిపిని తన వలయంలో చేర్చుకున్నది.ఎపిలో చంద్రబాబు అరెస్టుపై తెలంగాణలో మరీ ముఖ్యంగా ఐటి కారిడార్‌లో నిరసనలు అనుమతించబోమని కెటిఆర్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. .నెమ్మదిగా ఇది కులం కోణం తీసుకున్నట్టు కనిపిస్తోంది. ఆ సామాజిక వర్గం ఓట్లు అండదండలు కాంగ్రెస్‌కే వుంటాయని కథనాలు రావడంతో బిఆర్ఎస్ కూడా వ్యూహం మార్చింది.ఆ తర్వాత బిఆర్ఎస్ మంత్రులు కూడా బాబుకు అనుకూలంగా ప్రకటనలు చేశారు.

తెలంగాణ లో రాజకీయ ఆర్థిక సమస్యలు చాలా వున్నా కొన్ని శక్తులు ఉద్దేశపూర్వకంగా కుల మత విభజనలే వ్యూహాలు గా ముందుకు తెస్తున్నాయి. హిందుత్వ రాజకీయానికి దూషణలు దుర్భాషలు జోడించి రెచ్చిపోయిన బండి సంజయ్ స్థానంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిని చేశాక కొత్త ఎత్తుగడలు మొదలెట్టారు. చంద్రబాబు అరెస్టు పై లోకేష్ ను హోంమంత్రి అమిత్ షా తో కూచోబెట్టి ఇరువైపులా పురంధరేశ్వరి కిషన్ రెడ్డి వుండటం అందులో భాగమే.ఎన్డీయే లో చేరాలని ఉబలాటపడిన టిడిపి ని రానివ్వని బిజెపి ఇప్పుడు తన అవసరానికి ఇన్ని విన్యాసాలు చేస్తోంది.

సిపిఎం ఇప్పటికే స్పష్టం చేసినట్లు ఇండియా గ్రూపులో చేరడం లేదా చేరకపోవడం టిడిపి ఇష్టం. కానీ,మత తత్వం, ఎపికి చేసిన అన్యాయం, రాష్ట్రాల హక్కులపై దాడి వంటి విషయాలను విస్మరించి కేంద్ర బిజెపిని తీర్పరిగా చేయడం పొరపాటవుతుంది. ఎపిలో తమ అవసరాలను బట్టి తెలంగాణ లోబిజెపి కి మద్దతు ఆఫర్ చేయడం జనసేన టీడీపీ ల వ్యూహంగా వుంది. ఎపి తెలంగాణల విభజన సమస్యలను పరిష్కరించక పోగా జటిలం చేసి ప్రయోజనం పొందాలనుకోడం బిజెపి రాజకీయ కుటిలత్వం. బిజెపి మతరాజకీయాలకు బొమ్మ బొరుసు గా మజ్లీస్ కూడా అక్కడ తన ప్రభావం చూపిస్తుంది గనక మరింత అప్రమత్తత అవసరం. తన సంక్షేమ పథకాలు ,తెలంగాణ సెంటిమెంట్ గట్టెక్కిస్తుందని బిఆర్ఎస్ భావిస్తుండగా కర్ణాటక తరహాలో ఇక్కడా గెలుస్తామని కాంగ్రెసు నమ్మకంగా వుంది. సర్వే లు ఏం చెప్పినా తెలంగాణ ఎన్నికల పోరాటం తీవ్రంగా నే వుంటుంది. దక్షిణ భారతంలో బిజెపి, దాని అనుకూల శక్తులు కాలూనకుండా అడ్డుకోవడం కీలకమవుతుంది.

మకాం మారిస్తే అభివృద్ధి జరిగిపోతుందా?

వ్యాసం

కె. లోకనాథం

ముఖ్యమంత్రి విశాఖ కేంద్రంగా పని చేయడానికి, సమీక్షలు చేయడానికి క్యాంపు ఆఫీసు ఏర్పాటుకై రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఆర్.టి నెంబరు 2015ను 11-10-23న ఆగమేఘాల మీద విడుదల చేసింది. ముఖ్య మంత్రి విశాఖపట్నానికి మకాం మార్చితే ఆటోమేటిక్‌గా ఉత్తరాంధ్ర అభివృద్ధి అవుతుందని ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉంది. ఉత్తరాంధ్ర జిల్లాల వెనుకబాటు విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాలలో స్పష్టంగా కనబడుతుంది. ఈ మూడు రంగాల్లో వీరి పరిపాలన నాలుగున్నరేళ్ళ కాలంలో ఏం చేశారో తెలియచేసి, అప్పుడు మిగతా విషయాల గురించి మాట్లాడితే సబబుగా ఉండేది. కానీ ఈ కాలంలో మీరు ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఏం చేయకుండా, నేడు ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఏదో చేసేస్తామని దాని కోసమే విశాఖ నుండి పాలన చేస్తామని చెప్పడం ప్రజలను మోసగించడమే అవుతుంది. అక్షరాస్యతలో ఉత్తరాంధ్ర జిల్లాలు రాష్ట్రంలోనే అధమంగా ఉన్నాయి. అక్షరాస్యతను పెంచడానికి ఈ కాలంలో మీరు చేసిన కృషి ఏమీ లేదు కానీ ఉన్న ప్రాథమిక పాఠశాలలనే అనేకం మూసివేశారు. ఈ ప్రాంతంలో అత్యధికంగా ఉన్న ఎయిడెడ్ విద్యా సంస్థలకు ఎయిడ్‌ను ఎత్తేశారు. ఫలితంగా ప్రాథమిక, ఉన్నత విద్యలు రెండూ ప్రజలకు మరింత దూరం అయ్యాయి. ఇదే జీవోలో గిరిజన ప్రాంతం కోసం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇక్కడ నిరక్షరాస్యత మరింత అధికంగా ఉంది. మహిళా అక్షరాస్యత ఇంకా ఘోరం. అల్లూరి జిల్లాలోని పెదబయలు మండలంలో అక్షరాస్యత కేవలం 33 శాతం మాత్రమే. అందులోను మహిళా అక్షరాస్యత కేవలం 24 శాతం ఉందీ అంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో తెలుస్తుంది. విచిత్రంగా ఇప్పుడు అభివృద్ధి కోసం మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకం వల్ల ఇదే మండలంలో ఉన్న పాఠశాలలు మూతబడ్డాయి. పాఠశాలల మూసివేత అంటే విద్యార్థులకు పాఠశాల మరింత దూరమై, వారు చదువు నుండి డ్రాపవుట్ అవుతారు. దీనివల్ల నిరక్షరాస్యత మరింత పెరుగుతుంది. అక్షరాస్యత పెంచడానికి ఏజెన్సీ ప్రాంతంలో మరిన్ని పాఠశాలలను ఏర్పాటు చేయవలసింది పోయి ఉన్నవాటినే మూసివేయడం ఏ రకంగానూ సమర్ధనీయం కాదు.

ఇక వైద్య రంగంలో పరిస్థితి విషమంగా ఉంది. మొత్తం ఉత్తరాంధ్రలోని ఒక్క ప్రభుత్వ ఆసుపత్రిలోనూ పూర్తి స్థాయి సిబ్బంది లేరు. ఈ ప్రాంతాల్లో పేరొందిన విశాఖ కెజిహెచ్ లో వైద్య సిబ్బంది, నర్సింగ్ ఇతర సిబ్బంది చాలా తక్కువగా ఉన్నారు. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లోని పాడేరు, అరకు ఆసుపత్రులలో సిబ్బంది తో సహా కనీస సదుపాయాలు కూడా లేవు. శ్రీకాకుళం రిమ్స్, విజయనగరం జనరల్ హాస్పిటల్, టెక్కలి జిల్లా ఆసుపత్రులతో సహా ఏ ఒక్క వైద్య సంస్థలోనూ, ఆస్పత్రులలోనూ కనీసమైన సిబ్బంది కూడా లేరు. ఉద్దానం ప్రాంతాల్లో అత్యధికంగా ఉన్న కిడ్నీ వ్యాధితో అనేకమంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల కాలంలో ఈ మరణాల సంఖ్య మరింత పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి స్వయంగా శంకుస్థాపన చేసిన పలాస లోని ఉద్దానం కిడ్నీ రీసెర్చ్ సెంటర్ కమ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఐదేళ్లు పూర్తి కావస్తున్నా, ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. ఉత్తరాంధ్రలో ఉపాధి అవకాశాలు లేక ఈ ప్రాంతం నుండి అనేకమంది సుదూర ప్రాంతాలకు పొట్ట చేత పట్టుకుని ఉపాధికై వలసలు పోతున్నారు. గ్రామీణ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే, వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలి. అంటే నీటి ప్రాజెక్టుల నిర్మాణం తప్పనిసరి. కానీ విచిత్రంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్ళ కాలంలోనూ ఉత్తరాంధ్రలోని కనీసం ఒక్కటంటే ఒక్క నీటి ప్రాజెక్టు నిర్మాణం కూడా పూర్తి చేయలేదు. వీరి మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న విజయనగరం జిల్లా తారకరామా తీర్థ సాగర్, శ్రీకాకుళం లోని ఆఫ్ షోర్ ప్రాజెక్టు, వంశధార రెండవ దశ నిర్మాణాలు అడుగు కూడా ముందుకు పడలేదు. ఉత్తరాంధ్రకు జీవనాడిగా ఉండే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు తగినన్ని నిధులు కేటాయించి, రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేసే చర్యలు ఈ కాలంలో చేపట్టలేదు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు మరింత క్షీణించి, వలసలు మరింతగా పెరిగాయి. దీనికి తోడు ఉత్తరాంధ్రలో గతం నుండి సాంప్రదాయంగా వస్తున్న వ్యవసాయ ఆధారిత పరిశ్రమలైన జ్యూట్, షుగర్ ఫ్యాక్టరీలు వంటివన్నీ మూతపడుతూనే ఉన్నాయి. వీరి మంత్రి ఉన్న విజయ నగరం జిల్లాలో ఉన్న దాదాపు అన్ని జ్యూట్ మిల్లులు మూత బడి ఉన్నాయి. విశాఖలోని వీరి గత మంత్రే చిట్టివలస జ్యూట్ మిల్లును పూర్తిగా మూసివేయడానికి యాజమాన్యానికి దగ్గరుండి సహకరించారు. మరోపక్క ఉత్తరాంధ్రకే గాక రాష్ట్రానికే తలమానికంగా ఉన్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను మూసివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తే దానిని ప్రతిఘటించి కాపాడుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ పని చేయకపోగా తిరిగి కేంద్ర ప్రభుత్వానికి సహకరించేలా వ్యవహరిస్తోంది. స్టీల్‌ప్లాంట్‌కు పక్కలో బల్లెంలా ఉంటూ, దీనిని ఎలా తన్నుకు పోవాలా అని చూస్తున్న అదానీ సంస్థకు సహకరించేలా గంగవరం పోర్టులోని రాష్ట్ర ప్రభుత్వ 10.39 శాతం వాటాను కూడా మొత్తంగా ప్రభుత్వం అమ్మేసింది. దీని ఫలితంగా 2852.26 ఎకరాల మొత్తం భూమితో సహా సర్వహక్కులు రాష్ట్ర ప్రభుత్వం వదిలేసుకుని అదానీకి ధారాదత్తం చేసింది. వెరసి నేడు ఉత్తరాంధ్రలో పారిశ్రామికీకరణ ఏమీ జరగలేదు కానీ ఉన్న పరిశ్రమలే మూతబడడం, ఉన్న పరిశ్రమలలో కూడా ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం పరిపాటిగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా విశాఖపట్నంలో సదస్సులు నిర్వహించినా, కొత్తగా వచ్చిన పరిశ్రమలు ఏమీ లేవు. ఈ రకంగా ఉత్తరాంధ్ర ఈ కాలంలో కూడా విద్య, వైద్యం, ఉపాధి వంటి అన్ని రంగాలలోనూ మరింత వెనుకబాటులోకే నెట్టబడింది.

అభివృద్ధి జరగాలంటే అధికార వికేంద్రీకరణ చేయాలి, నిధులు మంజూరు చేయాలి. కానీ వీరి ప్రభుత్వం పంచాయతీలకు, ఎన్నికైన స్థానిక సంస్థలకున్న హక్కులనే హరించి వేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి నిజంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటే, నీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలి. గిరిజన ప్రాంతంలో సహా విద్య, వైద్యం, రవాణా వంటి మౌలిక వసతులు కల్పించాలి. ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించడంతో పాటు, ఉత్పత్తి రంగంలో పెట్టుబడులు పెట్టి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.

వీటన్నిటికీ తోడు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రంతో పాటు ఉత్తరాంధ్రకూ తీరని ద్రోహం చేసింది. చేస్తోంది. రాష్ట్ర విభజన చట్టంలోని ఏ ఒక్క అంశాన్నీ కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా పదేళ్లు గడుస్తున్నా నేటికీ అమలు చేయలేదు. ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీని ఒక ప్రహసనంలా మార్చివేసింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్యాకేజీ కూడా వెనక్కి తీసుకెళ్ళింది. ఉత్తరాంధ్ర సాధించిన అభివృద్ధి అంతకంటే లేదు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వ పదేళ్లుగా ప్రకటనలే గాని, నేటికీ ఆచరణ రూపం దాల్చలేదు. పెట్రో యూనివర్సిటీ నిర్మాణం ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. గిరిజన యూనివర్సిటీకైతే రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకం వల్ల మరింత ఆలస్యం జరిగింది. ఇక ఎప్పటికి పూర్తవుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. విశాఖలో చట్టం ప్రకారం ఏర్పాటు చేయవలసిన విశాఖ మెట్రో రైల్ నిర్మాణం సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం చెప్పేసింది. దీనిని వ్యతిరేకించి, మనకు హక్కుగా రావలసిన మెట్రో రైల్‌ను సాధించుకోవాల్సింది పోయి, రాష్ట్ర ప్రభుత్వం ఆశ్చర్యకరంగా కేంద్ర ప్రభుత్వం చేయకపోతే తామే నిర్మాణం చేపడతామని చెప్తోంది.

ఈ విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కాలంలో ఉత్తరాంధ్ర అభివృద్ధికి చేసింది ఏమీ లేదు కానీ, స్టీల్ ప్లాంట్ అమ్మకంతో సహా ఉత్తరాంధ్రకు ద్రోహం చేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి సహకరించడం ఏమాత్రం క్షంతవ్యం కాదు. ఇది కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ద్రోహ చర్యలలో భాగస్వామ్యం కావడం తప్ప మరొకటి కాదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీసు విశాఖలో ఏర్పాటు చేసే ముందు ఉత్తరాంధ్రకు వీరి పాలనా కాలంలో ఏం చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలి.

- ఉత్తరాంధ్ర ప్రజలకు తాగునీరు, సాగునీరు కోసం చేపట్టే సుజల స్రవంతి ప్రాజెక్టు పనుల కోసం ఎంత నిధులు కేటాయించారో, రైతులకు ఏం మేలు చేశారో తెలపాలి.
- ఉత్తరాంధ్రలో కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలు, ఫెర్రో అలాయిస్, జూట్ కంపెనీలు తెరిపించడానికి ఏం చేశారు? అప్పటికే మూతపడిన చిన్న, మధ్యతరహా పరిశ్రమలు తెరిపించడానికి ఎటువంటి చర్యలు తీసుకున్నారు?
- స్టీల్‌ప్లాంట్ ఉత్తరాంధ్రకే కాకుండా ఆంధ్ర రాష్ట్రానికే తలమానికం. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత 970 రోజులుగా పోరాటం జరుగుతున్నది. లక్ష కుటుంబాలకు పైగా ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను రక్షించడంలో వీరి ప్రభుత్వ పాత్ర ఏమిటి?
- గంగవరం పోర్టును అదానీకి ఎందుకు ధారాదత్తం చేశారు? పైగా స్టీల్‌ప్లాంట్‌కు రావాల్సిన ముడిసరుకును ఎందుకు ఆపించేశారు?
- విశాఖపట్నం ఏజెన్సీలో ఆదిమ తెగ ఉంది. బాగా వెనుకబడినవారు, వారి కోసమే ముఖ్యమంత్రి విశాఖపట్నం మకాం మార్చుతున్నామని జీవోలో పేర్కొన్నారు. వీరంతా వామపక్ష ఉగ్రవాదం వైపు వెళ్ళిపోతున్నారని ఆ జీవోలో పేర్కొనడం దుర్మార్గమైనది. గిరిజన ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవటమే కాకుండా ఆదిమ గిరిజనులకు అంత్యోదయ కార్డుల ద్వారా ఇచ్చే ఉచిత రేషన్ ఎందుకు సక్రమంగా పంపిణీ చేయడంలేదు? గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎంతమందికి కల్పించారు? గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పనకై ఏం చర్యలు చేపట్టారు? 1/70 చట్టానికి భిన్నంగా హైడ్రో ప్రాజక్టు పేరున గిరిజనుల భూమిని కార్పొరేట్లకు ఎందుకు ధారపోస్తున్నారు?
- ల్యాండ్ పూలింగ్ ద్వారా 6116 ఎకరాల భూమిని రైతుల నుండి బలవంతంగా ఎందుకు లాక్కున్నారు?
- రైల్వే జోన్, వాల్తేరు డివిజన్, మెట్రో రైలు, గిరిజన యూనివర్శిటీ వంటి విభజన హామీలు, వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు కేంద్ర నుండి రావాల్సిన నిధులు కోసం ఏం ప్రయత్నం చేసారు?

ఈ ప్రశ్నలకు సమాధానం రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పాలి. అలా కాకుండా విశాఖపట్నం మకాం మార్చడమంటే, ఉత్తరాంధ్రలో ఉండే కోట్ల రూపాయల విలువ చేసే భూములను దోచుకోవడానికి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి తప్ప ఇంకొకటి కాదు అని భావించవలసి ఉంటుంది. ఇప్పటికే ఉత్తరాంధ్ర వెనకబడింది తప్ప ఈ ప్రాంతంలో ఉండే రాజకీయ పార్టీల నాయకులు వెనకబడిలేరు. ముఖ్యమంత్రి క్యాంపు ఆఫీస్ వచ్చినంత మాత్రాన అభివృద్ధి జరగదు. పైగా చిరు వ్యాపారులు, అసంఘటిత రంగ కార్మికుల ఉపాధి పోయే ప్రమాదముంది.

అభివృద్ధి జరగాలంటే అధికార వికేంద్రీకరణ చేయాలి, నిధులు మంజూరు చేయాలి. కానీ వీరి ప్రభుత్వం పంచాయతీలకు, ఎన్నికైన స్థానిక సంస్థలకున్న హక్కులనే హరించి వేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి నిజంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటే, నీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలి. గిరిజన ప్రాంతంలో సహా విద్య, వైద్యం, రవాణా వంటి మౌలిక వసతులు కల్పించాలి. ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించడంతో పాటు, ఉత్పత్తి రంగంలో పెట్టుబడులు పెట్టి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

★

రాజకీయ లబ్ధికోసమే చంద్రబాబు ఆరోగ్యంపై డ్రామాలు

- మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు నాయుడు ఆరోగ్యంపై టిడిపి నాయకులు, ఆయన కుటుంబ సభ్యులు డ్రామాలు ఆడుతున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. చంద్రబాబుకు నిజంగా ఆరోగ్యం బాగోలేకపోతే కోర్టులో ఎందుకు పిటిషన్ వేయలేదని ప్రశ్నించారు. విజయనగరంలోని ఎమ్మెల్యే అప్పలనర్సయ్య నివాసంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబుకు సరైన వైద్యం అందడం లేదని, ఆయన ఆరోగ్యం క్షీణించిందని మూడు రోజులుగా టిడిపి నాయకులు కొత్త డ్రామాలు మొదలు పెట్టారని అన్నారు. ఆయన ఆరోగ్యం క్షీణిస్తే మెరుగైన వైద్యం కోసం అనుమతి ఇవ్వాల్సింది ప్రభుత్వమా? కోర్టా? అని ప్రశ్నించారు. కోర్టులో పిటిషన్ వేయకుండా డ్రామాలు ఎందుకని నిలదీశారు. శుక్రవారం రాత్రి ఒక సామాన్య వ్యక్తితో నాకు ఫోన్ చేయించి 'చంద్రబాబు ఏ తప్పూ చేయలేదు కదా? ఆయనను జైలు నుంచి విడిచి పెట్టండయ్యా' అంటూ ఏడుస్తూ మాట్లాడించారని తెలిపారు. ఆయన తప్పు చేశాడా? లేదో కోర్టులో తెలుస్తుందని తాను బదులిచ్చానని చెప్పారు. ఉదయం లేచేసరికి ఆ వ్యక్తి నాతో మాట్లాడింది పేపర్లలో, టివి ఛానల్స్‌లో ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఇటువంటి డ్రామాలు ఆడించిన ఛానల్ యాజమాన్యంపై చట్టపరంగా ఎందుకు చర్యలు తీసుకోకూడదని ప్రశ్నించారు. నూటికి రెండు వందల శాతం చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో అవినీతికి పాల్పడ్డారని తెలిపారు. చంద్రబాబుకు కనీసం నీళ్లు కూడా ఇవ్వరా? అని అశోక్ గజపతిరాజు నీతి కబుర్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టిడిపి నాయకులు బెయిల్ కోసం కృషి చేయడం లేదని, చంద్రబాబును జైల్లోనే ఉంచి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని అన్నారు. రాష్ట్ర పరిపాలన విశాఖ నుంచి వేగంగా జరగాలని కోరుకుంటున్నానని తెలిపారు.

ఆ కేసులకు 'సుప్రీం' తీర్పు వర్తించదు

- యుఎపిఎ కింద అరెస్టులపై ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ : చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం (యుఎపిఎ) కేసుల విషయంలో ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అరెస్టు విషయంలో రాతపూర్వకంగా కారణాలు వెల్లడించాలన్న సుప్రీంకోర్టు తీర్పు ఈ కేసుల విషయంలో వర్తించదని స్పష్టం చేసింది. వివాదాస్పద చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం కింద తమ పోలీసు రిమాండ్‌ను సవాలు చేస్తూ న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు, ఎడిటర్ ఇన్ చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థ, మానవ వనరుల విభాగం అధిపతి అమిత్ చక్రవర్తి దాఖలు చేసిన పిటిషన్‌లపై విచారణ సందర్భంగా జస్టిస్ తుషార్ రావు గేదెల ఈ వ్యాఖ్యలు చేశారు. వారి అభ్యర్థనలో ఎటువంటి అర్హత లేదని పేర్కొంటూ కోర్టు వారి పిటిషన్లను తిరస్కరించింది. న్యూస్‌క్లిక్‌కు సంబంధించిన పలువురు జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసులు దాడి చేసిన తర్వాత అక్టోబర్ 3న పుర్కాయస్థ, చక్రవర్తిలను అరెస్టు చేశారు. సిటీ కోర్టు వారిని మొదట ఏడు రోజుల పాటు పోలీసు కస్టడీకి, ఆ తర్వాత 10 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించింది. పంకజ్ బన్సాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా మరియు ఇతరుల కేసులో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి అరెస్టుకు గల కారణాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని సుప్రీంకోర్టు అక్టోబర్ 4న తీర్పునిచ్చిన విషయం విదితమే. జర్నలిస్టుల అరెస్టు నేపథ్యంలో ఇప్పటికే మోడీ సర్కారు తీరుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. వివాదాస్పద యుఎపిఎను సైతం మోడీ సర్కారు దుర్వినియోగపరుస్తున్నదన్న ఆరోపణలు సైతం వినిపిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు పై విధంగా స్పందించటం గమనార్హం.

చిన్న, మధ్య తరహా సంస్థలకు బీమా ప్రారంభించిన కేరళ ప్రభుత్వం

తిరువనంతపురం : సూక్ష్మ చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్ఎంఈలు) కోసం కేరళ ప్రభుత్వం సమగ్ర బీమా పథకాన్ని ప్రారంభించింది. దీనివల్ల ఒడిదుడుకుల నుండి ఆ సంస్థలకు రక్షణ లభించడంతో పాటు పోటీ వ్యాపార వ్యవస్థలో వాటిలో విశ్వాసం పెరుగుతుంది. పథకం అమలు కోసం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య మంత్రిత్వ శాఖ నాలుగు ప్రభుత్వ రంగ బీమా కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ పథకం కింద వార్షిక ప్రీమియంలో యాభై శాతాన్ని ఎంఎస్ఎంఈలకు రీయంబర్స్ చేస్తారు. పథకం వెబ్‌సైట్‌ను రాష్ట్ర పరిశ్రమల మంత్రి పి.రాజీవ్ ప్రారంభించారు. చిన్న, మధ్య తరహా సంస్థలు తమ వ్యాపారంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఆ సంస్థలకు వాటి నుండి ఆర్థికపరమైన రక్షణ కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని వెబ్‌సైట్ ప్రారంభించిన సందర్భంగా రాజీవ్ తెలిపారు. బీమా సౌకర్యం వల్ల ఆయా సంస్థలు పురోభివృద్ధి సాధించేందుకు అనువైన వాతావరణం ఏర్పడుతుందని, తమ ఉత్పత్తులు, సేవల మార్కెట్‌ను విస్తరించుకునేందుకు అవకాశం కలుగుతుందని వివరించారు. 'కేరళలో మూడు లక్షలకు పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయి. అయితే వీటిలో 15 వేల సంస్థలకు మాత్రమే బీమా సదుపాయం ఉంది. ఎంఎస్ఎంఈల డిమాండ్లను నెరవేర్చి, వివిధ పథకాలతో వాటికి అవసరమైన మద్దతు కల్పించడం ద్వారా ఆ సంస్థలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది' అని అన్నారు.

పాలస్తీనాకు ఐప్సో సంఘీభావం

- జంతర్‌మంతర్ వద్ద ఆందోళన

న్యూఢిల్లీ : హమస్ సాయుధులను అణిచేసే పేరుతో పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దురాక్రమణ దాడులను అఖిల భారత శాంతి, సంఘీభావ సంస్థ (ఐప్సో) తీవ్రంగా ఖండించింది. పాలస్తీనాకు సంఘీభావం తెలియజేస్తూ సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కమిటీతో కలిసి ఐప్సో న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన నిర్వహించింది. సామూహిక మారణహోమ ముప్పును ఎదుర్కొంటున్న పాలస్తీనియన్లకు సంఘీభావంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించింది. ఈ కార్యక్రమంలో ఐద్వా, ఎస్ఎఫ్ఐ, ఎఐకెఎస్ తదితర కార్మిక, ప్రజా సంఘాలు కూడా పాల్గొన్నాయి. ర్యాలీలో పాల్గొన్నవారిని ఉద్దేశించి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు, కేంద్ర కమిటీ సభ్యులు, ఐప్సో ప్రధానకార్యదర్శి అరుణ్‌కుమార్, నాయకులు జి దేవరాజన్, ఎంపి పి సంతోష్‌కుమార్, ఎఐకెఎస్ కోశాధికారి పి క్రిష్ణప్రసాద్, ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు విపి సాను, న్యాయవాదుల యూనియన్ ప్రధాన కార్యదర్శి పివి సురేంద్రనాథ్, ప్రొఫెసర్ శాశ్వతి మజుందార్, న్యాయవాది సుభాష్ చంద్రన్, వివేక్ శర్మ, ఐద్వా నాయకులు మైమూనా మొల్లా, సాయి ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. ఇజ్రాయిల్ దురాక్రమణకు తెర దింపుదాం..పాలస్తీనాను కాపాడుదాం అని నినదించారు. మానవ హక్కులను పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు.

స్వదేశానికి మరో 235 మంది భారతీయులు

హమాస్‌తో యుద్ధం నేపథ్యంలో...ఇజ్రాయిల్‌లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చే 'ఆపరేషన్ అజయ్' రెండో విడతలో భాగంగా 235 మంది భారతీయులతో కూడిన విమానం శనివారం ఢిల్లీకి చేరుకుంది. శుక్రవారం తెల్లవారుజామున టెల్ అవీవ్ నుంచి బయలుదేరిన తొలి బ్యాచ్ ప్రత్యేక విమానం ద్వారా 212 మంది భారతీయులు స్వదేశానికి చేరుకున్న విషయం తెలిసిందే. శనివారం స్వదేశానికి చేరుకున్న రెండో బ్యాచ్ 235 మంది భారతీయులకు కేంద్ర విదేశాంగశాఖ సహాయ మంత్రి రాజ్‌కుమార్ రంజన్ సింగ్ స్వాగతం పలికారు. ఇజ్రాయెల్‌లో 18 వేల మంది భారతీయులు నివసిస్తున్నారు. 'ఆపరేషన్ అజయ్'లో భాగంగా రెండు విడతలు పూర్తయ్యాయి.

ప్రజా సంఘాలతో కలిసి జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న ఐప్సో నాయకులు

18 వరకు టెల్ అవీవ్‌కు ఎయిరిండియా సర్వీసులు బంద్

ఇజ్రాయెల్‌కు వెళ్లే విమాన సర్వీసులను ఎయిరిండియా తాత్కాలికంగా నిలిపేసిన విషయం తెలిసిందే. ఈ విమానాల రద్దును మరికొన్ని రోజులు పొడిగించారు. ప్రయాణికులు, సిబ్బంది భద్రత దృష్ట్యా ఢిల్లీ - టెల్ అవీవ్ మధ్య రాకపోకలు సాగించే విమానాలను ఈ నెల 18 వరకు నిలిపేస్తున్నట్లు ఎయిరిండియా అధికారి శనివారం వెల్లడించారు. అయితే, అవసరాన్ని బట్టి ఇజ్రాయెల్‌లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఛార్టెర్డ్ విమానాలను నడుపుతుందని ఆ అధికారి తెలిపారు.

పరస్పర ఆధారిత ప్రపంచంలో

ఏ అంశాన్నీ వేరుగా చూడలేం

- జి20 స్పీకర్ల సదస్సు ముగింపులో ఓం బిర్లా

న్యూఢిల్లీ : పరస్పర ఆధారిత ప్రపంచంలో ఏ సమస్యను, అంశాన్నీ వేరు చేసి చూడలేమని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. ఇక్కడ జరుగుతున్న జి20 పార్లమెంటరీ స్పీకర్ల సదస్సులో శనివారం ఆయన మాట్లాడారు. పశ్చిమాసియా ఘర్షణలు, ఇతర భౌగోళిక, రాజకీయ అంశాలను నేతలు ఈ సదస్సులో చర్చించారు. రెండు రోజుల పాటు జరిగిన చర్చలు శనివారంతో ముగిశాయి. చర్చల కోసం నిర్దేశించిన ఎజెండాను వీడి అనేక మంది సభ్యులు ప్రస్తుతం తలెత్తిన అంతర్జాతీయ పరిణామాలను చర్చించారు. ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న పలు సవాళ్ళను, ఆర్థికపరమైన అంశాలను వారు సుదీర్ఘంగా చర్చించారు. 'చాలామంది పశ్చిమాసియా ఘర్షణల గురించే మాట్లాడారు. కాగా కొంతమంది బహుళ వాదాన్ని బలోపేతం చేయడం గురించి చర్చించారు. అంతర్జాతీయ వాణిజ్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని, సరఫరా మార్గాలను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను వారు చర్చించారు' అని ఓం బిర్లా తన ముగింపు ప్రకటనలో పేర్కొన్నారు. 'ఈ ప్రస్తావనలన్నింటినీ అత్యంత జాగ్రత్తగా పరిశీలించాను. నేడు పరస్పరాధారిత ప్రపంచంలో, మనం ఏ ఒక్క అంశాన్ని విడిగా, దేనికదే చూడలేం.' అని బిర్లా వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ శాంతిని పెంపొందించేలా పార్లమెంటరీ దౌత్య పంథాను అనుసరించడం గురించి సదస్సులో ఆమోదించిన సంయుక్త ప్రకటనలో పేర్కొన్నట్లు స్పీకర్ తెలిపారు. సంఘర్షణలు, వివాదాల శాంతియుత పరిష్కారానికి తోడ్పాటునందించాలన్నారు. ఈ సంయుక్త ప్రకటన ఆమోదంతో జి-20 పార్లమెంటరీ స్పీకర్ల ప్రక్రియ మరింత బలోపేతమైందని బిర్లా పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, హరిత ఇంధనం, మహిళల నేతృత్వంలో అభివృద్ధి, డిజిటల్ ప్రభుత్వ మౌలిక సదుపాయాలపై మీ విలువైన ఆలోచనలు, సమాచారం మానవ సంక్షేమానికి హామీ కల్పించే జి-20 యంత్రాంగాన్ని బలోపేతం చేయడానికి ఉపయోగపడగలవని ఆశిస్తున్నట్లు చెప్పారు.

నాలుగు రోజుల్లో 11 కేసులు

- పాత్రికేయునిపై మంత్రి అనుచరుల వేధింపులు

భోపాల్ : దేశవ్యాప్తంగా స్వతంత్ర మీడియాలో పనిచేస్తున్న పాత్రికేయులపై అక్రమ కేసులు, దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఈ ధోరణి బాగా కన్పిస్తోంది. మధ్యప్రదేశ్‌లో 'దైనిక్ ఖులాసా' అనే పోర్టల్‌లో క్రైమ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్న జలామ్ సింగ్‌పై గత నెలలో 7-10 తేదీల మధ్య కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే పోలీసులు పదకొండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. గ్వాలియర్ డివిజన్‌లోని గునా, శివపురి జిల్లాల్లోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఈ కేసులు నమోదు చేశారు. ఇంతకీ సింగ్ చేసిన నేరమేమిటంటే ఆయన గత నెల 7వ తేదీన ఎవరి పేరునూ ప్రస్తావించకుండా ఓ వీడియోను, మెసేజ్‌ని పోస్ట్ చేశారు. తరచూ పార్టీలు మారుతున్న గౌరవనీయమైన వ్యక్తి వ్యవహారం బిజెపి అధిష్టానం దృష్టికి వచ్చిందని, దీంతో ఆయనకు టికెట్ గల్లంతయ్యే అవకాశం ఉన్నదని దాని సారాంశం. వీడియోలో సింగ్ ఎవరి పేరునూ ప్రస్తావించనప్పటికీ అది మధ్యప్రదేశ్ పంచాయత్ శాఖ సహాయ మంత్రి మహేంద్ర సింగ్ సిసోడియాను ఉద్దేశించి చేసినదేనంటూ ఆయన మద్దతుదారులు ఆగ్రహంతో ఊగిపోయారు. వేర్వేరు పోలీస్ స్టేషన్లలో సిసోడియాపై కేసులు పెట్టారు. సిసోడియా ప్రతిష్టకు జలామ్ సింగ్ భంగం కలిగిస్తున్నారని, డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు.

ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్ వర్గాల వైఫల్యమా?

- హమాస్ ముప్పును తేలిగ్గా తీసుకున్నారా?

జెరూసలేం : ఇజ్రాయిల్‌పై హమాస్ విస్మయ పరిచే రీతిలో జరిపిన మెరుపుదాడులు, ఇజ్రాయిల్ భీకర వైమానిక దాడులతో అతలాకుతలమవుతున్న పశ్చిమాసియా ప్రాంతం ఇప్పుడు పూర్తిస్థాయి యుద్ధంవైపు మళ్ళుతోంది. ఇప్పటికే ఇరువైపులా వేలాదిమంది మరణించారు. హమాస్‌దాడులను ఇజ్రాయిల్ ఊహించలేకపోయింది. దీనికి ఆ దేశ భద్రత, నిఘా సంస్థల వైఫల్యమే కారణమా? అన్న చర్చ మొదలైంది.

హమాస్ నుండి ఎదురయ్యే ప్రతిఘటనను ఇజ్రాయిల్ భద్రతా బలగాలు చాలా తక్కువగా అంచనా వేశాయని, వారు పరిస్థితులను సరిగ్గా అంచనా వేయలేదని, అదే ఈ పరిస్థితులకు దారి తీసిందనేది అర్థమవుతోంది. కోట్లాది డాలర్ల వ్యయంతో అత్యంత అధునాతనంగా కట్టిన గాజా సరిహద్దుగోడను హమాస్ తీవ్రవాదులు చాలా సులభంగా పగలగొట్టారు. హమాస్ వద్ద అత్యంత అధునాతనమైన ఆయుధాలేమీ లేవు. కేవలం చవకబారు డ్రోన్‌లు, బుల్డోజర్లు, బాంబులతోనే వారు సరిహద్దు భద్రతా దళ సిబ్బందిపై పైచేయి సాధించి, హింసకు పాల్పడి, పేరా గ్లైడర్లు, మోటార్ సైకిళ్ళపై బందీలను తీసుకెళ్ళారు. ఇదేమీ అప్పటికప్పుడు చేసిన ఆపరేషన్ అయితే కాదు, ఒకేసారి పలు ప్రాంతాలపై దాడులతో విరుచుకుపడి, ప్రజలను బందీలుగా చేపట్టారు. ఇలాంటి తరహాలో ఇంత పెద్ద ఎత్తున చేపట్టిన ఆపరేషన్‌కు ప్రధానంగా కావాల్సింది అత్యంత జాగరూకతతో కూడిన ప్రణాళిక, సమన్వయం, ప్రాక్టీస్, సమయం ఇవన్నీ అవసరమే.

ఈ మొత్తం వైఫల్యం వెనుక ప్రధానంగా కనిపిస్తున్నది ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్ వైఫల్యం, ముందు పొంచివున్న ముప్పును గుర్తించి హెచ్చరించడంలో విఫలమయ్యారా లేక ముప్పును అరికట్టేందుకు సరైన చర్యలు తీసుకోవడంలో విఫలయ్యారా అనే ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. ప్రధానంగా హమాస్ గత రెండేళ్ళుగా అనుసరిస్తున్న వ్యవహార శైలి కూడా ఒక కారణంగా కనిపిస్తోంది. హమాస్ వైపు నుండి పెద్దగా ఎలాంటి రెచ్చగొట్టే, కవ్వింపు చర్యలు లేకపోవడంతో ఇజ్రాయిల్ కూడా తేలిగ్గా తీసుకుంది. కానీ హమాస్ లోలోపలే తన ప్రణాళికలను పక్కాగా రూపొందించుకుంటూ అనువైన సమయం చూసుకుని ఒక్కసారిగా దాడికి తెగబడింది. అది కూడా ఇంటెలిజెన్స్ వర్గాల కన్నుకప్పేలా వ్యవహరించడంలో హమాస్ విజయం సాధించింది. ఇంత పెద్ద ఎత్తున సాగించిన సంక్లిష్టమైన ఆపరేషన్‌ను ప్రపంచంలోనే అత్యంత ఉత్తమ ఇంటెలిజెన్స్ సర్వీసుల్లో ఒకటైన మొస్సాద్ కన్నుగప్పి ఎలా చేయగలిగారో నిర్ధారించడం ఇక్కడ అవసరం. ఏదేమైనా ప్రస్తుత పరిస్థితులపై దృష్టి పెట్టడం ఇప్పుడు తక్షణ అవసరం. యుద్ధాన్ని ముగించి, శాంతి, భద్రతలను నెలకొల్పడం తక్షణావశ్యకత. అదే సమయంలో ఇంతటి ఆకస్మికదాడి ఎలా జరిగింది, దానికి గల కారణాలను కూలంకషంగా విచారించడానికి కూడా ఇది సరైన సమయమే. మరింత భద్రతతో కూడిన భవిష్యత్తును ప్రజలకు అందించాలంటే ఏం జరిగిందీ, ఎలా జరిగిందీ అన్నది దర్యాప్తు చేపట్టాల్సిందే.

హిమాలయాలను వేడెక్కిస్తున్న ఏరోసోల్స్ !

న్యూఢిల్లీ : చల్లగా వుండాల్సిన హిమాలయాల్లో వాతావరణాన్ని వేడెక్కించడంలో ఏరోసోల్స్ (పొగ, పొగమంచు, దుమ్ము, ధూళి వంటివి) గణనీయమైన పాత్ర పోషిస్తున్నాయని పరిశోధకులు పేర్కొంటున్నారు. అలాగే హిమనదాలు కరిగిపోవడాన్ని వేగవంతం చేయడంలో కూడా ఇవి ముఖ్య పాత్రే పోషిస్తున్నాయి. హిందూ కుష్-హిమాలయ-టిబెటన్ పీఠభూమి (హెచ్‌కెహెచ్‌టిపి) ప్రాంతంలో ఘనీభవించే పద్ధతుల్లో మార్పులకు కూడా ఇవి కారణమవుతున్నాయి. మొత్తంగా ఈ ప్రాంతంలో దిగువ వాతావరణం పూర్తిగా వేడెక్కడానికి సగానికి పైగా ఏరోసోల్స్ కారణం కాగా, మిగిలిన భాగం కాలుష్య కారక వాయువుల వల్ల వేడెక్కుతోందని అహ్మదాబాద్ ఫిజికల్ రీసెర్చ్ లేబరేటరీ, జర్మనీలోని లీప్జిగ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకుల బృందం సంయుక్తంగా జరిపిన అధ్యయనంలో వెల్లడైంది. ఈ ప్రాంతంలో వాతావరణ మార్పుల వెనుక ప్రధానమైన అంశంగా ఏరోసోల్స్ వున్నాయని అధ్యయనం పేర్కొంది. ఇండో-గాంగ్‌టిక్ ప్లెయిన్ (ఐజిపి)-భారతదేశంలోని గంగానదీ పరీవాహక ప్రాంతాలు (భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్‌లో పలు ప్రాంతాలు ఇందులోకే వస్తాయి. దక్షిణాసియా ప్రాంతంలో జనసాంద్రత కలిగి, పారిశ్రామికీకరణ చెందిన ప్రాంతాలు ఇందులో వున్నాయి), హిమాలయ పర్వత సానువులు, టిబెట్ పీఠభూమి ప్రాంతాల్లో పలుచోట్ల ఏరోసోల్స్ ఘనీభవనలు, దానివల్ల పుట్టిన వేడిమిని గుర్తించినట్లు పరిశోధకులు తెలిపారు. 'ఇవన్నీ, అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన అత్యంత సున్నితమైన పర్యావరణ వ్యవస్థలు కలిగిన ప్రాంతాలు. అదే సమయంలో అత్యంత తీవ్రమైన ముప్పును కలిగించే జనాభా కలిగిన ప్రాంతాలు, వీటిపై అధ్యయనం కూడా చాలా తక్కువగా జరిగింది' అని వారు తమ అధ్యయన పత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుతమున్న వాతావరణ నమూనాలు ఏరోసోల్స్ కారక వేడిమిని, హెచ్‌కెహెచ్‌టిపి ప్రాంతంలో వార్మింగ్ పరిస్థితులను గణనీయంగా తక్కువ అంచనా వేస్తున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఏరోసోల్ లక్షణాలకు సంబంధించి మరింత వాస్తవిక ప్రాతినిధ్యం కోసం పరిశోధకులు పిలుపిచ్చారు. సైన్స్ ఆఫ్ ది టోటల్ ఎన్విరాన్‌మెంట్ జర్నల్‌లో ఈ అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి.

హమాస్ కీలక కమాండర్ మృతి

- ఐడిఎఫ్ ప్రకటన

ఇజ్రాయెల్ : ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో హమాస్ కీలక కమాండర్ ఒకరు మరణించినట్లు ఐడిఎఫ్ చెప్పినట్లు టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ పత్రిక వెల్లడించింది. అయితే దీన్ని హమాస్ ధ్రువీకరించలేదు. ఇజ్రాయెల్-హమాస్ మధ్య భీకర పోరు నెలకొన్న నేపథ్యంలో ... నిన్న (శుక్రవారం) ఇజ్రాయెల్ బలగాలు గాజా భూభాగంలో ప్రవేశించాయి. గాజాలోని హమాస్ నెట్‌వర్క్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా హమాస్ ఏరియల్ ఆపరేషన్లు నిర్వహించే విభాగం హెడ్‌క్వార్టర్స్‌పై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలతో దాడి చేసింది. ఈ ఘటనలో హమాస్ ఏరియల్ ఫోర్స్ హెడ్ అబు మురద్ మతి చెందారని ఐడిఎఫ్ చెప్పినట్లు టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ పత్రిక కథనంలో వెల్లడించింది.

ఇజ్రాయెల్‌కు వంత పాడిన అమెరికా

వాషింగ్టన్ : యుద్ధోన్మాద అమెరికా ఇజ్రాయిల్‌కు మరోమారు వంత పాడింది. హమస్‌ను అల్‌ఖైదాతో పోల్చిచూపుతూ అమెరికా అధ్యక్షులు జో బైడెన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'వీళ్ల (హమస్) చాలా దుర్మార్గులు. అల్‌ఖైదా ముష్కరుల్లాగే ప్రవర్తిస్తున్నారు. ముందు నుంచీ చెబుతున్నట్లుగా ఇజ్రాయెల్‌కు అమెరికా అండగా ఉంటుంది. ఈ వైఖరిలో ఎటువంటి మార్పు ఉండబోదు' అని జో బైడెన్ అన్నారు. హమాస్ దాడులతో పాలస్తీనా పౌరులకు ఎలాంటి సంబంధం లేదన్న వాస్తవాన్ని కూడా గుర్తించాలని బైడెన్ చెప్పుకొచ్చారు.

మహ్మద్ సలీమ్‌కు చెక్కు అందచేస్తున్న రవీంద్రకుమార్ నాథ్

జీవిత పర్యంతం దాచుకున్న సొమ్ము మొత్తం పార్టీకే

- శతాధిక వయోధికుని సమున్నత ఆదర్శం

కొలకతా : జీవితకాలంలో తాను పొదుపు చేసుకున్న మొత్తం సొమ్మును ఒక శతాధిక వయోధకుడు మార్క్సిస్టు పార్టీకి అందజేసి సమున్నతమైన ఆదర్శనీయతను చాటారు. ఆయన పేరు కామ్రేడ్ రవీంద్ర కుమార్ నాథ్. వయస్సు అక్షరాలా నూటారెండేళ్లు. ఇంతటి సంపూర్ణవంతమైన జీవిత చరమాంకంలోనూ ఆయన శ్లాఘనీయమైన కృషి చేశారు. జీవిత పర్యంతం తాను దాచుకున్న సొమ్మును సిపిఎం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీకి అందజేసి మార్క్సిస్టు పార్టీ పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇందుకు సంబంధించిన చెక్‌ను సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు మహ్మద్ సలీంకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి సృజన్ భట్టాచార్య, తదితర నాయకుల సమక్షంలో రవీంద్ర అందజేశారు. ఇలాంటి ఆదర్శప్రాయమైన ప్రోత్సహకాలు పార్టీని మరింత బలోపేతం చేస్తాయని ఈ సందర్భంగా సలీం పేర్కొన్నారు. రవీంద్రకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయవ్యవస్థే ఆశా కిరణం

- ఒరిస్సా హైకోర్ట్ మాజీ సిజె మురళీధరన్

తిరువనంతపురం : సమాజంలో అణచివేతలు జరుగుతుంటే న్యాయవ్యవస్థే ఆశాకిరణమవుతుందని ఒరిస్సా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎస్. మురళీధరన్ వ్యాఖ్యానించారు. భారత్ వంటి దేశంలో స్వతంత్ర, నిష్పాక్షిక న్యాయవ్యవస్థ అవసరముందని ఆయన నొక్కి చెప్పారు. 'న్యాయవ్యవస్థ స్వతంత్రత' అనే అంశంపై కేరళ హైకోర్టు ఆడిటోరియంలో ఆయన ప్రసంగిస్తూ రాష్ట్రంలోని వివిధ విభాగాలపై ఆధిపత్యం చెలాయించాలని ప్రభుత్వాలు చూస్తుంటాయని, ఈ ధోరణికి అడ్డుకట్ట వేయాలంటే అణగారిన వర్గాలు, అసమ్మతివాదులు, మైనారిటీలకు మద్దతుగా నిలిచే సామర్థ్యమున్న బలమైన, స్వతంత్ర న్యాయవ్యవస్థ అవసరమని తెలిపారు. బలహీనులకు రక్షణగా నిలవడంలో, మెజారిటీ వర్గాల దుందుడుకు చర్యలను నిలువరించడంలో న్యాయవ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని మురళీధరన్ చెప్పారు. బలహీనులను కాపాడాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థపై ఉందని తెలిపారు. న్యాయవ్యవస్థ సరిగా పనిచేయాలంటే నిర్భయంగా, నిష్పాక్షికంగా వ్యవహరించాల్సి ఉంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హద్దులు మీరితే దానికి అడ్డుకట్ట వేయడానికి నిష్పాక్షిక, స్వతంత్ర న్యాయవ్యవస్థ ఉండాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి విశేషాధికారాలు ఉంటే వాటికి రాజ్యాంగమే అడ్డుగా నిలుస్తుందని తెలిపారు. కోర్టు ఆదేశాలను ధిక్కరించడం న్యాయవ్యవస్థ చట్టబద్ధతను సవాలు చేయడమే అవుతుందని చెప్పారు. ఈడీ పదవీకాలం పొడిగింపును ఇందుకు ఉదాహరణగా చూపారు. ఢిల్లీ హైకోర్టులో విచారణలో ఉన్న న్యూస్‌క్లిక్ కేసు విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని మురళీధరన్ ప్రస్తావించారు. మనీ లాండరింగ్ చట్టం కింద అరెస్టు చేసే ముందు లిఖితపూర్వకంగా కారణాలు తెలియజేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాల్సిందిగా కోరుతూ ప్రభుత్వం పిటిషన్ వేయాలని చూస్తోందని చెప్పారు. న్యాయపరమైన నియామకాలలో ప్రభుత్వం మితిమీరి జోక్యం చేసుకుంటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొలీజియం సిఫార్సుల అమలులో ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తోందని తెలిపారు. కొలీజియం వ్యవస్థలో మరింత పారదర్శకత అవసరమని మురళీధరన్ అభిప్రాయపడ్డారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గఫూర్

ఎగువభద్రతో 'సీమ' ఎడారే

- నవంబర్ నుంచి బస్సు యాత్రలు
- బటన్ నొక్కుడుతో సర్వతోముఖాభివృద్ధి అసాధ్యం
- టిడిపికి ప్రత్యామ్నాయ ప్రణాళిక లేదు : ఎంఎ గఫూర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కర్ణాటకలో ఎగువభద్ర ప్రాజెక్టు నిర్మిస్తే రాయలసీమ ఎడారిగా మారుతుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ ఆందోళన వ్యక్తం చేశారు. కడప నగరంలోని స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కృష్ణా జలాల పంపిణీ వ్యవహారాన్ని ట్రిబ్యునల్‌కు అప్పగించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. కర్ణాటక రాష్ట్రానికి రూ.ఆరు వేల కోట్లను ఇచ్చి ఎగువభద్ర ప్రాజెక్టు నిర్మించడాన్ని ప్రోత్సహిస్తోందని, ఇటువంటి వికృత ధోరణులతో రాష్ట్రాల మధ్య తగువు సృష్టిస్తోందన్నారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల ప్యాకేజీ ఇవ్వని బిజెపికి భజన ఎందుకు చేస్తున్నారని అధికార, ప్రతిపక్ష పార్టీలను నిలదీశారు. వైసిపి పాలనలో రాష్ట్ర అభివృద్ధి నిర్లక్ష్యానికి గురవుతోందన్నారు. బటన్ నొక్కుడుతో సర్వతోముఖాభివృద్ధి అసాధ్యమని తెలిపారు. ప్రాజెక్టులు, పరిశ్రమల స్థాపన, ఉపాధి హామీల ద్వారానే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ప్రతిపక్ష టిడిపికి ప్రత్యామ్నాయ ప్రణాళిక లేదని విమర్శించారు. విశాఖ ఉక్కుపై చంద్రబాబు, పవన్ మాట్లాడడం లేదని, ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బస్సు యాత్రలు, ఉద్యమ యాత్రలను సిపిఎం చేపడుతోందన్నారు. నవంబర్‌లో విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, దీనికి జాతీయ నాయకత్వం హాజరు కానుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, నిరసన, ధర్నాలకు అవకాశం లేకుండా పోయిందని, ధర్నాలు, నిరసనలంటేనే ముఖ్యమంత్రి జగన్‌కు వణుకు పుడుతోందన్నారు. ఇటువంటి నియంతృత్వ ధోరణులతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనార్హత కోల్పోయారని విమర్శించారు. ప్రత్యామ్నాయ ప్రణాళికలతో ప్రజల్లోకి వెళ్తున్నామని తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, ఐ.ఎన్.సుబ్బమ్మ, రామమోహన్ పాల్గొన్నారు.

ICICI Home Finance

కార్పోరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి టవర్, అందేరి -కుర్లా రోడ్, అందేరి (ఈస్ట్), ముంబాయి-400059, ఇండియా

శాఖ కార్యాలయం: సుప్రియ టవర్స్, అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్, డో.నం.5-37-155, 4/15 బ్రాడీపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002

[రూల్ 8(6)కు నిబంధన చూచుట]

స్థిరాస్తుల విక్రయం కొరకు నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నిబంధనతో చదువుతూ ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఇ-వేలం విక్రయం నోటీసు.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు దిగువ వివరించిన తనాఖపెట్టిన/చార్జ్‌చేసిన స్థిరాస్తిని, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకొని "ఏది ఎక్కడ ఉందో", "ఆ పద్ధతిన" మరియు "ఏదిఏమైనా ఆవిధంగా" విక్రయించబడునని సాధారణ ప్రజానీకం మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇక్కడ నోటీసు ఇవ్వడమైనది, సంక్షిప్త వివరాల ప్రకారం దిగువ ఇవ్వబడినాయి;

క్ర. సం	రుణగ్రహీత(లు)/సహా రుణగ్రహీతలు/ హామీదారులు/చట్టబద్ధ వారసులు. లోను ఖాతా నం.	తెలిసిన రుణభారాలతో సెక్యూర్డ్ అస్సెట్(ల) వివరాలు, ఏవైనా	మొత్తం బకాయిలు	రిజర్వ్ ధర / బయానా మొత్తం	ఆస్తి తనిఖీ తేది మరియు సమయం	వేలం తేది & సమయం
(A)	(B)	(C)	(D)	(E)	(F)	(G)
1.	ఇపనగండ్లా వెంకట పద్మా (రుణగ్రహీత), ఇపనగండ్లా బాల సైదులు (సహ రుణగ్రహీత) లోను ఖాతా నం.: LHGTR00001392465 & LHGTR00001379605	ఫ్లాట్ నం.123, గ్రౌండ్ ఫ్లోర్, ఇ-బ్లాక్, "జన చైతన్య హ్యాపీ హోమ్స్" పెదపలకలూరు రోడ్డు, రత్నగిరి నగర్ ఏరియా, గుంటూరు	Rs. 31,19,057/- October 07, 2023	Rs. 24,19,131/- / Rs. 2,41,920/-	October 16, 2023 11:00 AM-03:00 PM	October 31, 2023 02:00 PM-03:00 PM

మా వేలం ఏజెన్సీ గ్లోబెటెక్ వెబ్‌సైట్ (URL Link-https://BestAuctionDeal.com) మీద ఆన్‌లైన్ వేలం నిర్వహించబడును. అక్టోబర్ 30, 2023న సా.5.00 గం.లలోపు వరకు తదుపరి వడ్డీతో మొత్తం బకాయిలు చెల్లించుటకు తనాఖదారులు/నోటీసు ఇవ్వడమైనది లేకపోతే ఈ సెక్యూర్డ్ అస్సెట్స్ పైన షెడ్యూల్ ప్రకారం విక్రయించబడును.

కాగోరు బిడ్డర్(లు) బయానా (ఇఎండి) ఆర్‌టిజిఎస్/డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) (కాలమ్ ఇ చూచుట) ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, సుప్రియ టవర్స్, అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్, డో.నం.5-37-155, 4/15 బ్రాడీపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002 లేదా అక్టోబర్ 30, 2023న సా.04:00 గం.లలోపు దాఖలు చేయాలి. దయచేసి గమనించండి, కాగోరు బిడ్డర్(లు) ఒకవేళ పైన పేర్కొన్న సమయం ప్రకారం వారి ఆఫర్ దాఖలు చేయనట్లయితే అప్పుడు టెండర్ డాక్యుమెంట్‌ల యొక్క సంతకంచేసిన కాపీ ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, సుప్రియ టవర్స్, అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్, డో.నం.5-37-155, 4/15 బ్రాడీపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002 లేదా అక్టోబర్ 30, 2023న సా.05:00 గం.లలోపు దాఖలు చేయాలి. బయానా డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) "ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్-ఆక్షన్" పేరిట ఏదైనా జాతీయ/షెడ్యూల్డ్ బ్యాంక్ నుండి గుంటూరు వద్ద చెల్లించాలి.

తనిఖీకి సంబంధించిన ఏదైనా తదుపరి వివరణలకు, వేలం నియమాలు మరియు షరతులు లేదా టెండర్ల దాఖలు, 7021072869 మీద ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌ను లేదా మా సేల్స్ అండ్ మార్కెటింగ్ పాట్నర్ నెక్సెన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను దయచేసి సంప్రదించండి.

అధీకృత అధికారి ఎలాంటి కారణం చూపకుండా అన్ని బిడ్‌లు లేదా ఏదైనా తిరస్కారం చేసే హక్కు కలదు. విక్రయం వివరాణత్మక నియమాలు మరియు షరతులు, https://www.icicihfc.com/ దయచేసి చూడండ..

తేది: అక్టోబర్ 15, 2023
ప్రదేశం: గుంటూరు

అధీకృత అధికారి
ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

మీకోసం

వాడిన టీపొడిని మరొకసారి నీటిలో మరిగించి, ఆ నీటితో అద్దాలు, గాజు పాత్రలు తుడిస్తే అవి బాగా మెరుస్తాయి.

జీవన సౌరభం

మంచిని ప్రోత్సహించడమే కాదు, చెడును కూడా నిరోధించినప్పుడే సమాజంలో మార్పు సాధ్యం.

తపాలా వారోత్సవం

పిల్లలూ, మన దేశంలో ప్రతి ఏడాది అక్టోబరు 9 నుండి 15 వరకు పోస్టాఫీసు వారాత్సోవాలు నిర్వహించుకుంటాం. మరి ఈ రోజు ఆ విశేషాలు తెలుసుకుందామా!

శాస్త్ర, సాంకేతికతను అందిపుచ్చుకున్న ఈ ఆధునిక సమాజంలో ప్రపంచంలో ఏ మూల ఏం జరుగుతుందో.. క్షణాల్లో తెలిసిపోతోంది. మీడియా, సోషల్ మీడియా ద్వారా మారుమూల ప్రాంతాలకు కూడా వార్తలు చేరిపోతున్నాయి. వాట్సాప్, ట్విట్టర్, ఫేస్ బుక్, ఇన్ స్టా లాంటి యాప్‌లతో ప్రపంచంలో ఏ మూల ఉన్న వ్యక్తితో అయినా నేరుగా మాట్లాడేస్తున్నాం. అయితే కొన్ని సంవత్సరాల క్రితం ప్రతి ఒక్కరికీ తపాలానే కమ్యూనికేషన్ సాధనం. మనుషులు దూరంగా ఉన్నా తమ బంధాన్ని, అనుబంధాన్ని ఒక ఉత్తరం ద్వారా కొనసాగించేవారు. మనీ ఆర్డర్ లాంటి సేవలతో ఎందరికో ఆర్థిక అవసరాలను సైతం తీర్చింది మన పోస్టాఫీసు.

1874వ సంవత్సరంలో అక్టోబర్ 9వ తేదీన యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (యుపిఎన్) మొట్టమొదటిసారిగా ఏర్పడింది. జపాన్ రాజధాని టోక్యోలో 1969 సంవత్సరంలో యూపిఎన్ మొదటి సమావేశం జరిగింది. ప్రపంచంలో నలుమూలలకు, ప్రపంచంలోని చివరి వ్యక్తికి కూడా పోస్ట్ కార్డులు చేరాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఆ ఏడాదే అక్టోబర్ 9వ తేదీన తొలిసారిగా ప్రపంచ తపాలా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ ప్రతిపాదనను భారతదేశం నుండి ఆనంద్ నరులా ఆమోదించారు. అప్పటినుండి ప్రతి సంవత్సరం మన దేశంలో కూడా ప్రపంచ తపాలా దినోత్సవం జరుపుకుంటున్నారు.

ప్రపంచ దేశాలలో సమాచార వ్యవస్థగా నిలిచిన తపాలా శాఖ సేవలు ఈ తరం వారికి అంతగా తెలియకపోవచ్చు. కానీ కొన్ని కోట్ల మంది తమ ఉత్తరాల ద్వారా కోట్ల మంది వ్యక్తులను ప్రభావితం చేసేవారు. అలాంటి వారి గొప్ప సేవల్ని స్మరించుకుంటూ వారి పేరిట పోస్టల్ స్టాంపులను పోస్టల్ శాఖ విడుదల చేస్తుంది. ప్రతి సంవత్సరం వరల్డ్ పోస్ట్ డే సందర్భంగా ఒక థీమ్ అనుకుంటారు. వారం రోజుల పాటు తపాలా వారోత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పోస్టల్ ఉత్పత్తులు, సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే కార్యక్రమాలు రూపొందిస్తారు.

ఒకప్పుడు ప్రపంచంలోని తపాలా శాఖలన్నింటిలో లక్షన్నరకు పైగా తపాలా కార్యాలయాలు మన దేశంలోనే ఉన్నాయి. వీటిలో దాదాపు 89 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. అయితే స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం 23 వేల లోపే ఉన్నాయి.

నేను గీసిన బొమ్మ



బోయిని సాత్విక,
7వ తరగతి,
జక్కాపూర్,
సిద్ధిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పేదలకు సేవలోనే సార్థకత

రోజు రోజుకూ మానవతా విలువలు, బంధాలు, బంధుత్వాలు కనుమరుగవుతున్న వేళ ఆపన్నులకు 'నేనున్నా..' అంటూ ఆయన దాతృత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. అనుకోని దురదృష్టకరమైన సంఘటనలో తన కుమార్తె మృత్యువాత పడటంతో దాని నుంచి ఆయన తేరుకోలేకపోయారు. ఆ తర్వాత కుమార్తె శ్రీదేవి జ్ఞాపకార్థంగా మెమోరియల్ చారిటబుల్‌ట్రస్ట్‌ను ఏర్పాటుచేసి అప్పటి నుంచి తనకున్న దాంట్లో అడిగిన వారికి లేదనకుండా సాయం చేయటంలో ముందుటున్నారు. ఆయన ఏ ప్రాంతానికి చెందిన వారు? ఎలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారో తెలుసుకుందాం.

పశ్చిమగోదావరి జిల్లా కాళ్ళ మండలం కాళ్ళకూరు గ్రామంలో రైతు కుటుంబంలో దాట్ల రామకృష్ణంరాజు- వరలక్ష్మి దంపతులకు రెండో సంతానంగా 1971లో దాట్ల వెంకటరామరాజు జన్మించారు. ఆయన తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ కుటుంబ జీవనాన్ని గడిపేవారు. వెంకట రామరాజు కూడా వ్యవసాయంలో సహకారం అందించే వారు. చిన్ననాటి నుంచే తనకు వ్యవసాయం, సమాజం పట్ల ఆసక్తి మెండుగా ఉండేది. ఆయన పదో తరగతి వరకు చదువుకున్నారు. ప్రకృతివైపరీత్యాలతో చేస్తున్న వ్యవసాయం, ఆక్వా సాగులో నష్టాలు రావటంతో పీకల్లోతు కష్టాల్లోకి కూరుకుపోయారు. అనంతరం స్వగ్రామం కాళ్ళకూరు గ్రామం నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు కంపెనీలో ల్యాబ్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరారు. సుమారు 20 సంవత్సరాలు అక్కడ పని చేశారు. అనంతరం ఆ తర్వాత విష్ణు ప్రియా సొల్యూషన్ ట్రేడింగ్ కంపెనీ ఏర్పాటుచేసి వ్యాపార రీత్యా హైదరాబాద్ కూకట్‌పల్లిలో స్థిరపడ్డారు. హైదరాబాద్, విశాఖపట్టణం, బెంగుళూరు పట్టణాల్లో బ్రాంచిలు ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో తనవంతుగా చేసిన కృషి, సిబ్బంది అంకితభావంతో ఉన్నత స్థితికి ఎదిగారు. వెంకటరామరాజుకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహమైంది. చిన్నకుమార్తె దాట్ల శ్రీదేవి ఆకస్మికంగా మృతి చెందారు.

తల్లి అంత్యక్రియలకు జాగా లేక ఇబ్బందులు

వెంకటరామరాజు తల్లి వరలక్ష్మి అనారోగ్యంతో 2019లో మృతి చెందారు. అంత్యక్రియల కోసం గ్రామంలోని మోక్షధామం (శ్మశానవాటిక)కు చేరుకున్నారు. అదే రోజు జోరు వర్షంతో మోక్షధామం లోతట్టుగా ఉండడంతో వర్షపు నీటితో మునిగిపోయింది. దహనం చేయడానికి అనేక అవస్థలు పడాల్సి వచ్చింది. గ్రామంలో ఎంతోమంది ఉన్నత స్థితిలో ఉన్నా మోక్షధామం పరిస్థితికి ఎవ్వరూ స్పందించకపోవటం చూసి రామరాజు మనసును బాధించింది. ఆ క్షణంలోనే దానిని అభివృద్ధి చేయాలనే ఆలోచన వచ్చింది.

దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్‌తో సేవలు

రెండో కుమార్తె దాట్ల శ్రీదేవి 2021 ఫిబ్రవరిలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా అపార్ట్మెంట్‌పై దుస్తులు తీగపై వేస్తుండగా కాలు జారిపోయి కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. ఏప్రిల్‌లో ట్రస్ట్ ఏర్పాటుచేయగా మే నెల నుంచి సేవలు ప్రారంభమయ్యాయి. వ్యాపార రీత్యా ఆయన హైదరాబాద్‌లో ఉంటున్నా అప్పటి నుంచి ప్రతి నెలా పుట్టిన గ్రామంలో ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పిల్లలు ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం, వృద్ధులు, అనాథలు, అభాగ్యుల కోసం దుస్తులు, సామాగ్రి పంపిణీ, అన్నదానం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. గ్రామంలో వివిధ అభివద్ధి పనుల నిమిత్తం సుమారు రూ.70 లక్షలు వరకూ ఆర్థిక సహాయంగా అందజేశారు. పేద కుటుంబంలో ఎవరింట్లో వివాహం జరిగినా రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నారు. వికలాంగులకు వీల్ చైర్లు వంటివి అందజేస్తున్నారు.

రేవులు, శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు

శ్మశాన వాటిక అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను ట్రస్ట్ ద్వారా కల్పించారు. నాలుగు దహన గదుల షెడ్లు, రెండు రేవులు, మూడు వైపులా ఇనుప వైరుతో ఫెన్సింగ్, ఆహ్లాదాన్ని ఇచ్చేలా మొక్కలను కూడా నాటారు. వాటన్నింటినీ ఏర్పాటు చేసేందుకు ట్రస్టు ద్వారా సుమారు రూ 30 లక్షలు వ్యయం చేశారు. క్రిస్టియన్ పేటకు వెళ్లే ప్రధాన రహదారిలో కల్వర్టు. వంతెన అభివృద్ధి పనులు రూ 4లక్షలుతో చేపట్టారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు, పేద ప్రజల దహన సంస్కారాలకు, వివాహానికి, కంటి ఆపరేషన్లకు ఆర్థికసాయాన్ని అందిస్తూనే ఉన్నారు. గ్రామంలో రోడ్ల వెంబడి 150 సిమెంట్ బల్లలను కూర్చునేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్, వివిధ పండుగల సమయంలో అన్ని తరగతుల ప్రజల కోసం అన్నదానం ఏర్పాటుచేయిస్తున్నారు. ఏటేటా మే,జూన్ నెలల్లో వేసవిలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు.

సేవలకు డాక్టరేట్‌తో గుర్తింపు

గ్రామంలోని వెంకటేశ్వర పద్మావతి మంచినీటి చెరువు అభివృద్ధికి నోచుకోలేదు. రేవులు కూడా శిథిలావస్థకు చేరాయి. 25 ఏళ్ల తర్వాత సుమారు రూ.13 లక్షలతో చెరువులో పూడికలు తీయించారు. మూడు రేవులు, రిటైనింగ్ వాల్ నిర్మించిన నిర్మాణ పనులను డిసిసిబి అధ్యక్షులు పి.వి.ఎల్. నరసింహరాజు ప్రారంభించారు. అనంతరం ట్రస్ట్ ఛైర్మన్ దాట్ల వెంకటరామరాజును ఆయన సత్కరించారు. బెంగుళూరుకు చెందిన ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్శిటీ 2023 ఏప్రిల్‌లో గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేసింది.

-గొట్టేటి శ్రీనివాసులు
9397139966, ప్రజాశక్తి కాళ్ళ విలేకరి, పశ్చిమ గోదావరి జిల్లా.

భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు

సమాజంలో నేటికీ ఇంకా పేదరికం కొనసాగుతూనే ఉంది. ఎవరో ఏదో ఇస్తారని..చేస్తారని అనుకోకుండా నా వంతు బాధ్యతగా నాకున్న దానిలో ఎంతో సేవచేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నా. సంపాదనలో కొంతమేరకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఎంతో మానసిక సంతృప్తినిస్తుంది. నేటి తరంలో తండ్రీకుమార్తెల మధ్య ప్రేమానురాగాలు తగ్గిపోతుండటం బాధేస్తుంది. నా కుమార్తె శ్రీదేవి చనిపోవటం చాలా బాధేసింది. ఆమె జ్ఞాపకార్థంగా ఇంకా చాలా కార్యక్రమాలు నిర్వహిస్తాను. ఇప్పటివరకు రూ.70 లక్షలతో గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాను. వివిధ పండుగలకు అన్న దానం చేయడం, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, కంటి వైద్యం కోసం ఆర్థిక సాయం చేస్తున్నాను. ప్రతి సంక్రాంతి పండుగ సందర్భంగా 50 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తూ వస్తున్నాను.

-దాట్ల వెంకటరామరాజు
శ్రీదేవి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, కాళ్లకూరు

దుమ్మురేపిన టీమిండియా

- నిప్పులు చెరిగిన బుమ్రా
- వన్డే ప్రపంచకప్‌లో పాక్‌పై భారత్‌కు 8-0 ఆధిక్యత

అహ్మదాబాద్: ఐసిసి వన్డే ప్రపంచ కప్‌లో భారతజట్టు జైత్రయాత్ర కొనసాగు తోంది. నరేంద్ర మోడీ స్టేడియంలో పాకిస్తాన్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ జట్టు ఘన విజయం సాధించింది. పాకిస్తాన్ నిర్దేశించిన 192పరుగుల లక్ష్యా న్ని భారత్ కేవలం 3వికెట్లు కోల్పోయి 30.3ఓవర్లలోనే ఛేదించింది. దీంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఎగబాకింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ తొలి వికెట్‌కు అబ్దుల్లా-ఇమామ్ కలిసి 41 పరుగులు జోడించారు. ఈ జోడీని సిరాజ్ విడగొట్టాడు. ఆ తర్వాత కాసేపటికి ఇమామ్‌ను అద్భుత బంతికి హార్దిక్ బోల్తా కొట్టించాడు. ఆ తర్వాత పాక్ కెప్టెన్ బాబర్ అజామ్-రిజ్వాన్ క్రీజ్‌లో నిలదొక్కుకుని మూడో వికెట్‌కు 82 పరుగులు జోడించారు. దీంతో పాక్ జట్టు 29 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 150 పరుగులతో ప్రమాదకరంగా మారుతున్న దశలో హైదరాబాద్ పేజర్ మహ్మద్ సిరాజ్ మరోసారి దెబ్బతీశాడు. అర్ధశతకం పూర్తిచేసుకున్న బాబర్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత రిజ్వాన్(49)ను బుమ్రా అద్భుత బంతికి బౌల్డ్ చేయడంతో మ్యాచ్ స్వరూపం మారిపోయింది. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్‌ను భారత బౌలర్లు క్రీజ్‌లో కుదురు కునేందుకు అవకాశమివ్వలేదు. సౌద్ షకీల్ (6), ఇఫ్తికార్ అహ్మద్(4), షాదాబ్ ఖాన్(2), నవాజ్(4), రవూఫ్(2) సింగిల్ డిజిట్‌కే పరిమి తం చేశారు. ముఖ్యంగా బుమ్రా 7ఓవర్లలో కేవలం 17పరుగులిచ్చి రిజ్వాన్, షాదాబ్‌లను ఔట్‌చేసి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. బుమ్రా, సిరాజ్, కుల్‌దీప్ యాదవ్, హార్దిక్, జడేజా తలా రెండేసి వికెట్లు తీసారు.

36పరుగులకు 8వికెట్లు..

పాకిస్తాన్ 29.4 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 155పరుగులు చేసి పటిష్ఠంగా ఉన్న దశలో బాబర్ అజామ్, రిజ్వాన్ వెంటనే ఔటయ్యారు. ఆ తర్వాత ఒకే ఓవర్‌లో షకీల్, ఇఫ్తికార్ ఔట్ కావడంతో పాకిస్తాన్ కేవలం ఐదు ఓవర్ల వ్యవధిలో ఐదు వికెట్లను కష్టాల్లో పడింది. ఆ తర్వాత మహ్మద్ నవాజ్(4), హసన్ అలీ(12), హారిస్ రవూఫ్(2) కూడా పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. దీంతో పాకిస్తాన్ కేవలం 36 పరుగుల వ్యవధిలో చివరి ఎనిమిది వికెట్లను చేజార్చు కొని 42.5 ఓవర్లలో 191 పరుగులకే ఆలౌటైంది. .

ఛేదనలో టీమిండియా తొలుత గిల్ (16), కోహ్లీ (16) వికెట్లను త్వరగా కోల్పోయింది. రోహిత్(86) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌కి తోడు శ్రేయస్ అయ్యర్(53నాటౌట్) నిలకడగా ఆడారు. రోహిత్ ఔటయ్యాక కెఎల్ రాహుల్ (19నాటౌట్)తో శ్రేయస్ మ్యాచ్ ముగించాడు. షహీన్ అఫ్రిదికి రెండు, హసన్ అలీకి ఒక వికెట్ దక్కాయి. దీంతో వన్డే ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌పై భారత్‌కు ఇది 8వ విజయం. భారత్ 19న బంగ్లాదేశ్‌తో ఆడనుంది.

వన్డే ప్రపంచకప్‌లో నేడు

ఇంగ్లండ్ × ఆఫ్ఘనిస్తాన్ (వేదిక: ఢిల్లీ; మ.2.00గం॥లకు)

స్కోర్‌బోర్డు..

పాకిస్తాన్ ఇన్నింగ్స్: అబ్దుల్లా షఫీక్ (ఎల్‌బి)సిరాజ్ 20, ఇమామ్-ఉల్-హక్ (సి)రాహుల్ (బి)హార్దిక్ 36, బాబర్ అజమ్ (బి)సిరాజ్ 50, రిజ్వాన్ (బి)బుమ్రా 49, షౌద్ షకీల్ (ఎల్‌బి)కుల్దీప్ 6, ఇఫ్తికార్ అహ్మద్ (బి)కుల్దీప్ 4, షాదాబ్ (బి)బుమ్రా 2, నవాజ్ (సి)బుమ్రా (బి)హార్దిక్ 4, హసన్ అలీ (సి)శుభ్‌మన్ (బి)జడేజా 12, షాహిన్ షా (నాటౌట్) 2, హరీస్ రవూఫ్ (ఎల్‌బి)జడేజా 2, అదనం 4. (42.5ఓవర్లలో ఆలౌట్) 191పరుగులు. **వికెట్ల పతనం:** 1/41, 2/73, 3/155, 4/162, 5/166, 6/168, 7/171, 8/187, 9/187, 10/191
బౌలింగ్: బుమ్రా 7-1-19-2, సిరాజ్ 8-0-50-2, హార్దిక్ 6-0-34-2, కుల్దీప్ 10-0-35-2, జడేజా 9.5-0-38-2, శార్దూల్ 2-0-12-0

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి)ఇప్తికార్ (బి)షాహిన్ అఫ్రిది 86, శుభ్‌మన్ (సి)షాదాబ్ (బి)షాహిన్ అఫ్రిది 16, విరాట్ కోహ్లి (సి)నవాజ్ (బి)హసన్ అలీ 16, శ్రేయస్ (నాటౌట్) 53, కెఎల్ రాహుల్ (నాటౌట్) 19, అదనం 2. (30.3ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 192పరుగులు. **వికెట్ల పతనం:** 1/23, 2/79, 3/156
బౌలింగ్: షాహిన్ అఫ్రిది 6-0-36-2, హసన్ అలీ 6-0-34-1, నవాజ్ 8.3-0-47-0, హరీస్ రవూఫ్ 6-0-43-0, షాదాబ్ 4-0-31-0

విలియమ్సన్‌కు గాయం

ముంబయి: న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ గాయపడ్డాడు. శుక్రవారం బంగ్లాతో మ్యాచ్‌కు బరిలోకి దిగాడు. బంగ్లాపై 78పరుగులతో రాణించిన విలియమ్సన్ ఆ తర్వాత గాయం కారణంగా రిటైర్డ్‌హార్ట్‌గా మైదానాన్ని వీడాడు. బంగ్లాపై పరుగు తీస్తుండగా ఫీల్డర్ విసిరిన బంతి నేరుగా విలియమ్సన్ వేలికి తాకింది. కాసేపు విలవిల్లాడిన విలియమ్సన్ చికిత్స తీసుకుని ఇన్నింగ్స్‌ను కొనసాగించాడు. అయితే, నొప్పి మరీ ఎక్కువగా ఉండటంతోపాటు రిటైర్డ్ హర్ట్‌గా డగౌట్‌కు వెళ్లిపోయాడు. గాయాన్ని పరిశీలించిన వైద్యబృందం రెండు వారాలు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.

పాయింట్ల పట్టిక

వ.స.	దేశం	ఆ	గె	ఓ	పా	నె.ర.
1.	భారత్	3	3	0	6	+1.82
2.	న్యూజిలాండ్	3	3	0	6	+1.60
1.	దక్షిణాఫ్రికా	2	2	0	4	+2.36
4.	పాకిస్తాన్	3	2	1	4	-0.13
5.	ఇంగ్లండ్	2	1	1	2	+0.55
6.	బంగ్లాదేశ్	3	1	2	2	-0.69
7.	శ్రీలంక	2	0	2	0	-1.16
8.	నెదర్లాండ్స్	2	0	2	0	-1.80
9.	ఆస్ట్రేలియా	2	0	2	0	-1.84
10.	ఆఫ్ఘనిస్తాన్	2	0	2	0	-1.90

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రేట్

CENTRAL GOVERNMENT EMPLOYEES WELFARE HOUSING ORGANISATION, (CGEWHO)
An Autonomous Body under the aegis of Ministry of Housing and Urban Affairs, Govt. Of India, New Delhi
announces "VISAKHAPATNAM HOUSING SCHEME" at Pendurthi now open for GENERAL PUBLIC on "FIRST COME FIRST SERVE BASIS" till 30.11.2023

PROJECT HIGHLIGHTS
525 Flats in Gates Society (1, 2 & 3 BHK)

Pendurthi Junction : 0.5 Kms
Government Hospital : 1.2 Kms
Government High School : 1.2 Kms
Government College : 1.5 Kms
Saripalli NH-16 : 1.5 Kms
Visakhapatnam Airport : 12 Kms
Simhachalam Temple : 10 Kms

1 BHK : 80 DUs @ ₹ 27,15,300/- SBA*-663 Sft (Carpet Area**- 445 Sft)
2BHK : 330 DUs @ ₹ 52,86,750/- SBA*-1291 Sft (Carpet Area**- 829 Sft)
3BHK : 115 DUs @ ₹ 66,25,500/- SBA*-1618 Sft (Carpet Area**- 1143 Sft)

Note : (a) All above Cost of DUs are including GST @5%.
(b) 1% towards IFMS & 1% towards Advance Maintenance charges of total cost for 1 year of DU will be charged extra.
(c) Parking Optional at extra cost.

*SBA- Super Built-up Area.
**As per RERA Guidelines 'Carpet Area is net usable floor area including internal partitions walls but excluding balconies, external walls and all other common areas'.

Artistic Impression
CBC 20105/15/0012/2324

AMENITIES
Swimming Pool | Community Center (G+2 Conf.) | Green spaces & kids play area | Outdoor Games
24x7 CCTV Surveillance | Generator Backup | Fully Equipped Gym | Indoor Games Room

And Many More Lifestyle Amenities as per Scheme Brochure.

For more information please visit our website www.cgewho.in or contact:
Site Office: Anil Kumar : 91822 09926 | Ajay Kumar: 8977302010
Head Office: Varender Beri: 70650 44985 | Samudrala V R Krishna: 9871115069
Site Address: Near Pendurthi Junction, Anakapalli Road, Visakhapatnam, Andhra Pradesh
Head Office: CGEWHO, 6th Floor, 'A' Wing, Janpath Bhawan- Janpath, New Delhi

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68